
జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 7 సంచిక - 19 పక్షపత్రిక అక్టోబర్ 1-15, 2016



# మహాత్మా 2.0...

## గాంధీని పునరావిష్కరించుకోవాల్సిన సమయమిది










# వీరజవానులకు లోక్‌సత్తా సెల్యూట్




జమ్మూకాశ్మీర్‌లోని ఉరీ సెక్టర్ సైనిక క్యాంపులో ఉగ్రవాదుల దాడికి మరణించిన వీరజవానులకు లోక్‌సత్తా పార్టీ ఘనంగా నివాళులర్పించింది. దాగుడుమూతలకు స్వస్తి చెప్పి స్పష్టమైన వ్యూహాత్మక వైఖరితో పాకిస్తాన్, చైనా సరిహద్దుల వద్ద వ్యవహరించాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. అమరులైన జవానుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ బరితెగింపునకు పాకిస్తాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పాల్సిందేనన్నారు. స్వీయనాశనమా? అభివృద్ధా- పాకిస్థాన్ తేల్చుకోవాలన్నారు. మోదీ ప్రభుత్వం కాశ్మీరీ ప్రజల మనసులు గెలిచేందుకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాల్ని కల్పించటానికి, దేశవ్యాప్త విధానంలో భాగంగా కాశ్మీర్‌కు మరింత స్వయం ప్రతిపత్తిని అందించటానికి వేగంగా చర్యలు చేపట్టాలన్నారు. విజయనగరంలోని గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులు ఉంచి లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ, ఇతర నేతలు సెల్యూట్ చేశారు. ఈ దాడులు పిరికిపందల చర్యని, బహుముఖ వ్యూహంతో ఉగ్రవాదాన్ని కట్టడి చేయాలని బాబ్జీ అన్నారు. ఉరీ ఉగ్రదాడిలో అమరులైప వీరజవానులకు శ్రద్ధాంజలిగా లోక్‌సత్తా అనుబంధ విద్యార్థిసత్తా వరంగల్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించింది. స్థానిక అశోక్ సర్కిల్ నుంచి పోలీస్ క్వార్టర్స్ వరకు జరిగిన ఈ ర్యాలీకి లోక్‌సత్తా ఉద్యమసంస్థ సీనియర్ నాయకుడు డా॥ పి. కోదండరామారావు, డీఎఫ్‌వో పురుషోత్తం హజరయ్యారు. విద్యార్థిసత్తా నాయకులు సాయిచరణ్, అరుణ్, శివ మనీష్, మహమ్మద్ రోమనుద్దీన్, రాహుల్, సంజన, పూజిత, స్వాతి, వాగ్దేవి కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక అక్టోబర్ 1-15, 2016

సంపుటి - 7 సంచిక - 19

## లోపలి పేజీల్లో...

మహాత్మా 2.0 ........................................ 5

జాతీయోద్యమ రథం దారితప్పిన వైనం.......... 10

ఉదార హిందువులూ ముస్లిం విశ్వాసులూ....... 13

బ్రిటన్-భారత్ నైతిక నాయకత్వం అందించే.... 16

ఆమరణ దీక్ష ఫలితం ఏమిటి?...................... 19

జాతీయతపై జాతీయ పార్టీలు .................... 22

జాతీయ వైద్య కమిషన్ స్వాగతిస్తున్నాం, కానీ... 24

ఎజెండాలో సరైన విద్యలేని వింత ................ 26

కమిషన్ ద్వారానే న్యాయ నియామకాలు........ 29

జాతి ఐక్యతా దినోత్సవంగా జరుపుకుందాం... 31

రైల్వేజోన్ ఉత్తరాంధ్రుల హక్కు..................... 34

## సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

### సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు


బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# ఆందోళనా పద్ధతులపై ఇప్పటికైనా చర్చ జరగాలి




**లో**క్‌సత్తా పార్టీ అంతర్గత సమావేశాలలో ఒకోసారి బైటివారిని కూడా కూర్చోబెట్టిన సందర్భాలున్నాయి. అలాంటప్పుడు, నా సహచరులు కొంతమంది బాధపడేవారు. పార్టీ వ్యవహారాల్లో బైటివారి జోక్యం ఏమిటి? వాళ్లకేం తెలుసు? అని నిజాయతీగానే ఆవేదన చెందుతుండేవారు. వ్యక్తిగత పనులను మినహాయించి ఉమ్మడి అవసరాల కోసం ఏదోకరూపంలో పనిచేసే ప్రతివ్యక్తీ రాజకీయం చేస్తున్నట్టే నేను భావిస్తాను. అందుకే మీడియా వారు సహా ఈదేశంలో చాలామంది రాజకీయం చేస్తున్నట్టు భావిస్తూ వారికి లోక్‌సత్తా ప్రస్థానాన్ని తరచూ వివరిస్తుండేవాడిని. కానీ సమాజ పరిణతి దృష్ట్యా వీలైనన్ని సమావేశాలలో జన జీవితంలో మార్పు పట్ల ఆసక్తి కలవారందరికీ స్వేచ్ఛగా ప్రవేశం ఉండేలా పరిమితులు పాటించాం. నేను లోక్‌సత్తా పార్టీ రోజువారీ వ్యవహారాల నుంచి వైదొలిగి మరొకరికి బాధ్యతలు అప్పగించిన 2010 వరకూ దాదాపు ఇలాగే జరిగింది. లోక్‌సత్తా చొరవతో జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ బిల్లును రూపొందించిన ముగ్గురు న్యాయకోవిదుల్లో ఒకరైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వెంకటాచలయ్యగారిని కూడా ఇలాగే ఓసారి లోక్‌సత్తా పార్టీ సమావేశంలో కూర్చోబెట్టాను. రాజకీయాలను దాదాపు ద్వేషించే ఆయనలో ఆ సమావేశం తర్వాత మార్పువచ్చింది. రాజకీయం పవిత్ర వ్యాసంగం అన్న లోక్‌సత్తా వాదనను నేను అంగీకరిస్తున్నాను అన్నారాయన. అక్టోబర్ 2న మహాత్మా గాంధీ జన్మదినోత్సవం రోజున 2006న ఆవిర్భవించిన లోక్‌సత్తా పార్టీ.. ప్రస్తుతానికి ఎన్నికలలో పోటీచేయకపోయినా, పరోక్షంగా మంచి రాజకీయాన్నే కొనసాగిస్తోంది. అంతకుముందు పదేళ్లు లోక్‌సత్తా ఉద్యమం సాధించిన సంస్కరణల భుజాల మీద నిలబడి లోక్‌సత్తా పార్టీ ఏర్పడింది. అంబేద్కర్‌ను ప్రాచుర్య పార్టీలు ఇప్పుడు దేవుడు అంటున్నాయిగానీ, లోక్‌సత్తాకి తొలినుంచీ గాంధీతో సమానంగా ఆయన కూడా ఒక ఐకాన్. గాంధీ, అంబేద్కర్‌ల పరిమితుల్ని అధిగమించేలా వారిద్దరి భావజాలాల్నీ కలపాల్సిన అవసరం భారత జాతి నిర్మాణానికి కీలకమని లోక్‌సత్తా భావించింది. లోక్‌సత్తా కొత్త తరానికి కొత్త రాజకీయం అంటూ వచ్చినప్పుడు మళ్లీ గాంధీ, అంబేద్కర్‌ల ప్రస్తావన ఎందుకు అని కొందరు మిత్రులు ఆనాడు ప్రశ్నించారు. లోక్‌సత్తా చేస్తున్న కృషి నిస్సందేహంగా భారత్‌లో నభూతో అయినా, ఇన్ని వైరుధ్యాల మధ్య ఈ స్థాయిలో కృషి ప్రపంచంలో ఎక్కడా జరగకపోయినా.. అనేకుల భుజాల మీద నిలబడబట్టే లోక్‌సత్తా తన దార్శనికతను రూపొందించుకో గలిగిందని బలంగా నమ్ముతున్నాం. అందుకే గాంధీ, అంబేద్కర్‌లను కలుపుతూ లోక్‌సత్తా విధానాలను రూపొందించాం. గాంధీ లేకున్నా ఈదేశానికి స్వతంత్రం వచ్చి ఉండేది. యుద్ధాల్లో అలసిసొలసిన బ్రిటీషువారు వారంతటవారే ఈదేశాన్ని వదిలివెళ్లిపోయేవారు. కానీ గాంధీ లేకుంటే స్వతంత్ర భారతం ఒక దేశంగా నిలబడగలిగేది కాదు. ఒకరితో ఒకరు తన్నుకు చచ్చే పరిస్థితి ఉండేది. ఎన్నో జాతులు, తెగలు, మతాలు, కులాలు, భాషలు ఉన్న ఈ దేశాన్ని ఏకం చేసిన మహాత్ముడు గాంధీ. అలాగే విధానాలపరంగా ఆయనకు కొన్ని పరిమితులున్నాయి. స్వతంత్రం వచ్చాక నిరాహార దీక్షలు వంటి గాంధేయ పోరాటపంథాలు అసంబద్ధమైనవన్న అంబేద్కర్ మాటల్ని తోసిపుచ్చలేం. గాంధీ ప్రతిపాదించిన అధికార వికేంద్రీకరణను వ్యతిరేకించి అంబేద్కర్ పొరపాటు చేసినా ప్రజాస్వామ్య వ్యవస్థలో పోరాటపద్ధతులపై చాలా పరిణతితో మాట్లాడారు. ఓటుహక్కు, భావప్రకటనా స్వేచ్ఛ ఉన్న దేశంలో రాస్తారోకోలు, బంద్‌ల పేరుతో ఇతరుల హక్కుల్ని హరించటం, నిరాహారదీక్ష బెదిరింపులు, ప్రభుత్వాస్తుల ధ్వంసం వంటి వాటికి తావు లేదు. గాంధీ, అంబేద్కర్‌లను కలపటంలో భాగంగా అధికార వికేంద్రీకరణ, బహిరంగ చర్చ ప్రమాణాలను పెంచటం, పరస్పర విరుద్ధమైనవైనా అన్ని వర్గాల ప్రయోజనాలనూ సమన్వయం చేయటం, హింసకు తావులేకుండా, రాజ్యాంగ పద్ధతుల్లో సృజనాత్మక ఒత్తిడితో పోరాటపంథా వంటివన్నిటినీ మన వ్యవస్థలో భాగం చేసుకోవాలి. అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించటాన్ని వీటికి జోడించాలి. లోక్‌సత్తా ఉద్యమ ఆవిర్భావం నుంచీ వీటన్నిటినీ తన ఎజెండాలో, నూతన రాజకీయ సంస్కృతిలో భాగం చేసుకుంది. తేలిగ్గా ప్రచారాన్ని అందించే బంద్‌లు, రాస్తారోకోలను లోక్‌సత్తా వ్యతిరేకించటాన్ని ప్రొఫెసర్ నాగేశ్వర్ వంటి సోదరులు విమర్శిస్తుంటారు. బుద్ధదేవ్ భట్టాచార్యలాంటి సీనియర్ మార్క్సిస్టులు బంద్‌ల వల్ల నష్టాన్ని బహిరంగంగా వివరించినా చాలామంది మిత్రులు ఇంకా దిద్దుబాట పట్టలేదు. అయితే ఇటీవల జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్, పౌర సమాజంలో, ప్రాచుర్య మీడియాలో కొంతమంది బంద్‌లు వంటి ఆందోళనాపద్ధతులకు కాలం చెల్లిందనటం ఆహ్వానించదగ్గ పరిణామం. నిరసన తెలిపేందుకు, డిమాండ్ల సాధనకు ఎలాంటి ఆందోళనాపద్ధతులుండాలి అనే అంశంపై ఏకాభిప్రాయ సాధనకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు సమావేశాలు జరపాలని కొన్నేళ్లుగా లోక్‌సత్తా కోరుతోంది. ఇప్పటికైనా ఆ పని చేయాలి. లోక్‌సత్తాకు ఓట్లు, సీట్లు ఎప్పుడొస్తాయో ప్రజలు తేల్చుకోవాలిగానీ, లోక్‌సత్తా భావజాలమే భారతదేశ సుస్థిరాభివృద్ధికి సరైన పరిష్కారమనటానికి మున్ముందు ఇంకా ఎన్నో రుజువులు వస్తాయని మాత్రం నిశ్చయంగా చెప్పగలం. గాంధీతో పాటు జన్మదినోత్సవం జరుపుకుంటున్న మహానేత లాల్‌బహదూర్ శాస్త్రికి కూడా వినమ్రంగా నివాళులర్పిస్తూ.. అజరామరమైన లోక్‌సత్తా భావజాలాన్ని సాకారం చేయటం కోసం ప్రత్యక్షంగా పరోక్షంగా కృషి చేస్తున్నవారందరికీ మరోసారి మనస్ఫూర్తిగా అభినందనలు తెలియచేస్తున్నాను.

మీ



## కార్టూన్ కార్నర్




## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.


## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# మహాత్మ 2.0...

## గాంధీని పునరావిష్కరించుకోవాల్సిన సమయమిది




**జా**తీయోద్యమ నాయకుల వారసత్వాన్ని సొంతం చేసుకునేందుకు దేశంలోని రాజకీయ పార్టీల మధ్య ఇటీవల బాహాబాహీ తరహా ప్రయత్నాలు జరుగుతున్నాయి. జాతిని కాలాతీతంగా ప్రభావితం చేయాలంటే చాలా గట్టి పునాది కావాలని ప్రధాని నరేంద్రమోదీ హయాంలోని బీజేపీవారు గుర్తించటంతో ఈ కృషి మొదలైంది. రాజకీయ డ్రామాను పండించేందుకు పనిలోపనిగా కాంగ్రెస్ మీద విరుచుకుపడ్డారు. నెహ్రూ వంశీయులు కుటుంబ వారసత్వం కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్, డా॥ అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్ వంటి గొప్పనేతలను ఉద్దేశపూర్వకంగా కాంగ్రెస్ వారు తొక్కేశారని ఆరోపిస్తూ పటేల్, అంబేద్కర్‌కు పెద్దపీట వేసే ప్రయత్నం బీజేపీ చేస్తోంది. ఇందులో భాగంగానే ఎన్నికలకు ముందు మొదలుపెట్టిన పటేల్ అతి పెద్ద విగ్రహ నిర్మాణ కార్యక్రమానికి అవసరమను కున్నప్పుడల్లా విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. ఇక అంబేద్కర్‌నైతే బీజేపీవారు దేవుడిలా భావిస్తున్నట్టు చిత్రీకరించే ప్రయత్నాలు జరిగాయి. అంబేద్కర్ పుట్టిన, చదువుకున్న వగైరా ప్రదేశాలు, ఇళ్లను దాదాపు ప్రార్థనామందిరాల్లా తయారుచేస్తున్నారు. అలాగే నెహ్రూ విధానాలపై విమర్శలు ఎక్కుపెట్టారు. క్రమంగా విమర్శల తీవ్రతను కొంత తగ్గించినా, నెహ్రూకు ప్రాచుర్యం మాత్రం తగ్గిస్తున్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ అగ్రనాయకత్వానికి రాజముద్రలా ఉపయోగపడుతున్న గాంధీని కూడా తమవాడిగా చేసుకునేందుకు బీజేపీవారు గట్టి ప్రయత్నం మొదలుపెట్టారు. విదేశాల్లోనూ గాంధీ విగ్రహాలను సీరియల్‌లా ఆవిష్కరించారు. కొందరు జాతీయ నాయకులను తమ వారసత్వ రాజకీయాలకు అనుగుణంగా ఉపయోగించుకుని ప్రజాస్వామ్యాన్ని దిగజార్చిన స్వయంకృతాపరాధానికిగాను, కాంగ్రెస్ మూల్యం చెల్లించటం మినహా ఏమీ చేయలేకపోతోంది.

నరేంద్ర మోదీ ప్రభుత్వంలో రూపకల్పన లోపంతో అత్యంత తక్కువ ఫలితాలను సాధించినా అతి ఎక్కువ ప్రచారం పొందిన కార్యక్రమ స్వచ్ఛభారత్‌కు స్ఫూర్తి ప్రదాత గాంధీ. గాంధీ కళ్లజోడే ఆ కార్యక్రమానికి ప్రధాన బ్రాండ్ అంబాసిడర్. 2019లో గాంధీ 150వ జయంతి నాటికి బహిరంగ మలవిసర్జన లేకుండా స్వచ్ఛభారత్‌ను సాధించాలన్నది కేంద్రప్రభుత్వం ముందున్న, నిర్దేశించిన లక్ష్యం. గాంధీ ఆశించిన స్వచ్ఛభారత్ మరుగుదొడ్లను కట్టటమేనా? అనేది వేరే చర్చనీయాంశం. కానీ గాంధీ జయంతిని, గాంధీ సంబంధ కార్యక్రమాలను మోదీ ప్రభుత్వం చాలా ప్రాధాన్యతాంశాలుగా భావిస్తోంది. కానీ విచిత్రంగా ఈ క్రమంలో గాంధీ, పటేల్ కన్నా అంబేద్కర్ చుట్టూ చర్చ ఎక్కువ జరుగుతోంది. అంబేద్కర్ చుట్టూ చర్చకు మూలమైన దళితుల విముక్తి కోసం గాంధీ తనదైన మార్గంలో ఎంతో కృషి చేసినా, స్వచ్ఛభారత్‌తో కూడా గాంధీ అస్పృశ్యతా నివారణ కృషి ముడిపడి ఉన్నా దళిత రాజకీయాలకు ఆయన కేంద్రబిందువు కాలేకపోతున్నారు.

మరోవైపు, అంబేద్కర్‌ని తమ ఐకాన్‌గా మార్చుకోవాలని

మోదీ సర్కారు, బీజేపీ తపనపడుతున్నా, అంబేద్కర్ భావజాలంతో ఆ పార్టీకి ఉన్న మౌలిక వైరుధ్యం కారణంగా అది తరచూ బెడిసికొడుతోంది. ఈ క్రమంలో దాడులు-ప్రతిదాడుల వల్ల పెచ్చరిల్లిన ప్రచారం.. దేశంలో వివక్షనెదుర్కొంటూ అత్యధికులుగా ఉన్న ప్రజల్లో అంబేద్కర్ చుట్టూ ఉన్న ఆశలు ఇంకా బలపడటానికి, విస్తరించటానికి తోడ్పడింది. ఉద్దేశపూర్వకంగానో, పొరపాటునో ఏ చరిత్రాత్మక శక్తిని అణగదొక్కినా రెట్టించిన శక్తితో ఏదోకరోజు అది బయటపడుతుందనటానికి అంబేద్కర్ చుట్టూ పెరుగుతున్న చర్చే తార్కాణం. అంతర్జాతీయంగా కాకపోయినా, దేశీయంగా కొన్ని కోణాల్లో ఈవేళ ప్రభావం తగ్గుతోందనుకుంటున్న గాంధీ విషయంలోనూ ఇదే వాస్తవమవుతుంది. ఓ గాంధీని, ఓ అంబేద్కర్‌ని ఎవరూ పనిగట్టుకుని అణగదొక్కలేరు. కొన్ని పరిమితుల మధ్యే అయినా.. వారి లక్ష్యాలు, భావాలు కాలాతీతమైనవి కాబట్టి గాంధీ తిరిగి చర్చల్లోకి రావటాన్ని ఎవరూ ఆపలేరు. కానీ అసలు సమస్య అది కాదు.

ఎవరి ఆలోచనలు, భావాల అవసరమైతే ఇంకా ఉంటుందో అటువంటి మహనీయులను కేవలం ఉత్సవ విగ్రహాలుగా తయారుచేసి దండలు వేయటానికి పరిమితమవటం ఒక సమస్యయితే, అసలు ఆ నాయకుల గురించే తెలియనివారు ఈ తరంలో పెరుగుతుండటం ఇంకా ఆందోళనకర సమస్య. ఒక రకంగా జాతి ఈవేళ ఎదుర్కొంటున్న పెద్ద సమస్య. విద్యార్థుల్లో నైతికాంశాల పట్ల ఆసక్తి నానాటికీ తగ్గిపోతోందని ఇటీవల పియర్సన్ వాయిస్ ఆఫ్ టీచర్స్ తాజా సర్వేలో 42శాతం మంది ఉపాధ్యాయులు చెప్పిన నేపథ్యంలో, గాంధీ గురించి మున్ముందు ఎలా గుర్తించుకోగలుగుతారు? గాంధీ బొమ్మ ఉన్న కరెన్సీ నోట్ల స్థానంలో ఎలక్ట్రానిక్ లావాదేవీలు చేస్తున్న యువతరం పెరుగుతుండటంతో, ఆ ప్రమాదం ఇంకా పెరుగుతుంది. రోల్‌మోడల్స్ కనుమరుగవుతున్న ఈ పరిస్థితిని మార్చకపోతే ప్రభుత్వాలు (పార్టీ రాజకీయావసరార్థమైనా) ఎన్ని వేల కోట్లు ఖర్చు పెట్టి నాయకులకు ప్రచారం కల్పించినా, జన జీవితంలో వారు భాగం కాలేరు. ఈ ప్రమాదాన్ని గురించి నరేంద్ర మోదీ కొన్ని చోట్ల మాట్లాడారు కూడా. మన విద్యార్థుల్లో చరిత్ర స్పృహ బాగా తగ్గిపోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కానీ అందుకు కారకులెవరో, పరిష్కారమేమిటో మాత్రం ప్రధాని చెప్పలేదు. అందుకు కారణం మన రాజకీయం, మన విద్యావ్యవస్థ, మన సమాజం కాదా? అందరికీ నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యతను ప్రభుత్వాలు అమలుచేసి ఉంటే స్వతంత్రం వచ్చి ఇన్నేళ్లయినా చరిత్ర, చరిత్ర ప్రాధాన్యత తెలియని అజ్ఞానంలో ఇంకా ఇన్ని కోట్లమంది మగ్గుతూ ఉండేవారా? గాంధీని మహాత్ముడి స్థాయిలో మనదేశమేకాకుండా ప్రపంచదేశాల్లో అనేకం గుర్తించడానికి ఆయన వ్యక్తిగత నైతిక ప్రవర్తన కాదు కారణం. అలాగంటే, మనదేశంలోనే చాలామంది గాంధీ కంటే గొప్ప గాంధేయవాదులున్నారు. స్వతంత్రం వచ్చాక దేశం భ్రష్టుపట్టినా గాంధీ మార్గం వీడకుండా వ్యక్తిగతంగా ఆచరించి చూపినవారున్నారు. కానీ గాంధీ గొప్పతనం వ్యవస్థీకృత నైతికతలో ఉంది. వ్యవస్థల్ని సక్రమంగా నిర్వహించేందుకు రాజకీయం ఓ పవిత్ర వ్యాసంగంగా ఉండాలని గాంధీ భావించారు, బోధించారు. అలాంటి రాజకీయం వస్తే జనాభాలో 90శాతానికిపైగా నైతిక, ఆరోగ్యకర జీవనాన్ని సాగించటానికి కావలసిన ప్రోత్సాహకర వాతావరణం నెలకొంటుంది. మంచిని ప్రోత్సహించటం, చెడును నిరుత్సాహపరచటమే ప్రభుత్వాలు, రాజకీయ వ్యవస్థ చేయాల్సిన అసలైన పని. గాంధీని నైతిక ఛాదస్తపు వ్యక్తిగా భావించే ధోరణి నుంచి ఓ వ్యవస్థ కోసం నిలబడిన మహామనీషిగా యువతరం, భవిష్యత్తు తరాలు గుర్తించేలా చర్చను మరల్చాలి. గాంధీని అనుసరించటం ఛాందసం కాదు, ఆధునిక అవసరం అని వారు గుర్తించేలా చేయాలి. ఇందుకోసం గాంధీని పునరావిష్కరించాలి... యస్, మహాత్మా 2.0కి సమయమిది.

ప్రభుత్వం గాంధీని ఓ నైతిక ప్రవక్తలా, స్వచ్ఛభారత్‌కు ఐకాన్‌గా మాత్రమే ఈ దేశ ప్రజలలో ప్రచారం చేస్తే, పౌరసమాజం అలాగే కార్యక్రమాలు నిర్వహిస్తే భవిష్యత్తు భారతం నష్టపోతుంది. తన జీవితకాలం కంటే ఎన్నో తరాలు ముందుగా ఆలోచించిన మహనీయుడు గాంధీ. బాపూ వ్యక్తిగా ఓ మామూలు మనిషి. ఈవేళ నాయకులుగా చెప్పుకుంటున్నవారికుండే పెద్ద ఒడ్డూపొడుగూ, గొప్ప తెలివితేటలు లాంటివేమీ ఆయనకు లేవు. అయినా ప్రపంచానికి నాయకత్వ లక్షణాలంటే ఏమిటో తెలియచెప్పిన మహనీయుడు. తాను చెప్పిన సిద్ధాంతాల్ని ఆచరణలో చూపించాడు కాబట్టే ఆయన జీవితమే ఒక సందేశంగా మారింది. ఎందరో జాతీయ నాయకులున్నా గాంధీకున్న విశిష్టత ఆయన దార్శనిక నాయకత్వం, పోరాటపంథా. గాంధీ లేకున్నా ఈదేశానికి స్వతంత్రం వచ్చేది కానీ.. గాంధీ లేకుంటే ఈదేశం ఉండేది కాదు. ముక్కచెక్కలుగా ఉన్న దేశాన్ని ఏకతాటి మీదకు తెచ్చిన ఘనత గాంధీది. గాంధీజీ రాజకీయాన్ని ఓ పవిత్ర వ్యాసంగంగా

ఆచరించటం వల్లే స్వాతంత్ర్యానంతరం రెండుతరాలకు సరిపడా మనకు అద్భుత నాయకత్వం మనకు లభించింది. ఆ తర్వాత వచ్చిన నాయకత్వం దేశానికి చీడపురుగుల్లా మారారు. స్వతంత్ర భారతదేశంలో గాంధీ విలువల్ని కార్యాచరణగా మలచుకోవటంలో మనం విఫలమవటమే మనల్ని సంక్షోభంలోకి నెట్టింది. నాయకుడిగా ఎదగడానికి ద్వేషభాష వాడుతూ ప్రజల మధ్య చిచ్చుపెడుతున్న ఆధునిక నాయకులు, మేధావులు గాంధీ ముందు ఎంత అల్పులో ప్రత్యేకించి వివరించనక్కర్లేదు. న్యాయాన్ని పొందటానికి శత్రువుకి న్యాయం అందించటమే సరైన మార్గం అని గాంధీ చెప్పిన మాటను మన రాజకీయ పార్టీలు, నేతలు ఎంతమేరకు పాటిస్తున్నారు? గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రికి నివాళులర్పించే నైతిక హక్కు ఎంతమందికుంది?-మనందరం లోతైన సమీక్ష చేసుకోవాలి" మన అసహనం, అబద్ధాలు, ఇతరులకు న్యాయం అందించటంలో వైఫల్యం, భయాందోళనల్ని రేకెత్తించటం, మన సమస్యలకు ఇతరులను నిందించటం ఇవన్నీ అనేక సంక్షోభాలకు దారితీస్తున్నాయి. మహాత్మాగాంధీని సాంప్రదాయ రాజకీయపార్టీలు రోజూ చంపుతున్నా, ప్రకటనల్లో అపహాస్యం చేస్తున్నా గాంధీజీ ప్రజల మనసుల్లో సజీవంగా ఉన్నాడని అనేక పరిణామాలు రుజువు చేస్తూనే ఉన్నాయి. అయోధ్యపై ఒకనాడు ఉద్రేకాలకు లోనైన ప్రజలు ఈవేళ ఎటువంటి తీర్పు వెలువడినా ఎలాంటి విభేదాలు లేకుండా చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకుందామని మతాలకతీతంగా భావిస్తుండటం చూస్తుంటే బాపూ భావాలు కొంతయినా మన డీఎన్ఏలో భాగమయ్యాయనిపిస్తుంది. సవాలు ఎంత తీవ్రంగా ఉన్నా.. పోరాటంలో హింసకు స్థానం లేకుండా నాగరికమైన సృజనాత్మకమైన పంథాలోనే గాంధీ పోరాడారు.

ఆధునిక భారతదేశానికి ఎంతో అవసరమైన ఈ గాంధీకవిశిష్టతల్ని ఆయన ఈ ఏడాది జన్మదినోత్సవం (అక్టోబర్ 2) నుంచైనా వెలికితీసి పునరావిష్కరించేందుకు పాలకులు, సమాజం సంకల్పించాలి. చరిత్రకు సరైన వైపున ఉండాలంటే భారతదేశం ఇప్పుడీ ప్రయత్నాన్ని జాతి నిర్మాణ కార్యక్రమంలో భాగంగా చేపట్టాలి. గాంధీ పునరావిష్కరణలో ప్రధానాంశాలను చర్చించే ముందు ఆయన జీవిత ప్రస్థానాన్ని రేఖామాత్రంగానైనా గుర్తుచేసుకోవటం అవసరం.

నైతిక రాజకీయ నాయకుడిగా 20వ శతాబ్దపు భారత ఉపఖండ చరిత్రలో శిఖరప్రాయుడు మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ. గుజరాత్‌లోని కథియవాడ్‌లో 1869, అక్టోబర్ 2న జన్మించారాయన. లండన్‌లో బారిస్టర్ చదివి తర్వాత ప్రాక్టీసు కోసం దక్షిణాఫ్రికా వెళ్లారు. అక్కడ ఉండగానే ఆయన తన వ్యక్తిత్వాన్ని, ఆదర్శాలను, పోరాటపంథాను నిర్ణయించుకున్నారు. దక్షిణాఫ్రికాలో స్థిరపడిన భారతీయుల పౌరహక్కుల కోసం అహింసాయుత సహాయనిరాకరణ పద్ధతి ద్వారా గాంధీ పోరాటం గావించారు. అక్కడ విజయం సాధించి 1916లో భారత్‌కు తిరిగొచ్చారు. భారత రాజకీయాల్లో గాంధీ ఒక నూతన సంఘటనగా పరిణమించారు. తన మౌలిక విశ్వాసాలన్నిటినీ ఆయన 1919లో ప్రచురించిన 'హింద్ స్వరాజ్'లో పేర్కొన్నారు. అదే సంవత్సరం బాప్టిస్టు చర్చికి చెందిన రెవరెండ్ జోసఫ్ డోక్ గాంధీ జీవిత చరిత్రను రచించారు. ఒక ఆశ్రమం నెలకొల్పి గాంధీ స్థానిక సమస్యల మీద సత్యాగ్రహ పోరాటాన్ని ప్రారంభించారు. చంపారన్ (బీహార్), ఖైరా (గుజరాత్), అహ్మదాబాద్‌లో రైతులు, మిల్లు కార్మికుల పక్షాన ఈ పోరాటాలు చేశారు. అయితే గాంధీ చేసిన ఈ ప్రయోగాల ప్రభావం అప్పట్లో ఇండియా మీద అంతగా లేదు. భారత్‌కు వచ్చిన నాలుగు సంవత్సరాల తర్వాత కూడా ఆయన రాజకీయాల్లో ప్రాముఖ్యతలోకి రాలేదు. రౌలత్ బిల్లుకు వ్యతిరేకంగా 1919లో దేశవ్యాప్త హర్తాళ్‌కు పిలుపునిచ్చిన తర్వాతే గాంధీ జాతీయనాయకుడిగా పరిణమించారు. ఖిలాఫత్, సహాయ నిరాకరణోద్యమాలతో 1920 చివరినాటికి గాంధీ భారత రాజకీయాల్లో అగ్రస్థాయికి వచ్చి వ్యూహంలో ప్రత్యర్థులను మించిపోయారు. బోల్షివిక్ విప్లవసారథి లెనిన్ సైతం గాంధీని విప్లవాత్మక నాయకుడిగా అంచనా వేశారు. కాంగ్రెస్ బయట, లోపల కూడా గాంధీ విమర్శకులు, వ్యతిరేకులూ ఉన్నారు. ఆయనతో ఏకీభవించలేకపోయినా అవసరం కొద్దీ నాయకత్వాన్ని అంగీకరించినవారూ ఉన్నారు.

1930లో నిత్యావసరమైన ఉప్పు కోసం కొల్లాయిగుడ్డ కట్టి దండి యాత్ర చేసి గాంధీ సామాన్య ప్రజల్లో ఆవేశాన్ని రగిల్చారు. బ్రిటీష్ వాళ్లు రేపిన కులం, మతం చిచ్చులను తనదైన బాణీలో ఆర్పేందుకు ప్రయత్నించారు. వ్యూహాత్మకంగా ముందుకు సాగిన గాంధీ 1942లో 'క్విట్ ఇండియా' పిలుపునిచ్చి తన పోరాటాన్ని ఉధృతం చేశారు. 1945లో రెండో ప్రపంచయుద్ధానంతరం చితికిపోయి వలసల్ని పాలించే శక్తిని కోల్పోయిన బ్రిటీష్ రాజ్యం పేకమేడలా కూలిపోయింది. 1948లో ఒక మతోన్మాది చేతిలో గాంధీ హతమయ్యారు. రౌండ్‌టేబుల్ సమావేశానికి లండన్ వచ్చిన గాంధీని చూసి బ్రిటన్ ప్రధానమంత్రి విన్‌స్టన్ చర్చిల్ కొల్లాయి కట్టిన బఫూన్‌గా

ఎద్దేవా చేశారు. యాభై ఏళ్ల తర్వాత అదే గాంధీ జీవితచరిత్రను బ్రిటీషర్లు సినిమాగా నిర్మించి కోట్ల సొమ్మును, అంతర్జాతీయ పురస్కారాలను పొందారు. తాను తెచ్చిన ఉపరితల స్వరాజ్యాన్ని పునాది స్వరాజ్యంగా సురాజ్యంగా మార్చే మరో గాంధీ కోసం వేల శిథిల విగ్రహాల నుంచి ప్రస్తుతం గాంధీ ఎదురుచూస్తున్నారు.

**మహాత్మా 2.0- ఐదు విలువలు**

మహాత్మా గాంధీ మౌలికంగా అయిదు విలువలు, సూత్రాల కోసం నిలబడ్డారని గుర్తించటం మన పునరావిష్కరణలో కీలకం. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఇప్పటికే వివిధ సందర్భాలలో ఈ అంశాల్ని ప్రస్తావిస్తూ వస్తున్నారు కూడా.

మొదటిది, గాంధీ నైతికరాజకీయాల కోసం నిలబడి, అధికారం ఒక లక్ష్యానికి మార్గమే తప్ప అంతిమం కాదు అని చాటిచెప్పారు. ప్రజాజీవితమంటే వ్యక్తిగత జీవితానికి కొనసాగింపేనని స్పష్టంచేశారు. చెప్పింది చేసి చూపారు. రెండోది, అన్యాయాన్ని కొనసాగించే యథాస్థితిని ప్రశ్నించాలన్నారు. అయితే ఆ క్రమంలో సవాలు ఎటువంటిదైనా హింసకు, విద్వేషాలకు దిగజారకుండా సృజనాత్మక ఒత్తిడి (క్రియేటివ్ టెన్షన్)తో వాటిని అధిగమించే పరిపక్వ నాయకత్వ సామర్థ్యాన్ని ఆయన ప్రదర్శించారు. ఆ నైపుణ్యంతోనే గాంధీ రకరకాల నేపథ్యమున్న ప్రజలతో కూడివున్నప్పటికీ ఈ గడ్డ మీద గొప్ప దేశాన్ని నిర్మించారు. మూడోది, అవకాశాలు అందరికీ అందాలని, ఏ తల్లి గర్భాన పుట్టినా ఎటువంటి వివక్షా ఉండకూడదని ఆయన నిరంతరం చెప్పేవారు. నాలుగోది, గ్రామస్వరాజ్యం, స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం గాంధీ నిరంతరం పోరాడారు. అధికారానికి పౌరుడు/పౌరురాలు, అతడు/ఆమె కుటుంబం కేంద్రబిందువుగా ఉండాలని ఆయన నిర్వంధ్వంగా చెప్పేవారు. గ్రామం లేదా వార్డుస్థాయిలో పౌరులకు సాధ్యమైనంత చేరువగా అధికారాన్ని వినియోగించే వ్యవస్థ ఉండాలని గాంధీ ఎంతో ఆర్తితో పోరాడారు. పరిమిత ప్రభుత్వం, నైతిక రాజకీయాలను ప్రజాసేవకు మార్గంగా గుర్తించారు. ఐదవది, ప్రకృతితో సామరస్యంగా ఉంటూ అవసరానికి మించిన సంపదకు ధర్మకర్తలా వ్యవహరించటం.

కాలాతీతమైన, సార్వజనీనమైన గాంధీజీ విలువలు మనలాంటి విస్తృతమైన, సంక్లిష్టమైన, వైవిధ్యమైన, ప్రాచీనమైన సమాజానికి సరిగ్గా సరిపోతాయి. అధికారాన్ని గ్రామాల వరకూ వికేంద్రీకరించి వ్యక్తి సుఖాన్ని, సమాజహితాన్ని అనుసంధానం చేసి పుట్టుకతో వివక్ష లేకుండా అందరికీ ఆత్మగౌరవం, స్వావలంబన గల జీవితాన్ని అందించాలని లోక్‌సత్తా ఈవేళ చేస్తున్న బహుముఖ పోరాటానికి గాంధీజీయే స్ఫూర్తినందించారు.

గాంధీ పాటించిన ఐదు విలువలనూ మన రాజకీయంలో, సమాజంలో భాగం చేసుకోవాలంటే.. అధికారాన్ని వికేంద్రీకరించి స్థానిక ప్రభుత్వాలకు, వార్డు స్థాయిలో ప్రజలకు సాధికారత కల్పించటం, అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధ పాలన అవసరం. గాంధీ కలలుగన్న రాజకీయం సాకారం చేయగల విధానాలివి. ఈ విధానాలున్న రాజకీయ, సామాజిక వ్యవస్థ కోసం ఓటు హక్కు, భావప్రకటనా స్వేచ్ఛతో పోరాడుతూనే గాంధీ పునరావిష్కరణలో భాగంగా రెండు ప్రతిజ్ఞల్ని కూడా మనం చేయాలి. ఆ ప్రతిజ్ఞల్ని అంతరాత్మ సాక్షిగా పాటించాలి.

**రెండు ప్రతిజ్ఞలు**

పౌరుల సాధికారత కోసం వారికి పూర్తిస్థాయి ఉపాధి అవకాశాల్ని కల్పించాలని గాంధీ ఎప్పుడూ ప్రయత్నించేవారు. ఇప్పుడు మనదేశంలో తక్షణావసరం ఉద్యోగాల సృష్టే. 20 ఏళ్లలో చైనా 20 కోట్ల ఉద్యోగాలను సృష్టిస్తే, భారతదేశం అదే సమయంలో 20లక్షల ఉద్యోగాలను సృష్టించగలిగింది.

గాంధీ పునరావిష్కరణ సందర్భంగా రెండు ప్రతిజ్ఞలు తీసుకోవటం ద్వారా మనం గాంధీ కలలుగన్న భారతదేశాన్ని నిర్మించగలం. మొదటిది, మనం బంగారం కొనకూడదు. ఒకవేళ కొనాల్సివస్తే, మనం అనుకున్నదాంట్లో 50శాతం మాత్రమే కొనాలి. రెండోది, మనలో మౌలికావసరాలకు ఢోకాలేనివారు తమ ఆదాయం, సమయంలో 10శాతం సమాజానికి కేటాయించాలి.

బంగారం డిమాండ్‌ని మనం తగ్గించి మనకున్నదాంట్లో 10శాతం సమాజానికిస్తే, మనం అభివృద్ధి చెందుతాం, దేశం అభివృద్ధి చెందుతుంది. గాంధీ సందేశాన్ని ఆధునీకరించి, మన నేటి అవసరాలకనుగుణంగా అన్వయించుకోవాలి. ప్రతిరోజూ సామాన్యమైన, ఆచరణాత్మకమైన పనులు చేద్దాం.

బంగారం దిగుమతిని ఆపితే, మనకు కరెంటు ఖాతా లోటు ఉండదు. బంగారం డిమాండ్‌ని మనం నియంత్రించలేకపోతే, మనం భారతదేశాన్ని నిర్మించలేం. బంగారం ఎటువంటి వాస్తవ అవసరాన్నీ తీర్చలేదు. మనదేశంలో 30,000 టన్నుల బంగారం ఉంది. ఇంత నిల్వ

ప్రపంచంలో ఏ దేశంలో లేదు. అయినా మనం ఏటా 1000 మెట్రిక్‌టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకుంటున్నాం. ఎంతో బంగారం నిరుపయోగంగా పడివుంది. ఇప్పుడున్న బంగారంతో ప్రతి కుటుంబానికి 100 గ్రాములు ఇవ్వొచ్చు. దిగుమతులు లేకుండానే మన బంగారం అవసరాలు తీరతాయి. బంగారం వంటి వస్తువుల విషయంలో కూడా మనం స్వావలంబనను పెంపొందించుకోకపోతే, గాంధీని స్మరించుకునే అర్హత మనకి ఉండదు.

మన ఆదాయం, సమయంలో 10శాతం సమాజానికి ఇవ్వాలన్న రెండో ప్రతిజ్ఞను నెరవేర్చటానికి “మనమేదో కోల్పోవాల్సిన పన్లేదు, మన కుటుంబాల్ని పస్తులుంచాల్సిన పన్లేదు.”

మన ఆస్తులను మన పిల్లలకు వారసత్వంగా ఇచ్చేటప్పుడు, 90శాతం వారికి, 10శాతం ఏదోకరూపంలో సమాజానికి చెందేలా ఏర్పాటు చేయాలి. కుటుంబం మొదటి ప్రాధాన్యం. తర్వాత సమాజం. మన ఇచ్చే 10శాతం ఆదాయం, సమయం, ఆస్తులతో సమాజాన్ని – గ్రంథాలయం, పార్కు, పాఠశాల, ఆసుపత్రి, మ్యూజియం వంటి వాటిని నిర్మించాలి. మనం స్వచ్ఛందంగా సేవకు కేటాయించే సమయం పాఠాలు చెప్పటానికి, ట్రాఫిక్ నియంత్రణకు, అగ్నిప్రమాదాలను ఎదుర్కోవటానికి, పార్కులు, శ్మశానాల నిర్వహణకు వెచ్చించాలి.

...రాజకీయాలలో ఉన్నవారు, రాజకీయాలను ద్వేషించేవారు, పౌరసమాజం అందరూ ఈ గాంధేయ విలువలు, విధానాలను జీవితంలో భాగం చేసుకోవాలి. గాంధీని జాతిపిత అని పిలుచుకునే అర్హతను భారత జాతి నిలబెట్టుకోవాలి. ఆయన విలువల్లో కొన్నయినా పాటించి మన బిడ్డల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలి.

గురువులు, సాధువులు, తారలు, కవులూ! – మీరూ మేల్కొనండి, మీ గళం విప్పండి. గాంధీ బోధించి ఆచరించిన ఈ విలువలను ప్రచారం చేసి ప్రజలను మేల్కొలపండి.

మన వ్యక్తిగత అభివృద్ధి, సమాజ హితం కలిసికట్టుగా సాగినప్పుడే మనం ఒక దేశాన్ని నిర్మించగలం. ప్రతిరోజూ చిన్న పనులతో ఈ లక్ష్యసాధనను ప్రారంభిద్దాం. గాంధీజీని పునరావిష్కరించుకోవటం ఇందుకోసమే.

# ప్రభుత్వాసుపత్రులను ప్రక్షాళన చేయాలి: లోక్‌సత్తా

రాష్ట్రంలో విద్య, వైద్యరంగాలలో విఫలమయ్యామని ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా అంగీకరించారని, మాటలకే పరిమితంకాకుండా ఆ నిజాయతీని చేతల్లో చూపి ఆ రెండు రంగాలనూ ప్రక్షాళన చేయాలని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు డిమాండ్ చేశారు. ప్రభుత్వాసుపత్రుల్లో సేవలు, చికిత్సలను సమగ్రంగా అంచనావేసేందుకు లోక్‌సత్తా పార్టీ రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న ఆసుపత్రుల సందర్శన కార్యక్రమంలో భాగంగా ఆయన హైదరాబాద్ నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిని సందర్శించారు. రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. నగరం, శివారు ప్రాంతాల నుంచి గత మూడునెలలుగా నిత్యం వేలమంది రోగులు వస్తుంటే ఆసుపత్రిలో సౌకర్యాలు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. ఓపీ విభాగంలో సరైన కౌంటర్లు లేవని, వైద్య నిపుణులు, నర్సులు, సిబ్బంది తగినంతమంది లేరన్నారు. గత నాలుగు నెలలుగా ఎక్స్‌రే మిషన్ పనిచేయటం లేదని, రోగుల నిస్సహాయతను ఆసరాగా చేసుకొని ఆసుపత్రి సిబ్బంది లంచాలు గుంజుతూ క్యూలైన్‌లో కాకుండా దొడ్డిదారిన వైద్యుల వద్దకు తీసుకెళ్తున్నారన్నారు. ఫీవర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్‌ను కలిసి సమస్యలు చర్చించారు. దోమలతో సీజనల్



వ్యాధులు పెరగటంతో రోజుకు రెండువేల మందికి పైగా రోగులు వస్తున్నారని, ఇతర ఆసుపత్రుల నుంచి వైద్యుల్ని డిప్యుటేషన్ మీద తీసుకుని సేవలందించే ప్రయత్నం చేస్తున్నామని శంకర్ తెలిపారు. ఉన్నంతలో మెరుగ్గా సేవలందించే ప్రయత్నం చేస్తున్నామని, లోక్‌సత్తా ప్రస్తావించిన లోపాల్ని సరిచేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ జీహెచ్‌ఎంసీ అధ్యక్షుడు దోసపాటి రాము, అంబర్‌పేట కన్వీనర్ ఎం. వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గారావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సరోజాదేవి, అనంతలక్ష్మి, శివ తదితర నాయకులు పాల్గొన్నారు.

# జాతీయోద్యమ రథం దారితప్పిన వైనం..
# ఈ దేశ చరిత్ర మనకు చెబుతున్నదేమిటి?

- డా॥ జయప్రకాష్ నారాయణ్



**అప్పటి పరిస్థితులను బట్టి సదుద్దేశంతో తీసుకున్న నిర్ణయాలు కూడా దీర్ఘకాలంలో ప్రతికూల ఫలితాలను కలగజేసే అవకాశం ఉంది. అందువల్ల మన విశ్లేషణ అప్పటి మన నాయకులు తీసుకున్న చర్యలు, వాటి పర్యవసానాలకు మాత్రమే పరిమితం కావాలి. అప్పుడే గతం నుంచి పాఠాలను నేర్చుకోగలుగుతాం. వాటి ఆధారంగా భవిష్యత్తును తీర్చిదిద్దుకోగలుగుతాం.**

పాకిస్తాన్ వ్యవస్థాపకుడు మహమ్మద్ అలీ జిన్నాపై ఎల్.కె అద్వానీ చేసిన వ్యాఖ్యలు దేశ విభజనపైన, జాతీయోద్యమంపైన తీవ్రస్థాయిలో చర్చను రేకెత్తించాయి. రాజనీతిజ్ఞులు సాధించిన విజయాలకు కాలగతిలో మరిన్ని హంగులు తోడవడం సహజమే అయినా మానవ తప్పిదాలపై చరిత్ర తీర్పు మాత్రం ఎప్పుడూ కటువుగానే ఉంటుంది. అబ్రహాం లింకన్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు, ఆధునిక భావాలను ఒంటబట్టించుకోనందుకు ప్రత్యర్థులు ఆయనను విమర్శించేవారు. సమకాలికులు ఎద్దేవా చేసేవారు. అంతర్యుద్ధం మొదలైన మొదటి మూడేళ్లలోనూ– సరైన నిర్ణయాలు తీసుకోలేని అసమర్థుడైన అధ్యక్షుడిగా లింకన్ ఎన్నో విమర్శలకు లోనయ్యారు. కానీ, ఇప్పుడోసారి వెనక్కు తిరిగి చూస్తే ఆయన సాధించిన విజయాల ముందు ఈ లోపాలేవీ కనబడవు. అయితే, విజయాలే కాదు, నాయకులు హ్రస్వదృష్టితో చేసే ఘోర తప్పిదాలు కూడా కాలం గడచిన కొద్దీ మరింత స్పష్టంగా గోచరిస్తాయి.

## నిష్పాక్షిక విశ్లేషణ ముఖ్యం

చారిత్రక విశ్లేషణ అనేది ఎప్పుడూ సమస్యాత్మకంగానే ఉంటుంది. సంక్షుభిత ఘటనల్లో ఎందరో నేతలు కీలకపాత్ర పోషించారు. అటువంటి సంఘటనల్లో వారి ప్రమేయంపై నిష్పక్షపాతంగా తీర్పు చెప్పడం అంత తేలికైన పని కాదు. సంఘటన జరిగిన కొన్ని దశాబ్దాల తరవాత దానిని విశ్లేషించడం మరింత కష్టసాధ్యమైన పని. కొన్ని సందర్భాలలో అది ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తుంది. అయినప్పటికీ చరిత్రను అధ్యయనం చేసి, గతించిన సంఘటనల నుంచి పాఠాలు నేర్చుకోవలసిన అవసరం ఉంది. జాతినేతలు అప్పట్లో సాధించిన విజయాలు, వారి వైఫల్యాలు, వారు తీసుకున్న అద్భుతమైన నిర్ణయాలు, వారు చేసిన ఘోర తప్పిదాలు– అన్నీ మనకు పాఠాలు నేర్పేవే. వాటిని పక్షపాతరహితంగా విశ్లేషించడం ద్వారా భవిష్యత్తులో అటువంటి తప్పిదాలు, వైఫల్యాలు పునరావృతం కాకుండా జాగ్రత్తపడే వీలు ఉంటుంది. దేశ విభజన, దానికి కారణమైన సంఘటనలూ ఇటువంటివే. అఖండ భారతం విభజనకు దారితీసిన ఆనాటి పరిస్థితులను అధ్యయనం చేయడం ద్వారా ఎన్నో పాఠాలు నేర్చుకోవచ్చు. కారణాలేవైతేనేం, జిన్నా, ఇతర ముస్లిం లీగ్ నాయకులు దేశ విభజనను కోరుకున్నారు. అనుకున్నది సాధించారు. వాళ్లను తప్పు పట్టినంత మాత్రాన చరిత్రను తిరగరాయలేమన్న సంగతి సుస్పష్టం. మహాత్మాగాంధీ, వల్లభాయ్ పటేల్, జవహర్‌లాల్ నెహ్రూ, మౌలానా ఆజాద్ వంటి మహామహులనదగిన నేతలు అప్పట్లో ఎంతగా ప్రయత్నించినా దేశ విభజనను



అడ్డుకోలేకపోయారు. అలా ఎందుకు జరిగింది? వారి నిర్లక్ష్య వైఖరి కారణంగానే తప్పిదాలు జరిగాయా? వారు తీసుకున్న చర్యలు దేశ విభజన మరింత సులువుగా జరిగేందుకే దోహదం చేశాయా?– ఈ రకమైన ప్రశ్నలకు సమాధానాలు వెతికే ప్రక్రియలో అప్పటి మన నాయకుల ప్రవర్తన, దాని వెనుక వారికి గల ఉద్దేశాల గురించి విశ్లేషించడం వల్ల ఎలాంటి ప్రయోజనమూ ఉండబోదు. అప్పటి పరిస్థితులను బట్టి సదుద్దేశంతో తీసుకున్న నిర్ణయాలు కూడా దీర్ఘకాలంలో ప్రతికూల ఫలితాలను కలగజేసే అవకాశం ఉంది. అందువల్ల మన విశ్లేషణ అప్పటి మన నాయకులు తీసుకున్న చర్యలు, వాటి పర్యవసానాలకు మాత్రమే పరిమితం కావాలి. అప్పుడే గతం నుంచి పాఠాలను నేర్చుకోగలుగుతాం. వాటి ఆధారంగా భవిష్యత్తును తీర్చిదిద్దుకోగలుగుతాం.

భారతదేశ స్వాతంత్ర్యోద్యమాన్ని ఒకవూరు సింహావలోకనం చేసుకుంటే మన జాతీయవాద నాయకులు చేసిన ఐదు తప్పిదాలు దేశ విభజనకు మార్గాన్ని సుగమం చేశాయని తెలుస్తుంది. వాటిలో మొదటిది తొలి ప్రపంచయుద్ధం చివర్లో చోటు చేసుకుంది. ఈ యుద్ధం కారణంగా టర్కీలో నాటకీయమైన పరిణామాలు సంభవించాయి. టర్కీలో అప్పటివరకు అత్యున్నత స్థానమైన ఖలీఫా పదవి రద్దయింది. కమల్ అటా టర్క్ అధికారంలోకి వచ్చాడు. అతను సిసలైన లౌకికవాది. ఆధునిక భావాలు గలవాడు. ఈ పరిణామాలు టర్కీ దేశస్తులపై అంతగా ప్రభావం చూపలేదు. ఖలీఫా పదవి పునరుద్ధరణ కోసం వారు ఆందోళనలు కూడా చేపట్టలేదు. కానీ, దూరంగా ఉన్న ఇండియాలో మాత్రం టర్కీ పరిణామాల పట్ల ప్రకంపనలు మొదలయ్యాయి. ఆ దేశంలో రద్దయిన ఖలీఫా పదవి పునరుద్ధరించాలంటూ మన జాతీయోద్యమ నాయకులు ఇక్కడ ఖిలాఫత్ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. దీంతో ఉధృతంగా సాగుతున్న స్వాతంత్ర్యోద్యమం ఒక్కసారిగా మతం రంగును పులుముకున్నట్లయింది. ఆ తరవాత రాజకీయాలు కూడా క్రమంగా మతం ఉచ్చులో చిక్కుకున్నాయి. తదనంతర కాలంలో మతతత్వ రాజకీయాలే దేశ విభజనకు బీజం వేశాయి.

విభజనకు దారితీసిన మరో తప్పిదం 1937లో జరిగింది. ఆ ఏడాది రాష్ట్రాల చట్టసభలకు ఎన్నికలు జరిగాయి. ఊహించినట్టుగానే దేశవ్యాప్తంగా దాదాపు అన్ని రాష్ట్రాలలోనూ కాంగ్రెస్ విజయకేతనం ఎగురవేసి, ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. అయితే ఐక్య రాష్ట్రాల (యునైటెడ్ ప్రావిన్స్) విషయం వచ్చేసరికి ముస్లింలీగ్‌కు, కాంగ్రెస్‌కు మధ్య వివాదం తలెత్తింది. మెజారిటీ స్థానాలను కైవసం చేసుకున్నది కాంగ్రెస్సే అయినా, అధికారంలో ముస్లింలీగ్ కూడా వాటా కోరింది. రెండు కేబినెట్

పదవులు ఇవ్వాలని ముస్లింలీగ్ పట్టుబట్టింది. ఒక్క పదవే ఇస్తానని కాంగ్రెస్ భీష్మించింది. ఈ విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన చర్చలు ఫలించలేదు. మెజారిటీ తమకే లభించింది కాబట్టి ముస్లింలీగ్ డిమాండ్‌ను ఆమోదించవలసిన అవసరం లేదన్న కాంగ్రెస్ వాదన హేతుబద్ధమే కావచ్చుగానీ రాజకీయంగా సరైనది కాదు. సమాజంలో ఒక పెద్ద వర్గంగా ఉన్న ముస్లిముల మనోభావాలను కాంగ్రెస్ సరిగా అర్థం చేసుకోలేకపోయింది. ఐక్య రాష్ట్రాలపై చర్చల వైఫల్యమే జిన్నా వైఖరిలో మార్పునకు కారణమైందని చరిత్రకారులు చెబుతారు. అప్పటివరకూ జాతీయవాద నాయకుల్లో ముందువరసలో ఉన్న జిన్నా, ఈ సంఘటనల అనంతరం కాంగ్రెస్‌కు బద్ధవిరోధిగాను, అటు పిమ్మట వేర్పాటువాదిగానూ మారారు.

హిట్లర్ నాయకత్వంలో జర్మనీ సేనలు 1939లో పోలాండ్‌ను ఆక్రమించడంతో రెండో ప్రపంచయుద్ధానికి తెరలేచింది. జర్మనీ యుద్ధకాంక్ష కారణంగా ప్రపంచశాంతి ప్రమాదంలో పడిన రోజులవి. అప్పటికి అమెరికా ఇంకా యుద్ధరంగంలోకి అడుగుపెట్టలేదు. బ్రిటన్‌కు తనను తాను రక్షించుకోవడమే తలకు మించిన భారంగా పరిణమించింది. మన జాతీయోద్యమ నాయకులు బ్రిటీషు ప్రభుత్వంతో తలపడేందుకు సరిగ్గా అదే సమయాన్ని ఎంచుకొన్నారు. భారత నాయకులను సంప్రదించకుండా బ్రిటీష్ వైస్రాయ్ ఏకపక్షంగా జర్మనీపై యుద్ధానికి పిలుపు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఆందోళన లేవదీశారు. వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారాన్ని త్యజించాయి. నిజానికి ఆ సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎంతో చక్కగా పనిచేస్తున్నాయి. పాలనపరంగా అనుభవాన్ని గడిస్తున్నాయి. అటువంటి కీలకమయిన సమయంలో పాలనాపరంగా తనదైన ముద్ర వేయగలిగే అవకాశాన్ని కాంగ్రెస్ చేజార్చుకుంది. ఈ అవకాశాన్ని జిన్నా ప్రభృతులు తమకు అనుకూలంగా మలచుకున్నారు. కాంగ్రెస్ నాయకులు రాజీనామాలు చేసిన రోజును 'విమోచన దినం'గా గుర్తిస్తూ ముస్లింలీగ్ పండుగ జరుపుకుంది.

1942లో నాలుగవ తప్పిదం జరిగింది. గాంధీజీ ఇచ్చిన 'విజయమో, వీరస్వర్గమో' (డూ ఆర్ డై) పిలుపు దేశభక్తుల్లో చైతన్యం రగిల్చింది. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ వేలాదిమంది సమరయోధులు స్వచ్ఛందంగా అరెస్టయి జైళ్లకు వెళ్లారు. మరెంతోమంది పోలీసు తూటాలకు నేలకొరిగారు. ఇలా ఉద్యమానికి అద్భుతమైన స్పందన లభించిన మాట నిజమే అయినా, అప్పటి పరిస్థితులను బట్టి చూస్తే ఉద్యమం లేవదీయడానికి అది తగిన సందర్భం కాదు. ప్రచండమైన రీతిలో సాగిన ఆ ఉద్యమం భారత్ పట్ల బ్రిటీష్ ప్రభుత్వం మరింత కఠిన వైఖరి అవలంబించేందుకే దోహదపడింది. ఆ సమయానికి అమెరికా కూడా యుద్ధరంగంలోకి దిగింది. దరిమిలా మిత్రపక్షాల విజయావకాశాలు మెరుగుపడ్డాయి. యుద్ధానంతరం భారత్‌కు స్వాతంత్ర్యం లభించే అవకాశాలు కూడా ప్రస్ఫుటంగా కనబడసాగాయి. అటువంటి పరిస్థితుల్లో ఉద్యమం లేవదీయడంతో బ్రిటన్ ఆగ్రహం అవధులు దాటింది. కాంగ్రెస్ నాయకులను ఎక్కడివారిని అక్కడ అరెస్టు చేసి జైళ్లలోకి నెట్టింది. దీంతో ఒక్కసారిగా రాజకీయ శూన్యత ఏర్పడింది. కాంగ్రెస్ నాయకులంతా నిర్బంధంలో ఉండటంతో రాజకీయంగా బలపడేందుకు ముస్లింలీగ్‌కు అవకాశం లభించింది. లీగ్ నాయకులు దానిని చక్కగా ఉపయోగించుకున్నారు. 1937 ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన ముస్లింలీగ్, 1946 ఎన్నికలలో ముస్లింల ప్రాబల్యం అధికంగా గల ప్రాంతాలన్నింటిలోనూ జయకేతనం ఎగురవేయగలిగింది.

**అప్రమత్తతత కీలకం**

బ్రిటీష్ ప్రభుత్వం 1946లో ప్రతిపాదించిన కేబినెట్ మిషన్ ప్లాన్‌ను ఆమోదించడంలో విఫలం కావడం మన నేతలు చేసిన అయిదో తప్పిదం. దేశాన్ని విభజించాలనే డిమాండ్ బలం పుంజుకున్నా, దానిని నివారించే అవకాశాలు అప్పటికి ఇంకా చేజారిపోలేదు. భాష, మతం, ప్రాంతం వంటి అనేక అంశాలలో భారతదేశానికి గల భిన్నత్వాన్ని దృష్టిలో ఉంచుకుని, దేశ విభజనకు ఏమాత్రం తావులేని విధంగా కేబినెట్ మిషన్ ప్లాన్ రూపొందింది. ఎంతోమంది కాంగ్రెస్ నాయకులు ఈ ప్రణాళికకు మద్దతు తెలిపినా, ఈ విషయంలో ఏకాభిప్రాయాన్ని సాధించేందుకు జాతీయ నాయకులు కృషి చేయలేదు. తొలుత ఈ ప్రణాళికకు అందరి ఆమోదం లభించేటట్లే కనిపించినా చివరకు తిరస్కరణకు గురైంది. దీంతో దేశ విభజన అనివార్యమైంది. అఖండ భారతదేశం అవిభాజ్యంగానే ఉండాలన్నది స్వాతంత్ర్యోద్యమ కాలంనాటి నాయకుల ఆశ. ఆ దిశగా వారు ఎంతో శ్రమించారు. కానీ, పైన చెప్పిన తప్పిదాల వల్ల తాము కన్న కలలను వారు సాకారం చేసుకోలేకపోయారు. గతాన్ని మార్చడం మనకు ఎలాగూ సాధ్యం కాదు. భవిష్యత్తులోనైనా అటువంటి పొరబాట్లు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించడం ఎంతైనా అవసరం. అప్పుడే లోపరహితమైన సమసమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.

(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా జూన్ 27, 2005న ఈనాడులో ప్రచురితమైన వ్యాసం)

# ఉదార హిందువులూ ముస్లిం విశ్వాసులూ

- రామచంద్ర గుహ,
చరిత్రకారుడు



మహాత్మాగాంధీ 1937 మార్చిలో 'సహనం అవసరం' అనే శీర్షికతో ఒక వ్యాసాన్ని ప్రచురించారు. ఒక ముస్లిం స్నేహితుడు రాసిన ఓ లేఖకు ప్రతిస్పందనగా ఆయన ఈ వ్యాసాన్ని రాశారు. ప్రవక్త మహమ్మద్ లేదా పవిత్ర గ్రంథం ఖురాన్ గురించి ప్రస్తావించిన సందర్భాలలో గాంధీజీ వారి ప్రబోధాలను విమర్శనాత్మకంగా విశ్లేషించకపోవడం తనకు ఎంతైనా ఆశ్చర్యం కలిగిస్తుందని ఉదారవాదీ, సంశయవాదీ అయిన ఆ ముస్లిం స్నేహితుడు తన లేఖలో పేర్కొన్నారు. 'సత్యాన్వేషణ, న్యాయసాధనకు అంకితమైన మీలాంటివారు ఇలాంటి దృక్పథాన్ని ఎలా చూపుతారో నాకు అర్థం కావడం లేదు. హిందూ ధర్మంలోని లొసుగులను, అనాచారాలను ఎత్తిచూపడానికి, హిందూ ధర్మాల పేరిట ఆచరిస్తున్న అమానుష సంప్రదాయాలను ఖండించడానికి వెనుకాడని మీలాంటివారు ఖురాన్‌లోని అనౌచిత్యాలను ఎలా అంగీకరిస్తున్నారు?' అని ఆయన ప్రశ్నించారు. న్యాయవిరుద్ధంగా ఉన్న ఇస్లాం నిర్దేశాలను మీరు ఖండించిన లేదా ప్రశ్నించిన సందర్భం ఒక్కటీ నాకు తెలియదని ఆ స్నేహితుడు అన్నారు. కాలం చెల్లిన ఆ ఆదేశాలకు వ్యతిరేకంగా 18–20 సంవత్సరాల వయసులోనే ఎదురుతిరిగాను. ఆనాటి నా తిరుగుబాటుతత్వాన్ని, అసమ్మతిని కాలం మరింతగా పెంచింది అని ఆ ముస్లిం స్నేహితుడు పేర్కొన్నారు.

'హరిజన్'లో ఆ లేఖ పూర్తి పాఠాన్ని ప్రచురిస్తూ గాంధీజీ ఇలా సమాధానమిచ్చారు: 'ఖురాన్‌లో, ఆ మాటకొస్తే ప్రపంచంలోని ఏ మత గ్రంథంలోనిదైనా ప్రతి అక్షరాన్నీ సంపూర్ణంగా విశ్వసిస్తానని నేను ఎక్కడా చెప్పలేదు. అయితే ఇతర మతాలకు చెందిన పవిత్ర గ్రంథాలను విమర్శించడంగానీ, లేదా వాటిలో లోపాలను ఎత్తిచూపడంగానీ నా పని కాదు. ఆ మత గ్రంథాలు ఉపదేశించిన, ఆ మతస్తులు ఆచరిస్తున్న సత్యాలను అందరికీ చెప్పటమే నా ధర్మంగా భావిస్తున్నాను'.

ఒక మతాన్ని అనుసరించేవారు మాత్రమే ఆ మత ధర్మసూత్రాలు, ఆచార సంప్రదాయాలను విమర్శించడానికి అర్హులనే అభిప్రాయాన్ని గాంధీజీ వ్యక్తం చేశారు. ఈ దృక్పథంతో

చూసినప్పుడు 'హిందూమతాన్ని స్వచ్ఛంగా, పవిత్రంగా ఉంచేందుకు అందులోని తప్పులను ఎత్తిచూపడం నా విధి, కర్తవ్యంగా భావిస్తున్నాను. హిందూమతేతర వ్యక్తులు హిందూ ధర్మాన్ని విమర్శించడానికి, ఆ ధర్మంలోని లసుగులను ఏకరువు పెట్టడానికి పూనుకున్నప్పుడు వారు హిందూ మతం విషయంలో తమ అజ్ఞానాన్ని, హిందూ జీవన దృక్పథాన్ని అర్థం చేసుకోవడంలో తమ అశక్తతతను మాత్రమే చాటుకుంటున్నారు. హిందూ ధర్మాన్ని విమర్శించే హిందూ మతేతరులతో నా అనుభవాలు, ఇతర మతాల విషయంలో నా పరిమితులను నాకు తెలియపరిచాయి. ఇస్లాం, క్రైస్తవ మతాలను వాటి సంస్థాపకులను విమర్శించకుండా జాగ్రత్త వహించేలా చేశాయి. ఒక మతాన్ని సంస్కరించే సామర్థ్యం ఆ మతానుయాయులకు మాత్రమే ఉంటుంది. ఆ మత ప్రబోధాలతో వారికి సహానుభూతి ఉంటుంది. ఇతర మతాలను, స్వంత మతాన్ని గౌరవించినట్టుగా గౌరవించడం ద్వారానే అన్ని మతాలూ సమానమైనవేనన్న సత్యాన్ని నేను అర్థం చేసుకున్నానని' గాంధీజీ అన్నారు.

1937లో అంటే బ్రిటీష్ ఇండియాలో హిందూ-ముస్లింల మధ్య సంబంధాలలో ఉద్రిక్తతలు చోటుచేసుకొంటోన్న తరుణంలో గాంధీజీ ఈ వ్యాఖ్యలు చేశారు. 1920-22 సహాయ నిరాకరణోద్యమంలో ముస్లింలు మహా ఉత్సాహంగా పాల్గొన్నారు. అయితే గాంధీజీ నేతృత్వంలో జరిగిన రెండో మహాఉద్యమం-1930-31నాటి దండి ఉప్పు సత్యాగ్రహంలో ముస్లింలు పాల్గనలేదు. సహాయ నిరాకరణోద్యమం కాలంలో గాంధీకి సన్నిహితులుగా ఉన్న షౌకత్ అలీ, మహమ్మద్ అలీ లాంటివారు 1930వ దశకంలో గాంధీకి బద్ధవ్యతిరేకులుగా మారిపోయారు.

1934లో మహమ్మద్ అలీ జిన్నా ఇంగ్లండ్‌లో తనకు తానుగా విధించుకున్న ప్రవాస జీవితం నుంచి స్వదేశానికి తిరిగి వచ్చారు. ముస్లింలీగ్ అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆ సంస్థకు కొత్త జవసత్వాలను సమకూర్చారు. అది అఖిల భారత రాజకీయ పక్షంగా ఆవిర్భవించడం ఆరంభమయింది. ఈ నేపథ్యంలో ఇస్లాం పుణ్యపురుషులు, ఆ మత పవిత్ర గ్రంథాల విషయంలో ఒక హిందువుగా విమర్శించడంపై గాంధీజీ అటువంటి విశాల దృక్పథాన్ని అనుసరించారు.

ఉదారవాదులైన హిందువులు 2016లో 1937లో గాంధీజీ వలే వ్యవహరించాలా? గాంధీ వలే మనమూ మన మతం పట్ల విమర్శనాత్మక, సంశయాత్మక దృక్పథం కలిగివుంటూ, ఇతర మతాల పట్ల విధిగా 'భక్తిగౌరవాలు' కలిగి వుండాలా? ప్రవక్త మహమ్మద్‌పై హిందూ మహాసభకు చెందిన కమలేష్ తివారీ అనే నాయకుడు చేసిన వ్యాఖ్యలపై తీవ్ర వివాదం నెలకొన్న సందర్భంగా నేనీ ప్రశ్న వేస్తున్నాను. ఆ వ్యాఖ్యలు గర్హనీయమైనవి. అయితే వాటిపై బెంగళూరులోనూ, దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలోనూ ముస్లిం ప్రతిస్పందన మితిమీరిన స్థాయిలో ఉందని చెప్పక తప్పదు.

కమలేష్ వ్యాఖ్యలపై ముస్లింల నిరసనలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఇటీవల బెంగాల్‌లోని మాల్దాలో నిరసనకారులు తీవ్ర అరాచక చర్యలకు పాల్పడటం జరిగింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కమలేష్ తివారీ, ఎవరికీ పెద్దగా తెలియని ఒక రాజకీయ పార్టీకి అనామక నాయకుడు. అయితే అతని వ్యాఖ్యలు ఎంతగా గర్హనీయమైనవి అయినప్పటికీ దేశవ్యాప్తంగా అంత తీవ్రస్థాయిలో నిరసన ప్రదర్శనలు నిజంగా అవసరమా? ఒక అనామక వ్యక్తి చేసిన అజ్ఞానపూరిత, దురుద్దేశపూర్వక వ్యాఖ్యలు ప్రవక్త పట్ల తమ విశ్వాసాన్ని అగౌరవపరిచే విధంగా ఉన్నాయని ముస్లింలు ఎందుకు భావించారు? ఇది నన్ను మళ్లీ గాంధీజీ ప్రశ్న లేదా ఆయన సందిగ్ధావస్థకవద్దకు తీసుకువెళ్లింది. ముస్లింలు లేదా క్రైస్తవులు తమ మతనాయకుల తప్పుడు మార్గదర్శకత్వాన్ని అంగీకరిస్తున్నప్పుడు హిందూ మతస్తుడు అయిన ఉదారవాది ఏం చేయాలి? మౌనంగా ఉండిపోవాలా? లేక తప్పుదోవ పట్టిస్తున్న సోదర మతనాయకత్వాన్ని ప్రశ్నించాలా? రెండోది చేయాలని నేను భావిస్తున్నాను. ముస్లింలు అన్ని రంగాలల్లోనూ పూర్తిగా వెనకబడివున్నారనే విషయం అందరికీ తెలుసు. నిత్యజీవితంలో కోట్లాది ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి బదులు ప్రవక్తకు మద్దతుగా తమ అనుయాయుల శక్తిసామర్థ్యాలను వినియోగించడానికి ముస్లిం మతనాయకులు ప్రాధాన్యమిస్తున్నారు.

మోహన్ భగవత సమర్థ, విశ్వసనీయ నాయకుడు అని భావించే వారు తప్పుడు అభిప్రాయంతో ఉన్నారని ఒక హిందువుగా నేను భావిస్తున్నాను. హిందూ రాష్ట్ర భావనను భగవత త్యజించలేదు. 21వ శతాబ్దపు హిందువులకు నాయకత్వం, మార్గదర్శకత్వం వహించడానికి అర్హమైన సంస్థగా ఆర్ఎస్ఎస్‌ను నేను పరిగణించడం లేదు.

దేశంలో అత్యధిక జనాభా గల రాష్ట్రంలో ప్రధాన ముస్లిం నాయకుడు అజంఖాన్ కావడం ముస్లింలకు, ఉత్తరప్రదేశ్‌కు, భారతదేశానికి అవమానకరమని ఒక భారతీయుడిగా నేను భావిస్తున్నాను. హిందువుల, ముస్లింల మధ్య ఉద్రిక్తతలు రెచ్చగొట్టిన చరిత్ర ఆయనకు ఉన్నది (గమనార్హమైన

విషయమేమిటంటే, అజంఖాన్ వ్యాఖ్యలకు ప్రతిస్పందనగానే కమలేష్ తివారీ ఆ అనుచిత వ్యాఖ్యలు చేశారు). మత సంస్కరణలు చాలా వరకు ఆ మత సంప్రదాయ పరిధిలోని విమర్శకుల ద్వారానే సాధ్యమవుతాయని గాంధీజీ సరిగానే చెప్పారు. ఆయన హిందువు కాబట్టే అంటరానితనాన్ని సమర్థించిన శంకరాచార్యులను విజయవంతంగా సవాల్ చేశారు. అదేవిధంగా ముస్లిం ఉదారవాదులు తమకు తాము ఒక నిర్దిష్ట లక్ష్యంతో సంఘటితమైతే బహు భార్యాత్వం, తలాఖ్ విడాకుల సంప్రదాయాన్ని రద్దు చేయడం సాధ్యమవుతుంది. ప్రస్తుతానికి వారు సమైక్యంగా లేరు. హిందూత్వ ఉన్మాదులను విమర్శించడానికి ఎంతోమంది హిందూ రచయితలు, రాజకీయవేత్తలు సంసిద్ధంగా ఉండటం భారతీయ ఉదారవాద ప్రత్యేకతల్లో ఒకటి. అయితే ముస్లిం రచయితలు, రాజకీయవేత్తలు తమ మతానికి చెందిన మతోన్మాదులను విమర్శించడానికి సంకోచిస్తారు. ఆధునిక విద్యాధికులైన సల్మాన్ ఖుర్షీద్, ఒమర్ అబ్దుల్లాలు సైతం ఓవైసీ సోదరులు, అజంఖాన్‌లాంటి వారితో బహిరంగంగా ఘర్షించటానికి విముఖత చూపడం ఎంతైనా విచారకరం.

ముస్లిం మత ప్రబోధాలు, ఆచరణలను విమర్శించవద్దని హిందువులకు 1937లో గాంధీజీ సూచించారు. అలాగే ముస్లింలూ హిందువుల విషయంలో ఇలాంటి సంయమనాన్ని చూపాలని ఆయన కోరారు. ఆనాటి వలసపాలన పరిస్థితుల్లో అలా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే బ్రిటీష్ పాలకులు భారతీయులను మతపరంగా విభజించి తమ పాలనను కొనసాగించుకోవడానికి ప్రయత్నిస్తున్న సందర్భమది. ఇప్పుడు మనమందరమూ స్వతంత్ర ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యపు పౌరులం. వలసపాలనలోని నిర్బంధాలు, పరిమితులు మనకు వర్తించవు. అనవసరంగా ఇతర మతస్తులను రెచ్చగొట్టాల్సిన అవసరం కూడా మనకేమీ లేదు. అయితే కులమతాలతో ప్రమేయం లేకుండా సహ భారతీయ పౌరులకు స్నేహపూర్వకంగా సలహా ఇచ్చే లేదా వారిని విమర్శించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నది. కమలేష్ తివారీ చేసిన వ్యాఖ్యలు సమర్థనీయమైనవి కావు. అయితే దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఆ వ్యాఖ్యలకు వచ్చిన ప్రతిస్పందనలు భారతీయ ముస్లింల ప్రతిభాపాటవాలు తప్పుదోవలో వినియోగమవుతున్నాయనే విషాదాన్ని స్పష్టం చేస్తున్నాయి. గాంధీజీ స్వతస్సిద్ధ వివేకం, సంయమనం ఆయన జీవించినకాలపు అనివార్యతలను ప్రతిబింబిస్తున్నాయి. అయితే ఇప్పుడు 2016లో మత దురభిమానాన్ని వివేచనాపరులైన ఉదారవాదులందరూ వ్యతిరేకించాలి. ఆ సంకుచిత ధోరణులు హిందువులు లేదా ముస్లింలు ఎవరిలో కన్పించినప్పటికీ, తాము హిందువులు లేదా ముస్లింలు లేదా ఆ రెండు మతాలకు చెందనివారు అయినప్పటికీ ఉదారవాదులందరూ ముక్తకంఠంతో ఖండించితీరాలి.


(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

# గురజాడ అడుగుజాడల్ని చెరిపేస్తారా?




తెలుగు జాతిని పదునైన భావాలు, భాషతో చైతన్యపరిచిన మహాకవి గురజాడ అప్పారావు గురుతుల్ని పరిరక్షించుకోవాలన్న స్పృహ కూడా పాలకులకు లేకుండా పోయిందని బాబ్జీ ఆవేదన వ్యక్తంచేశారు. గురజాడ విగ్రహం వద్ద పార్టీ నేతలతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. గురజాడ ఇంటిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని, గురజాడ పేర ఆడిటోరియం నిర్మిస్తామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా పని జరగలేదన్నారు. సంస్కర్తల పట్ల ఈరీతిగా వ్యవహరించే పాలకులకు ఎలాంటి గతి పడుతుందో చరిత్ర చూస్తే తెలుస్తుందని, ఇకనైనా మేలుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నేతలు లక్కిరాజు శివరామారావు, ఎం.చిన్నారావు, నేరెళ్ల వెంకటరావు, బీసీ సంఘ నాయకులు చోడి ఆదినారాయణ, ఆర్టీసీ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు పెనుమజ్జి సత్యనారాయణ, అప్పారావు, శ్రీను, భాస్కర్, రమేష్, రామకృష్ణ, పెద్దసంఖ్యలో యువత పాల్గొన్నారు.

# బ్రిటన్-భారత్ నైతిక నాయకత్వం అందించే రోజును చూడటం కోసం 125 ఏళ్లు బతకాలనుంది: గాంధీ




అహింసా మార్గాన్ని అనుసరిస్తూ అరమరికలు లేని స్నేహంతో బ్రిటన్-భారత్ ప్రపంచానికి నైతిక నాయకత్వం అందించే రోజుని చూడటం కోసం 125 ఏళ్లు బతకాలనుందని మహాత్మాగాంధీ అన్నారు. భారత్‌కు స్వరాజ్యాన్ని అందించటానికి సిద్ధంగా ఉన్నామని ప్రధానమంత్రి అట్లీ ప్రకటించిన సందర్భంగా 1946లో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో గాంధీ.. జాతీయోద్యమ డిమాండ్లలో కాలానుగుణ మార్పులు, ఉప్పుపై పన్ను, అహింస తదితర అంశాలపై మరింత స్పష్టతనిస్తూ మాట్లాడారు.

గాంధీతో ఈ ఇంటర్వ్యూని హెన్రీనోయిల్ బ్రెయిల్స్ ఫోర్డ్ (1873–1958) నిర్వహించారు. ఏప్రిల్ 14, 1946న 'హరిజన్' పత్రికలో ఇది ప్రచురితమైంది. బ్రెయిల్స్ ఫోర్డ్ ఒక చర్చి మతాచార్యుని కుమారుడు. కొంతకాలం తర్కశాస్త్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. మొదటి ప్రపంచ యుద్ధానికి దారితీసిన పెట్టుబడిదారీ వైరాన్ని చిత్రిస్తూ అంతర్జాతీయ సోషలిస్టు విశ్లేషణతో బ్రెయిల్స్ ఫోర్డ్ రాసిన 'ది వార్ ఆఫ్ స్టీల్ అండ్ గోల్డ్' పుస్తకం చాలా గుర్తింపు పొందింది. తర్వాత 'ది మాంచెస్టర్ గార్డియన్', 'ట్రిబ్యూన్', 'ది నేషన్' పత్రికల్లో ఈయన పనిచేశారు. 'ది న్యూ లీడర్' పత్రికకు కొన్నేళ్లు ఎడిటర్‌గా పనిచేశారు. రాజకీయ విషయాల మీద 'రెబెల్ ఇండియా' (1932), 'సబ్జెక్ట్ ఇండియా' లాంటి విలువైన పుస్తకాలను రచించారు.

"గతసారి నేను పూణె వచ్చినప్పుడు గాంధీ కారాగారంలో ఉన్నారు. ఆయన్ని కలుసుకోవడానికి నాకు అనుమతి లభించలేదు. పట్టణమంతా విషాదం అలముకొని ఉంది. సాధారణ సమ్మె జరుగుతుండటంతోపాటు ఉద్రిక్త వాతావరణం నెలకొని ఉంది. కానీ ఈరోజు పట్టణమంతా పండుగ వాతావరణం కనిపిస్తోంది. ప్రజల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. భారతదేశానికి స్వాతంత్ర్యాన్నిచ్చేందుకు అట్లీ తన ప్రసంగంలో సంసిద్ధత వ్యక్తం చేయడం పట్ల గాంధీ కూడా ఎంతో సంతోషంగా ఉన్నారు. ఆయన తన వయసు కంటే తక్కువగా ఎంతో ఉల్లాసంగా కనిపించారు.

తనదైన హాస్యఛలోక్తుల తీరులోనే గాంధీ సంభాషణ ప్రారంభించారు. అయితే ఈ ఇంటర్వ్యూ కేవలం వ్యక్తిగతమే తప్ప కాంగ్రెస్ తరపున కాదని ముందుగానే హెచ్చరించారు" అని బ్రెయిల్స్ ఫోర్డ్ ఇంటర్వ్యూ ప్రారంభంలో పేర్కొన్నారు.

**గాంధీతో బ్రెయిల్స్ ఫోర్డ్ ముఖాముఖి:**

**బ్రెయిల్స్ ఫోర్డ్: బ్రిటీషు సామ్రాజ్య పరిధిలోనే సమానహోదాగల స్వయంప్రతిపత్తి (డొమినియన్ హోదా)ని కాకుండా స్వరాజ్యాన్ని ఎంపిక చేసుకోవటాన్ని భారతీయుల హక్కుగా ప్రధానమంత్రి అట్లీ గుర్తించారు కదా..**

గాంధీ: కానీ ఇన్నేళ్ల బ్రిటీష్ ఇండియా విషాదగాథను మాత్రం నేను మర్చిపోలేను. నెరవేరని ఆశలు, నెరవేర్చని వాగ్దానాలు.. అయినా మనం సహృదయతతోనే వ్యవహరించాలి. సత్యాన్వేషి ఎప్పుడూ తన ప్రత్యర్థుల మాటల పట్ల అపనమ్మకంతో మొదలవడు. కాబట్టి నేను ఆశాభావంతోనే ఉన్నాను. నిజానికి, బాధ్యతగల భారతీయులెవరూ దీనికి భిన్నంగా ఆలోచించలేరు. ఈసారి బ్రిటీష్ అంటే, బిజినెస్ అని నా అభిప్రాయం. బ్రిటన్ ప్రధాని నుంచి ఈ ప్రతిపాదన హఠాత్తుగా వచ్చింది. భారతదేశాన్ని స్వతంత్రంలోకి గెంతించాలనా ఆంగ్లేయుల ఉద్దేశం? తుపాను కల్లోలిత సముద్రంలో ఓడ పైభాగానికి ఎత్తితే కాళ్ల కింద ఆనక తన్నుకుంటున్న ప్రయాణీకుడిలా ఉంది నా పరిస్థితి. కొంత ముందస్తు మానసిక సన్నద్ధత అనేది ఉండాలి. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. ఈవేళ భారత్‌లో బ్రిటీషు వ్యతిరేకత తారాస్థాయికి చేరుకుంది. అది హృదయాల్ని కలుషితం చేస్తుంది. గత రెండు నెలలూ సానుకూల, సానుభూతి వాతావరణం ఉండుంటే బాగుండేది. ఏమైనా, ఇది భారత్, బ్రిటన్‌ల, యావత్ ప్రపంచ చరిత్రలోనే ఒక మైలురాయి.

**(?) బ్రిటీష్ ప్రభుత్వ నిర్ణయం సరైనదే, కానీ అమలు తీరు సరిగా లేదన్న మీ భావన అర్థమైంది. కొంచెం ఉదాహరణలతో వివరించండి.**

రాజకీయ ఖైదీల విడుదల విడతలవారీగా జరుగుతోందే తప్ప ఇంకా పూర్తి కాలేదు. వాళ్లను గురించి బ్రిటీష్ వారు భయపడనక్కర్లేదు. స్వతంత్రం వస్తుంటే వాళ్లెందుకు వ్యతిరేకిస్తారు? ప్రభుత్వం మనస్ఫూర్తిగా క్షమాగుణాన్ని ప్రదర్శించి ఉంటే ప్రజలెంతో మెచ్చేవారు. నువ్వు అధికార బదిలీకి సిద్ధంగా ఉన్నప్పుడు, ఆ పని ధైర్యంగానే చేయాలి.

(తర్వాత ఉప్పు పన్ను గురించి మాట్లాడుతూ)

ఉప్పు పన్ను రద్దు చేస్తే అది నిరుపేద రైతుకు సైతం అర్థమయ్యే చర్య అయివుండేది. అది అతనికి స్వతంత్రం కన్నా మిన్న. ఈ వాతావరణంలో ఉప్పు ఒక జీవితావసరం. గాలి, నీరు అంత ప్రాకృతికావసరం. తన కోసం, తన పశువుల కోసం, తన భూమి కోసం ఇక్కడి రైతులకు ఉప్పు అవసరం. స్వతంత్రం వచ్చిన మరుక్షణం ఉప్పు మీద పెత్తనం రద్దవుతుంది. అలాంటప్పుడు స్వతంత్రం ఇవ్వాలనుకుంటున్న ఈరోజే ఆ పన్నును ఎందుకు రద్దు చేయకూడదు? ప్రభుత్వం అటువంటి చర్యలు చేపడితే సామాన్య ప్రజలు సైతం ఎంతగానో హర్షిస్తారు. ఒక నూతన శకాన్ని ముందుగానే చూడగలిగామని సంబరపడతారు.

**(?) భారతీయులు డొమినియన్ హోదా వైపు కాకుండా స్వాతంత్ర్యం వైపే ఎందుకు మొగ్గు చూపారో చాలామంది ఆంగ్లేయులకు అర్థం కావటం లేదు..**

స్వాతంత్ర్యం కంటే కూడా డొమినియన్ హోదా కోసమే నేను పట్టుబట్టిన రోజులున్నాయి. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో నా వైఖరి అది. బ్రిటీష్ సింహాసనం పట్ల ఒక ఆంగ్లేయుడి గుండెల్లో ఎంతటి విధేయత ఉంటుందో, ఒక భారతీయుడి గుండెల్లో కూడా అంతే విధేయతను ఉద్దీపింపచేయాలన్నది నా ప్రయత్నమని లార్డ్ ఛెమ్స్‌ఫర్డ్‌కి రాశాను కూడా. చాలామంది ఈ వాక్యాన్ని నాకు వ్యతిరేకంగా ఉటంకిస్తుంటారు. అయితే ఒక ఇంగ్లిష్ ఫుట్‌బాల్ ఆటగాడు.. నన్ను స్వరాజ్యం వైపు మరల్చాడు. (నవ్వుతూ) అదే.. కేంబ్రిడ్జిలో ప్రముఖ అథ్లెట్, అధ్యాపకుడు సి.ఎఫ్ ఆండ్రూస్ నాకీ అవగాహన కలిగించాడు. రాజు–చక్రవర్తి టైటిల్ ప్రాధాన్యత గురించి నాకు బోధ చేశాడు. బ్రిటీష్ రాజు డొమినియన్లకు కూడా రాజు అవుతాడు. డొమినియన్లకు, స్వతంత్ర భారతదేశానికి అంత తేడా ఉంది. డొమినియన్లు వస్తే మీ తెల్ల జాతి సంతతి వచ్చి చేరతారు. కానీ భిన్న సంస్కృతీ సంప్రదాయాలు కలిగిన మేం, భారతీయులం ఎన్నటికీ బ్రిటీష్ కుటుంబీకులం కాలేము. మేము ప్రపంచదేశాల కుటుంబానికి చెంది ఉండవచ్చు. కాబట్టే స్వరాజ్య సాధనను ధ్యేయంగా నిర్ణయించుకున్నాను. మీరు విమర్శించవచ్చు. భారతదేశం నిజంగా అహింసామూర్తి అయితే ఆమెకు వాళ్ల అవసరమే ఉండదు. స్వతంత్ర భారతావని నిజంగా అహింసామార్గంలోనే పయనిస్తే ప్రపంచంలోని ఏ దుష్టశక్తీ ఆమెను తేరిపార చూడలేదు. అహింస భారతదేశాన్ని శిఖరాగ్రాన నిలపటమే కాకుండా, ప్రపంచ ప్రగతికి ఆమె అందించే తోడ్పాటు కూడా అవుతుంది.

నా వాదన ఆంగ్లేయులకు నిజంగా అర్థమై ఉంటే, స్వాతంత్ర్యాన్ని మరోతీరుగా ప్రకటించి ఉండేవాళ్లు. డొమినియన్ హోదా తాము అనుగ్రహించగలిగిన గొప్ప వరమని, అయినా భారతీయులు స్వతంత్రాన్నే కోరుకుంటే ఇస్తామని వాళ్లు ఈరోజు పేర్కొంటున్నారు. అది చాలా అభ్యంతరకర ధోరణి. ఇంగ్లిషువాళ్లు ఎలా చెప్పాలో తెలుసా?.. "ప్రపంచం కోసం, మా కోసం, అలాగే మీ కోసం ఈరోజు మీరు స్వాతంత్ర్యం పొందుతున్నారు.."

**(?) స్వతంత్ర భారతదేశం ఇటు బ్రిటన్‌కు, అటు ప్రపంచానికి రక్షణ సమస్యగా మారుతుందేమోనని కొంతమంది ఆంగ్లేయులు వ్యక్తం చేస్తున్న ఆందోళనలపై మీరేమంటారు**

స్వతంత్ర భారతదేశం గురించి బ్రిటన్ ఎప్పుడూ

భయపడాల్సిన పనిలేదు. స్నేహపూర్వకంగా భారత్ నుంచి వీడ్కోలు తీసుకుంటే ఆమె ఎప్పటికీ స్నేహపూర్వకంగానే ఉంటుంది.

**(?) కానీ స్నేహపూర్వకతకు బ్రిటన్ కొంత భరోసాను కోరవచ్చు. స్వతంత్ర భారతదేశం బ్రిటన్‌తో అలయెన్స్ కుదుర్చుకోవడానికి ఒప్పుకుంటుందా**

'లేదు' అని భారత్ సమాధానమిచ్చిందనుకోండి.. తమతో అలయెన్స్ కుదుర్చుకోవడం మీదే భారత్ స్వతంత్రతను గుర్తిస్తామని బ్రిటీషర్లు షరతు పెడతారా?.. మీరు ఆ మాట అంటే, ఇంతకుముందే మీరు చేసిన స్వాతంత్ర్యం ఆఫర్ ప్రకటనకు విలువ లేకుండా పోతుంది. కాబట్టి ఇలాంటి వాటి జోలికిపోకుండా, భారత్ వైఖరిని ఆమె హక్కుల కోణం నుంచి చూడండి. మీ వైఖరినే మీకు తిప్పికొడుతూ ఆమె పెడముఖంగా వ్యవహరించినా సరే!.. ఎంతో రక్తపాత యుద్ధం జరిగాక బోయర్లతో సర్దుబాటు చేసుకునేటప్పుడు బ్రిటీషువాళ్లు ఈ లెక్కలేవీ వేయలేదే! అప్పట్నుంచి ఇప్పటి వరకు బోయర్లు వాళ్లతో స్నేహపూర్వకంగానే ఉంటున్నారు గదా.

**(?) భారతదేశంతో అణచివేత తరహా సంబంధాలకు ఒక స్వస్తి చెప్పాలని బ్రిటన్ నిర్ణయించుకుంది. కానీ ఎప్పుడైనా రక్షణార్థపు యుద్ధంలో శత్రువుపై దాడి కోసం భారత్‌లోని సైనిక కేంద్రాలను, పోర్టులను ఉపయోగించుకోవటానికి ఒక మిత్రపక్షంగా బ్రిటన్‌కి అవకాశం ఉంటుందా? ప్రమాదాలు పొంచి వున్న ప్రపంచంలో ఈ ప్రశ్న అడగటం తప్పనిసరి. బేరసారాల ధోరణితో కాకుండా సుహృద్భావ ధోరణితో బ్రిటన్ ఈ ప్రశ్న అడిగితే భారత్ సానుకూలంగా స్పందిస్తుందా?**

ఇంగ్లీషువాళ్లు బనియాలుగా కాకుండా బ్రాహ్మణులుగా ఉండటం నేర్చుకోవాలి. బనియా అంటే వ్యాపారి. నెపోలియన్ మాటల్లో చెప్పాలంటే, షాప్‌కీపర్. కానీ బ్రాహ్మణుడంటే జీవితంలో భౌతిక విలువల కంటే నైతిక విలువలకు ఎక్కువ విలువనిచ్చే వ్యక్తి.

ఇంగ్లీషువాళ్లు బనియాలు కారు.. వాళ్ల సైనికులు, బ్రాహ్మణులు అని ఒక గుజరాతీ నవలాకారుడు వ్యాఖ్యానించారు. అది ఉదారంగా చెప్పిన మాటేగానీ, అంత వాస్తవం కాదు. బ్రాహ్మణీయ స్ఫూర్తి ఇంగ్లీషువాళ్లలో ఇంకా కలగలేదు. బ్రిటీషు సైనికుడు కూడా బనియాలానే బేరసారాల పద్ధతిలో యుద్ధం చేస్తాడు. అత్యున్నతస్థాయి నైతిక తెగువతో అతనెప్పుడూ యుద్ధం చేయలేదు. బ్రిటీషర్లు భారతదేశపు అహింసా స్ఫూర్తికి స్పందిస్తారన్న ఆశ నాకు ఇంకా ఉంది. అహింస అనేది ప్రపంచానికి ఎంతటి మేలుదాయిని అవుతుందో ఆ ఉద్యమ నిర్మాతగా నాకు తెలుసు. అహింసాభావన జీవితంలో అత్యున్నత భావన. బేరసారాలతో నా సోదరులు దిగజారిపోకుండా సాయం అందించటం నా బాధ్యతగా భావిస్తున్నాను. మీరు, మేము ఇంతటి నైతికస్థాయికి ఎదగగలిగితే ఏ ప్రమాదమూ మనల్ని భయపెట్టలేదు. కాంగ్రెస్‌లో చాలామంది ఈ దృక్పథాన్ని అంగీకరించకపోవచ్చు. అలయెన్స్ గురించి ఇవ్వాళే చర్చించాలని వాళ్లు భావిస్తుండవచ్చు. కానీ గాలి వీచినంత స్వేచ్ఛగా ఈదేశానికి స్వాతంత్ర్యం వస్తుంది, దాని మీద బేరసారాలాడొద్దు.

**(?) స్వాతంత్ర్య ఒప్పందాన్ని కుదుర్చుకునేటప్పుడు రక్షణ ఒడంబడిక గురించి చర్చించే అవకాశముందా**

భారతదేశం గనక నిజమైన స్వతంత్రతను అనుభూతి చెందితే తన ఇష్టప్రకారం అటువంటి అలయెన్స్‌లో చేరవచ్చు. అప్పుడు భారత్, బ్రిటన్‌ల మధ్య అరమరికల్లేని స్నేహాన్ని ఇతర దేశాలకు కూడా విస్తరింపచేయొచ్చు. ఈ మొత్తం దేశాలు/శక్తులన్నిటి మధ్యా వీళ్లిద్దరే సమతుల్యతను కాపాడగలరు. ఎందుకంటే, వీళ్లిద్దరికే ఆ నైతికశక్తి ఉంటుంది. ఈ దార్శనికతను కళ్లారా చూడటం కోసం 125 ఏళ్లు బతకాలనుంది.

అలాగే స్నేహపూర్వకంగా ఉన్న బ్రిటన్, స్వతంత్ర భారతదేశాల మధ్య పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందం కుదరాలని నా ఆకాంక్ష. ఇండియాకు అవసరమైన సరకుల దిగుమతి కోసం బ్రిటన్‌కే ప్రాధాన్యత ఇవ్వటానికి నాకేం అభ్యంతరం లేదు.

**(?) పాకిస్తాన్ గురించి**

ఏ మార్గం ద్వారా పరిష్కారం కాకపోతే, ఈ సమస్యను అంతర్జాతీయ మధ్యవర్తిత్వానికి నివేదించటానికి నేను సిద్ధంగా ఉన్నాను. అలాగే బ్రిటన్, భారత్‌ల మధ్య ఏదైనా తెగని సమస్య.. ఉదాహరణకు అప్పులకు సంబంధించి, వచ్చినా ఈ విధమైన పరిష్కారాన్ని ఒక మార్గంగా సూచిస్తాను.

*"కష్టాలే మనిషిని తయారుచేస్తాయి..." ఇంటర్వ్యూలో గాంధీ అన్న చివరి మాటలు ఇంకా చెవుల్లో మారుమోగుతుండగా బైటికొచ్చాను. నైతిక సూత్రాల పునాది మీదే మానవ సమాజాన్ని నిర్మించగలమని విశ్వసించిన ఒక ధీరోదాత్తుడితో మాట్లాడిన అనుభూతి కలిగింది. సైనిక ఎత్తుగడల మధ్య మనం సతమతమవుతుంటే, ఆ మనిషి నిశ్చలంగా నిలబడి చెక్కుచెదరని విశ్వాసాంతో ఎలుగెత్తి చాటుతున్నాడు– "మానవజాతి ఒకరినొకరు సహోదరులుగా, సమానులుగా చూడటం నేర్చుకున్న రోజునే రక్షణ అనేది లభిస్తుంది, వేరే మార్గమంటూ లేదు".*

# ఆమరణ దీక్ష ఫలితం ఏమిటి?

- శేఖర్ గుప్తా

ఇరోమ్ షర్మిల కథలో ఇటీవల వచ్చిన మలుపు, అరవైల నాటి దేవానంద్ నిర్వచనాత్మక సినిమా గైడ్‌ను ఎందుకు గుర్తుకుతెస్తోంది? ఇక్కడ దిగ్గజం అన్న మాటలకు బదులు నిర్వచనాత్మక అన్న పదమే ప్రయోగిస్తున్నాను. ఎందుకంటే ఆ అలంకారాన్ని ఇష్టారాజ్యంగా ఉపయోగించారు. అజ్మీర్ దర్గా ప్రస్తావన దగ్గర కూడా ఆ రూపకాలంకారాన్నే ఉపయోగించిన దరిమిలా నేను నా న్యూస్‌రూమ్ నుంచి దానిని నిషేధించాను. మనందరం అరవైలలో పుట్టిన వాళ్లమే కాబట్టి గైడ్ చిత్రమే గుర్తుకురావాలి. అరవయ్యో దశకం సంక్షుభితమైనది. అంతేకాదు, రాజకీయాల మీద ఆమరణ నిరాహారదీక్షల ముద్రను కూడా వదిలివెళ్లింది.

ఆర్‌కె నారాయణ్ రాసిన నవల ఆధారంగా అదే పేరుతో నిర్మించిన సినిమా గైడ్. అందులో దేవానంద్ తన ప్రియురాలు వహీదా రెహమాన్‌ను దగా చేసినందుకు, ఆమె సంతకాలను ఫోర్జరీ చేసినందుకు జైలుశిక్ష అనుభవించి తరువాత ఇంటికి వెళ్లడానికి సంకోచిస్తాడు. మహారాష్ట్రలో తరచు దుర్భిక్షాలకు గురయ్యే ఒక గ్రామంలోని ఆలయంలో తలదాచుకుంటాడు. ఆ గ్రామీణులు అతడిని చూసి ఆ యువ సాధువు, వర్షం కురిపించడానికి తమ గ్రామానికి దేవుడు పంపించినవాడిగా భావిస్తారు. అయితే అతడు ఆమరణ నిరాహారదీక్షకు కూర్చుంటేనే వానదేవుడు కరిగి జల్లులు వర్షిస్తాడు. ఇంతకీ గ్రామీణులు తాము విన్న ఒక జానపద కథ ఆధారంగా ఇలాంటి భావనకు వస్తారు. అయితే దేవానంద్– అంటే ఆ సినిమాలోని రాజు పాత్ర, తాను ఎంత మాత్రం దైవం పంపించినవాడిని కాదనీ, పైగా శిక్ష పడినవాడిననీ మొత్తుకుంటాడు. అయినా ఎవరూ విశ్వసించరు. చివరికి బలవంతంతో ఇష్టం లేకపోయినా నిరాహార దీక్షకు దిగుతాడు.

మధ్య మధ్యలో వచ్చే బలమైన ఫ్లాష్‌బ్యాక్‌లలో రాజు తనతో తాను మాట్లాడుకుంటూ ఉంటాడు. నిజానికి అతడు జీవించాలని కోరుకుంటాడు. ఆఖరికి తన ఎదురుగా ఉంచిన దేవుడి ప్రసాదాన్ని తస్కరించడానికి కూడా వెనుకాడడు. అది తప్పు అని తెలిసినా ఆ చాపల్యం నుంచి తప్పించుకోలేకపోతాడు. 'ఆ మేఘాల మనసులో ఉన్నదానికీ, దహిస్తున్న నా ఆకలికీ సంబంధం ఎందుకు ఉండాలి?' అని ఒక సందర్భంలో తనలో తాను మాట్లాడుకుంటూ అనుకుంటాడు. అతడు హీరో కాబట్టి జానపద కథను నిజం చేస్తూ సరిగ్గా సమయానికి వర్షం కురుస్తుంది.

ఇదంతా అర్థ శతాబ్దం నాటి ఘట్టం. ఇదంతా ఒక సినిమా దృశ్య కావ్యం. కానీ కాలం మారిపోయింది. మంచి ఆశయాలు కలిగినవారు, పరిస్థితులకు బలైనవారు, సామాజిక ఒత్తిడులతో ఉన్నవారు, కీర్తికండూతితో ఇప్పటికీ కొందరు ఆమరణ




నిరాహార దీక్ష పేరుతో అలాంటి బలవంతపు నిరసన వ్రతాలకు తలగ్గి, ప్రాణాలను ఫణంగా పెడుతున్నారు. అన్నా హజారే దీనినే అన్షాన్ అంటారు. అయితే ప్రాణాలు పోగొట్టుకోవడం వీరిలో ఎవరికీ ఇష్టం లేదు. సరిగ్గా ఇలాంటి ఆలోచనే షర్మిలకు వచ్చింది. చెదిరిన జుట్టు, ముక్కుపుటాల గుండా వెళ్లే గొట్టం, ఒడిలిన ముఖంతో ఉండే షర్మిల ఒక లక్ష్యానికి ప్రతీకగా కనిపిస్తుంది. అది చెప్పుకోదగిన లక్ష్యమే. ఇంకా చెప్పాలంటే ఆ ఒక్క కారణంతోనే మొత్తం కెరీర్‌ను మలచుకున్నవారికి కూడా గొప్ప లక్ష్యమే. అలాంటి ఉద్యమకారులు, పౌర హక్కుల ఎన్జీవో సంస్థలు, పూర్తి సమయం, ఒకే అంశం తప్ప మాట్లాడని టీవీ వ్యాఖ్యాతలు తమ తమ టీవీ కార్యక్రమాలకు, అవార్డులు ఇవ్వడానికి ఆమెను పిలుస్తూ ఉంటారు. వీళ్లంతా కూడా షర్మిల ఆ కార్యక్రమాలకు అలా చెదిరిన జుట్టుతో, ముక్కులో గొట్టంతో, ఒడిలిన ముఖంతోనే రావాలని కోరుకుంటారు. అయితే ఇదే లక్ష్యంతో పనిచేస్తూనే సాధారణ ముఖంతో కనిపిస్తే చాలా కారణాల వల్ల వారికి ఆమె అంటే ఇష్టం ఉండదు. ఇప్పుడు ముక్కులో గొట్టాలు పోయాయి. దాంతో ఇప్పుడు షర్మిలకు

ఉన్న బ్రాండ్ విలువ పడిపోయింది. తనను తాను చంపుకుంటున్నంత కాలం ఆమె బ్రాండ్‌కు చాలా విలువ ఉంది. ఇప్పుడు ఆమె ఎన్నికలలో పోటీ చేయాలని అనుకుంటున్నారు. మణిపూర్ ముఖ్యమంత్రి పదవి చేపట్టి సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని తొలగించి తన ఆశయాన్ని పరిపూర్ణం చేసుకోవాలని అనుకుంటున్నారు. ఎంత బోరుగా ఉంది! సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని ఎత్తివేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్న వాస్తవం తెలియనంత మూఢురాలా షర్మిల? లేదా మన ఊహకు అందని తెలివితేటలతో ఆలోచిస్తున్నదా? తమ పొరుగునే ఉన్న త్రిపుర ముఖ్యమంత్రి కేంద్రంతో కలిసి పనిచేస్తూ సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని ఎత్తివేయించేందుకు కృషి చేస్తున్న సంగతయినా ఆమె పేపర్లలో చదివి తెలుసుకున్నారా?




షర్మిల అభిమానులు, ఆమె మీద పొగడ్తలు కురిపిస్తున్నవారు, ఆఖరికి ఆమె కుటుంబసభ్యులు కూడా ఆమెను ఆ భ్రమలోనే ఉంచినా, ఆ అంశం మీద పోరాడుతున్నది తాను మాత్రమే కాదన్న సంగతి షర్మిల తెలుసుకోవాలి. ప్రజాస్వామ్యంలో నిరసన దీక్ష ఒక ఆయుధంగా మారినప్పటి నుంచి దీనిని తెలివైనవాళ్లు, పదవీ వ్యామోహపరులు స్వప్రయోజనాల కోసం వాడుకోవడం మొదలుపెట్టారు. ఇదంతా చూస్తే హిందీలో ఒక నినాదం గుర్తుకు వస్తుంది. 'తుమ్ సంఘర్ష్ కరో, హమ్ తుమ్హారే సాథ్ హై' (నీవు ప్రాణాలు ఫణంగా పెట్టు. మేం నీ వెంటే ఉంటాం. ఇంతలోకి డొమినోస్ నుంచి ఒక పిజ్జా తెప్పించు, దానితోపాటు అదనపు చీజ్, డైట్‌కోక్ తెప్పించు).

ఇటీవల జరిగిన రెండు ఉదంతాలను చెప్పుకుందాం. అవి రెండూ కూడా గూగుల్ అనంతరకాలానికే కాదు, ఉపగ్రహ టీవీ యుగానికి తరువాత కాలానికి చెందినవి. ఐదేళ్ల క్రితం రామలీలా మైదాన్‌లో అన్నా హజారే నిర్వహించిన 12రోజుల అన్షాన్ కార్యక్రమం గురించి ఒకసారి గుర్తుకు తెచ్చుకోండి. ఆయన తన ప్రాణాన్ని తనే కొసవరకు తెచ్చుకున్నారు. చివరిక్షణాల్లో దీక్షాశిబిరం నుంచి నేరుగా ఎన్సీఆర్ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. తరువాత మరింత కోలుకోవడానికి, ఆరోగ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవడానికి జిందాల్ ప్రకృతి చికిత్సాలయానికి వెళ్లారు. ఇది యాదృచ్ఛికంగా జరిగినా దేశంలో ధనికులు కొవ్వు తగ్గించుకోవడానికి ఈ చికిత్సాలయానికి వెళ్తుంటారు. ఇంకా దీక్ష సాగుతూ ఉండగానే అన్నా అనుచరులు కొందరు, స్వామి అగ్నివేశ్ ప్రభుత్వంతో కుమ్మక్కయ్యారంటూ విమర్శలు గుప్పించారు. అన్నా హజారే వాస్తవాలను పరికించడం ఆరంభించారు. అయితే పూర్తిగా కాదు. ఒక సంవత్సరం తరువాత జంతర్‌మంతర్ దగ్గర మరోసారి దీక్ష చేశారు. ఇతర ముఖ్య అనుచరులు అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, గోపాల్ రాయ్ వంటివారు కూడా ఆయనతోపాటు దీక్ష చేశారు. ఇదొక పదిరోజులు సాగి తర్వాత భగ్నమైంది. ఈ మధ్యనే పదవీ విరమణ చేసిన మన 24వ సైన్యాధ్యక్షుడు దీక్షను భగ్నం చేశారు. ఇది జరిగిన కొద్దిరోజులకే రాలెగావ్‌లోని అన్నా ఆశ్రమంలో గోపాల్‌రాయ్‌కీ, ఆ ఆర్మీ చీఫ్‌కీ మధ్య వాగ్వాదం జరిగిన సంగతి మనం చూశాం. తరువాత ముంబయిలో మూడోసారి అన్నా దీక్ష చేశారు. ఇది తక్కువకాలం సాగింది. దీక్షా శిబిరానికి చాలా తక్కువగా వచ్చారు. ముఖ్యమంత్రి హామీ తీసుకుని ఆయన ఆశ్రమానికి తిరిగి వెళ్లిపోయారు. ఆ సమయంలో జరిగిన టీవీ చర్చల్లో వాదించిన అన్నా అనుచరుల ముఖాలను ఆయా క్లిప్పింగులలో గమనించి ఉంటే, అన్నా దీక్ష విరమించడం పట్ల వారంతా ఎలా అసహనానికి గురయ్యారో అర్థమవుతుంది. అయితే ఒక్క మేధా పాట్కర్ మాత్రమే తన అసంతృప్తిని నిజాయతీగా బయటపెట్టారు. కాబట్టి.. అన్నా.. తుమ్ సంఘర్ష్ కరో....

అన్నా హజారే క్షేమంగా ఉన్నారు. అలాగే ఆయన అనుచరులకు మంచి అవకాశాలు కూడా కల్పించారు. వారంతా ఇప్పుడు ప్రభుత్వ ఉన్నత పదవుల్లో ఉన్నారు. కొందరు ఎన్నికలలో నెగ్గారు. కొందరు నెగ్గలేదు. ఒకరైతే నెస్లేకు పోటీగా ఒక కార్పొరేట్ ప్రపంచాన్ని నిర్మించారు. మరొకరు బీజేపీ ప్రభుత్వంలో మంత్రిపదవి చేపట్టారు. ఆ పవిత్ర గణకుడు ఈ ప్రభుత్వం హయాంలోనే పదవీ విరమణానంతర కానుకగా

రెండు పనులు మంజూరు చేయించుకున్నాడు. అయితే వీరిలో ఎవరూ కూడా అన్నా హజారేను మర్యాదకు కలుసుకుని రావాలని కూడా అనుకోవడం లేదు. ఎంతో చరిత్రాత్మక నిరసన దీక్షగా పేరుగాంచిన ఆ దీక్షా వార్షికోత్సవం సందర్భంగా కూడా ఆయనను పలకరించి రావాలని భావించలేదు. తమను పదవులలో కూర్చోపెట్టినందుకు కూడా ఎవరూ ఆయనకు కృతజ్ఞతలు తెలియచేయలేదు. అలాగే, జన్‌లోక్‌పాల్ తేవడానికి పోరాడతానని ప్రకటించినందుకు కూడా ఆయనను అభినందించలేదు. సరే, ఇది గాంధీజీ కలలను సాకారం చేస్తామంటూ కాంగ్రెస్‌వాదులు ప్రదర్శించే భేషజం కంటే తక్కువ భేషజమే.

మన చివరి ఉదాహరణ వర్తమానంలో కొనసాగుతున్నదానికి సంబంధించినదే. ఉద్యమకారిణి మేధాపాట్కర్. తాను దీక్షకు దిగుతానంటూ ప్రభుత్వాన్ని ఎన్ని పర్యాయాలు ఆమె బెదిరించారో లెక్కించడంలో నేను విఫలమయ్యాను. నిజానికి ఆమె ఒక్కసారే దీక్షకు కూర్చున్నారు. అయితే అందులో ప్రతి దీక్షా ఆమెకు ఎలాంటి హానీ జరగకుండానే ముగిసేది. అలాగే ఆమె వేటి కోసం పోరాడుతున్నారో వాటిలో ఒక్కటి కూడా సాధించలేకపోయారు. రుతువులు ఆరంభమైనట్టే మధ్యప్రదేశ్‌లో నర్మదా నది

నది ఒడ్డున ఎక్కడో ఆమె దీక్ష చేయబోతున్నట్టు మనకు తెలుస్తుంది. ఎందుకంటే గుజరాత్ ఆమె దీక్షను అనుమతించదు. నిరాహార దీక్షలు సాగుతాయి. జలసమాధులు ఉంటాయి. తరువాత విలేకరుల సమావేశాలు ఉంటాయి. షర్మిల గుర్తించడానికి 16 సంవత్సరాలు పట్టిన వాస్తవం, అన్నా హజారేకు మూడు దీక్షలతో ఒక మాసంలో అనుభవానికి వచ్చిన వాస్తవం మేధా పాట్కర్‌కి బాగా అర్థమైందనిపిస్తుంది. సినిమా కోసమే కావచ్చు జనరల్ ప్యాటన్ చెప్పినట్టు, తమ దేశం కోసం మరణించకుండా ఎవరూ యుద్ధంలో గెలవలేరు. ఇంకో అమాయకుడు చనిపోయేటట్టు చేసి అతడు గెలిచాడు కూడా. కాబట్టి షర్మిల, అన్నా హజారే, లేదా మేధా పాట్కర్ ఎవరి నుంచి అయినా వినిపించే సందేశం ఒక్కటే– నీ ఆశయాన్ని ప్రేమించు, దాని కోసం మరణించు.

(సాక్షి సౌజన్యంతో)

# భూమ్మీద ఎవరి సర్టిఫికెట్ మాకు అవసరం లేదు: సుప్రీంకోర్టు

న్యాయమూర్తులకు ఎవరి నుంచీ ధృవీకరణ పత్రాలు అవసరం లేదని సుప్రీంకోర్టు మరోమారు తేల్చిచెప్పింది. పూజారుల్లా జడ్జీలు తమను తామే నియమించుకుంటారని ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉండే జవాబుదారీతనం తమకు వర్తించదని ధర్మాసనం పేర్కొంది. సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల నియామకాల్లో పారదర్శకత కోసం.. కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలతో సంబంధం లేకుండా ఓ స్వతంత్ర విభాగాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)ను తిరస్కరించింది. న్యాయవాదుల సంఘం ఒకటి ఈ పిల్‌ను దాఖలు చేసింది. 'భూమిపై ఎవరి నుంచీ మాకు ధృవీకరణ పత్రం అవసరం లేదు' అని వ్యాఖ్యానించింది. జస్టిస్ అరుణ్ కె. మిశ్రా, జస్టిస్ యు.యు లలిత్‌లతో కూడిన బెంచ్ ఈ విచారణ చేసింది. ప్రస్తుత–మాజీ న్యాయమూర్తుల బంధువులు–సన్నిహితులు, రాజకీయ సంబంధాలున్న న్యాయవాదులు మాత్రమే న్యాయమూర్తులుగా నియమితులవుతున్నారంటూ న్యాయవాదుల సంఘం వాదనలు వినిపించింది. ప్రతిభ ఉన్నప్పటికీ కొందరు న్యాయవాదులను న్యాయమూర్తులుగా ఎంపిక చేసే అంశాన్ని కొలీజియం పరిశీలించటం లేదని ఆరోపించింది. న్యాయవ్యవస్థపై కొన్ని ఉన్నతవర్గాల నియంత్రణను అడ్డుకోవాలని కోరింది. న్యాయమూర్తుల అనుచిత ప్రవర్తనపై ఫిర్యాదులను పరిష్కరించేందుకు తగిన వ్యవస్థ కూడా లేదని పేర్కొంది.. పిల్‌లోని అంశాలతో లోక్‌సత్తా విభేదిస్తున్నప్పటికీ, ఉన్నత న్యాయమూర్తుల నియామకానికి ఇప్పుడున్న కొలీజియం వ్యవస్థను మార్చాలన్న పిల్ వాదనకు మద్దతునిస్తోంది. న్యాయమూర్తులకు మతస్వామ్యం, మిగిలినవారికే ప్రజాస్వామ్యం అన్న సుప్రీంకోర్టు వ్యాఖ్యలు ఎంతమాత్రం సమర్థనీయం కాదు. అయితే పిల్‌లో పేర్కొన్నట్టు.. కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థల ప్రమేయం లేకుండా మరో స్వతంత్ర విభాగాన్ని ఏర్పాటు చేస్తే కొత్త విభాగం జవాబుదారీతనం పెద్దసమస్య అవుతుంది. అందుకే.. ఉన్నత న్యాయమూర్తుల నియామకానికి న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, పౌరసమాజం భాగస్వామ్యంతో జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ (ఎన్‌జేఏసీ)ని లోక్‌సత్తా ప్రతిపాదించింది. న్యాయవ్యవస్థతోపాటు మిగిలిన వ్యవస్థల భాగస్వామ్యం ఉండాలనటం జవాబుదారీతనం, పారదర్శకత కోసమే. రాజ్యాంగ నిర్మాతలు ఆశించింది కూడా అదే. ప్రపంచదేశాల అనుభవాలన్నిటినీ పరిశీలించి ఈ బిల్లును రూపొందించి చట్టంగా తీసుకురావటానికి వెనక లోక్‌సత్తా సుదీర్ఘకృషితోపాటు వివిధ పార్టీల, సుప్రసిద్ధ పౌరుల సహకారం కూడా ఉంది. సమాజంలో స్పందన పెరిగి త్వరలోనే న్యాయవ్యవస్థ తన తప్పిదాన్ని దిద్దుకుంటుందని ఆశిద్దాం.

# జాతీయతపై జాతీయ పార్టీలు గురివింద వైఖరిని వీడాలి

**జా**తీయత, దేశభక్తి అంటే మనదేశంలో ఇటీవల జరుగుతున్న చర్చ దేశాన్ని బలపరిచేలా కాకుండా బలహీనపరిచేలా సాగుతోంది. నీకు నీ దేశం గొప్పా? నీ మతం గొప్పా? అనే ప్రశ్నను లేవనెత్తి ఆ వివాదం చుట్టూ రాజకీయం నడపాలనుకోవటం దేశభక్తి అవుతుందా? దేశాన్ని బలహీనపరచటమే అవుతుంది. ఇన్ని కులాలు, మతాలు, భాషలు, వైవిధ్యాలు, సంక్లిష్టతలు ఉన్న దేశం ప్రపంచంలో మరొకటి లేదు. పక్కనేఉన్న చైనా జనాభాలో, చరిత్ర ప్రాచీనతలో మనతో సరితూగుతుందిగానీ, వైవిధ్యంలో మాత్రం సాటిరాలేదు. సింగపూర్ నిర్మాత లీ క్వాన్ యూ ఈ మాటను స్పష్టంగా చెబుతూ, ఎంత జనాభా ఉన్నా చైనాలాంటి మూస దేశంలో మార్పులు తేవటం తేలిక, భారత్‌లో తేవటానికి చాలా నైపుణ్యం, ముందుచూపు కావాలి అన్నారు. ఈ వైవిధ్యాన్ని మూసలోకి మార్చే ప్రయత్నం చేయటం మూర్ఖత్వమే అవుతుందన్న అంతర్గత హెచ్చరిక అందులో దాగివుంది. భారత్‌లో మార్పులు తేవాలన్న సదుద్దేశంతోనే కొందరు భారత్ మాతా కీ జై అనటాన్ని వివాదం చేసి ఉండవచ్చు. కానీ మూస విధానంలోకి దేశాన్ని మార్చే ప్రయత్నం మరో మూర్ఖపు ప్రయత్నమే అవుతుంది తప్ప విజయం సాధించటం కష్టం.



అందరూ ఢిల్లీ చెప్పినట్టే వినాలి, పంచాయతీ ఎన్నికలు ఎలా జరగాలో కూడా కేంద్ర ప్రభుత్వమే, రాజ్యాంగమే చెబుతుంది అంటే ఈదేశం నిలబడదు. అందుకే నిజంగా దేశాన్ని ప్రేమించేవారు, దేశభక్తి కలిగినవారు ఇంకా లోతుగా ఆలోచించాలి. భారతదేశం ఒక రాజకీయ యూనిట్‌గా ఏర్పడ్డాక కూడా స్థానిక పాలనా నిర్ణయాలు స్థానికంగానే తీసుకున్నారు తప్ప చక్రవర్తులు శాసించలేదు. భిన్నత్వం, స్థానిక ప్రభుత్వాలు భారతీయ సంస్కృతీసంప్రదాయాలలో భాగం. అలాంటి దేశాన్ని ఒక మూసదేశంగా, అందునా ప్రపంచీకరణ యుగంలో మార్చేందుకు ప్రయత్నించటం ఏరకమైన దేశభక్తి అనిపించుకుంటుంది? చివరికి పోప్ ఫ్రాన్సిస్ కూడా క్రైస్తవ మత ఆచారాలకు సంబంధించి పైనుంచి ఆదేశాల ప్రాతిపదికన కాకుండా స్థానిక పరిస్థితులకనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని దిగువస్థాయి మతాచార్యులకు ఇటీవల స్పష్టమైన సూచన జారీచేశారు. కాబట్టి మనం దేశభక్తికి భారతమాతను పూజించటం వంటి అంశాలకుచుట్టూ కఠిన నిబంధనలతో కొలవకూడదు. దేశభక్తికి నిజమైన నిదర్శనం.. ఈ దేశ ప్రజలందరికీ నిజమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి కోసం పోరాడటం, డబ్బు, మద్యం పంచకుండా ఎన్నికలలో పోటీచేయటం, అవి తీసుకోకుండా ఓటు వేయటం, అవినీతి లేకుండా ప్రజలకు సేవ చేయటం, కులం, మతం, ప్రాంతం, భాష వంటివి రెచ్చగొట్టి దేశ ప్రజల మధ్య చిచ్చు పెట్టకుండా సామరస్యతను పెంపొందించటం, బహిరంగ చర్చ ప్రమాణాలను పెంచటం, ఇతరుల ప్రజాస్వామిక హక్కుల్ని గౌరవించటం, శతాబ్దాల అమానుష కులాన్ని నిర్మూలించటం, వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ అవకాశాలు అందుబాటులోకి తేవటం వంటివి. ఈ విషయాలలో ఎవరు తప్పు చేసినా వారిని నిర్దాక్షిణ్యంగా బోను ఎక్కించాల్సిందే. కానీ ఇప్పుడు దేశభక్తి పేరుతో వివాదాలు సృష్టిస్తున్నవారు వీటి కోసం పోరాడటం లేదు. నినాదాల కోసం రాజకీయం చేస్తున్నారు.

నిజమైన దేశభక్తిగలవారైతే సట్లెజ్ యమున లింక్ కాలువ వివాదంపై ఎందుకు స్పందించలేదు? 214 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టు ద్వారా పంజాబ్ నుంచి రావి, బియాస్ నదీజలాలను నీటికొరత ఉన్న హర్యానా, రాజస్థాన్‌లకు తరలించేందుకు 40ఏళ్ల క్రితం ఒప్పందం కుదిరింది. అయితే పంజాబ్‌లో అధికారంలోకొచ్చిన పార్టీలు పొరుగు రాష్ట్రాలతో నీటి పంపిణీకి ససేమీరా అంటున్నారు. అక్కడ అవినీతి, వంశపారంపర్య రాజకీయాలు, డ్రగ్స్, తాత్కాలిక పథకాలతో ఖాళీ ఖజానా వంటి పెను సమస్యలను ఎదుర్కొంటున్న అకాలీదళ్ ప్రభుత్వం ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల సమయం రావటంతో ప్రజాగ్రహాన్ని తప్పించుకునేందుకు ఏకంగా జాతీయతకే గండికొట్టే

దుస్సాహసం చేసింది. ఈ కాలువ వివాదంపై సుప్రీంకోర్టులో ఓ పక్క విచారణ జరుగుతుండగానే, సట్లెజ్ యమున లింక్ కాలువ భూములను డీ నోటిఫై చేసింది. ఈ అకాలీదళ్ ప్రభుత్వంలో బీజేపీ కూడా భాగస్వామిగా ఉంది. సంకీర్ణంలో భాగంగా పంజాబ్ ఉప ముఖ్యమంత్రి భార్య, ముఖ్యమంత్రి కోడలు కేంద్రంలోని బీజేపీ సారథ్య ఎన్డీయే కూటమిలో మంత్రిపదవిలో ఉన్నారు. కానీ ఇంత యధేచ్ఛగా ఎన్నికల ప్రయోజనాల కోసం అకాలీదళ్ జాతి నిర్మాణానికి విఘాతం కలిగిస్తుంటే బీజేపీ నోరుమెదపలేదు. దేశభక్తులమంటూ దేశాన్ని మూసలోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నవారు మాట్లాడటం లేదు.

బీజేపీ నిజమైన జాతీయతను కోరుకుంటుంటే, 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పంజాబ్‌కు ఇతర రాష్ట్రాలతో ఉన్న అన్ని నీటిపంపకాల ఒప్పందాలనూ రద్దు చేసినప్పుడు కూడా ఎందుకు మాట్లాడలేకపోయింది? ఏరోజూ బీజేపీ అక్కడ జాతీయతావాదానికి భంగం కలిగించే ఘటనలపై నిర్ద్వంద్వంగా స్పందించలేదు. మార్చి 14న ఏకంగా లింక్ కాలువ భూముల్ని డీ నోటిఫై చేసి భూ యజమానులకు తిరిగి ఇచ్చేయటానికి ప్రభుత్వం సిద్ధపడుతుంటే సభలో ఉన్న 12మంది బీజేపీ ఎమ్మెల్యేలు కనీస ప్రతిఘటన కూడా లేకుండా మౌనప్రేక్షకుల్లా కూర్చున్నారు. పంజాబ్ ఈ కాలువ నిర్మాణాన్ని పూర్తిచేయాలని బీజేపీ ప్రభుత్వమే సుప్రీంకోర్టులో వాదిస్తుండగా, ఒక్క నీటి చుక్కను కూడా ఇతర రాష్ట్రాలకు ఇవ్వబోమని పంజాబ్ ముఖ్యమంత్రి స్పష్టంచేస్తున్నారు. ఒక పౌరుడు న్యాయస్థాన ఆదేశాన్ని ధిక్కరిస్తేనే అది దేశద్రోహమవుతుంది. అలాంటిది ఒక రాష్ట్ర ప్రభుత్వం ధిక్కరించినా బీజేపీ మాట్లాడకపోవటం ఏరకమైన దేశభక్తి అవుతుంది? నదీజలాల పంపిణీ, రిజర్వేషన్లు వంటి అంశాలపై భిన్నాభిప్రాయాలను పరిష్కరించే శక్తి లేక నినాదాలు, గీతాలాపనలు వంటి అంశాల చుట్టూ రాజకీయం చేస్తున్నట్టు కనిపిస్తోంది.

పంజాబ్‌లో, హర్యానా, రాజస్థాన్‌లో కూడా బీజేపీ అధికార పార్టీలో భాగంగా, అధికార పార్టీగా ఉంది. కేంద్రంలో అధికారంలో ఉంది. సంకల్పం ఉంటే ఈ సమస్యను సుప్రీంకోర్టులో కాకుండా తాను పరిష్కరించగలుగుతుంది. కానీ రాజకీయ ప్రయోజనాల కోసం జాతీయతనే ఫణంగా పెట్టి మౌనం వహిస్తోంది.

అలాగే కాంగ్రెస్ పార్టీ. కన్నయ్య కుమార్ వివాదంలో విపరీత వ్యాఖ్యలు చేసి తామేదో ప్రత్యామ్నాయ శక్తి అన్నట్టు భ్రమింపచేసేందుకు ప్రయత్నిస్తోందిగానీ, పంజాబ్‌లో నీటి ఒప్పందాలను రద్దు చేసినప్పుడు ఏమైంది కాంగ్రెస్ దేశభక్తి? పంజాబ్ రగలటానికి, ఈ వివాదం ఇంత ముదరటానికి కాంగ్రెసే కారణం కాదా? దేశానికి స్వతంత్రం తెచ్చామని చాటుకునే ఈ పార్టీ, చిచ్చు పెట్టి ఓట్లు దండుకునే క్రమంలో దేశసమగ్రతను మర్చిపోయింది. అకాలీదళ్ మీద వ్యతిరేకతను సొమ్ము చేసుకోవటానికి ఆమ్ ఆద్మీ పార్టీతో పోటాపోటీగా కాంగ్రెస్ సంచలనాల కోసం ఇష్టమొచ్చినట్టు ప్రకటనలు గుప్పిస్తోంది. పఠాన్‌కోట్‌లో పాక్ బృందం పర్యటన కావచ్చు, నదీజలాల పంపిణీ కావచ్చు దేశ ప్రయోజనాలు అక్కడ వారికి పట్టటం లేదు. తీవ్రప్రజావ్యతిరేకతను తగ్గించుకునే క్రమంలో ప్రతిపక్షాలకు ఏమాత్రం అవకాశం ఇవ్వకూడదనే ఉద్దేశంతో ప్రస్తుత అకాలీదళ్ ముఖ్యమంత్రి భూముల డీనోటిఫికేషనే ప్రకటించేశారు. ఇక కాంగ్రెస్ నిర్వాకం మహారాష్ట్రలో కూడా అదేతీరుగా ఉంది. ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు ఓపక్క దేశంలోని విశ్వవిద్యాలయాలను సందర్శిస్తూ నినాదాలు, భావప్రకటనా స్వేచ్ఛపై ఆంక్షలు ఉండకూడదని చెబుతుంటే, మహారాష్ట్ర అసెంబ్లీలోని కాంగ్రెస్ సభ్యులు కేవలం ఓ నినాదంపై ఎంఐఎం ఎమ్మెల్యే సస్పెన్షన్‌కు మద్దతు పలికారు. కర్ణాటక-తమిళనాడు కావేరీ జలాల వివాదంలోనూ రాజకీయ లబ్ధి కోణంలోనే ఆలోచిస్తున్నారు.

ప్రధాన జాతీయ పార్టీలు దేశ సమగ్రత విషయంలో కీలకమైన ఈ అంశాలను మాత్రం స్థానిక పార్టీలకు వదిలేస్తూ, స్థానికంగా వాళ్లకివ్వాల్సిన అంశాలపై పైనుంచి పెత్తనం చేస్తూ, నినాదాలు, జెండాలు ఎగరేయటం, గీతాల్ని ఆలపించటమే దేశభక్తి అన్నట్టు వ్యవహరించటం ఈదేశానికి ఏమాత్రం క్షేమం కాదు. భారత్ మాతా కీ జై అనే నినాదం కోసం పట్టుబడుతున్న వాళ్లలో చాలామంది అధికారం కోసం ఆ పనిచేయటం లేదు. వారు నమ్మిన ఓ ఆదర్శం కోసం నిస్వార్థంగానే చేస్తున్నారు. కానీ భారత్‌లాంటి ఒక సంక్లిష్ట సువిశాల దేశంలో కేవలం వ్యక్తిగత నిజాయతీ, నిస్వార్థత సరిపోదు. తక్షణ అవసరాల్ని, దీర్ఘకాలిక ప్రయోజనాల్ని సమన్వయంచేసే వ్యవస్థీకృత నిజాయతీ కావాలి. అందుకోసం దేశభక్తి, జాతీయతపై లోతైన ఆలోచన చేయాలని, వివక్ష లేకుండా అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే సమగ్ర భారతదేశ నిర్మాణానికి తగిన విద్య, ఆరోగ్యం, రాజ్యాంగ వికేంద్రీకరణ, పటిష్ట రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు వంటి అంశాలను జాతి నిర్మాణానికి నిజమైన కొలమానాలుగా చేపట్టాలని విజ్ఞప్తి. అందరూ ఒక లక్ష్యం కోసం పనిచేస్తే నష్టాన్ని నివారిస్తూ వేగంగా ఈదేశ సుస్థిరాభివృద్ధిని సాధించగలం.

# జాతీయ వైద్య కమిషన్‌ను స్వాగతిస్తున్నాం, కానీ బిల్లులో మార్పులు కావాలి
## కేంద్రానికి లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ సమర్పించిన సవరణల్ని విడుదల చేసిన జేపీ

అవినీతి, అసమర్థ భారత వైద్యమండలి (ఎం.సి.ఐ) స్థానంలో జాతీయ వైద్య కమిషన్ (ఎన్.ఎం.సి)ని ఏర్పాటు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను స్వాగతిస్తున్నట్టు లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) ప్రధాన కార్యదర్శి డా॥ జయప్రకాష్ నారాయణ్ తెలిపారు. మితిమీరిన రాజకీయ జోక్యం, జవాబుదారీతనం లేకపోవటం, కేంద్రీకృత నిర్ణయాలు, ప్రజల అవసరాలకు తగ్గట్టు వైద్యవిద్యావకాశాలు కల్పించలేకపోవటం, వైద్య రంగ నిపుణులుండే వ్యవస్థలతో అనుసంధానం కాకపోవటం వంటి వైఫల్యాలతో ఎంసీఐ వైద్య విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించిందన్నారు. ప్రస్తుత ఎన్.ఎం.సి బిల్లు డా॥ రంజిత్ రాయ్ చౌధురి కమిటీ, పార్లమెంటరీ కమిటీల మేలైన సిఫార్సులను పరిగణలోకి తీసుకుని ఆ వైఫల్యాలను సరిచేసే ప్రయత్నం చేస్తోందన్నారు. "జాతీయ వైద్య కమిషన్‌ను సెర్చ్ అండ్ సెలక్ట్ కమిటీ ద్వారా ప్రభుత్వం నియమించటం, నాలుగు స్వయంప్రతిపత్తి కలిగిన బోర్డులు – అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ బోర్డు (యు.జి.ఎం.ఇ.బి), పోస్టు గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ బోర్డు (పి.జి.ఎం.ఇ.బి), మెడికల్ అక్రెడిటేషన్ అండ్ రేటింగ్ బోర్డు (ఎం.ఎ.ఆర్.బి), బోర్డ్ ఫర్ మెడికల్ ఎడ్యుకేషన్ రిజిస్ట్రేషన్ (బి.ఎం.ఆర్)–లను ఏర్పాటు చేసి వాటిని ఎన్ఎంసీ పరిధిలోకి తేవటం మంచి చర్య. వైద్యుల గుర్తింపు నుంచి వైద్య విద్యాభ్యాసం, కళాశాలల పనితీరును అంచనావేయుటం, పారదర్శకతవైపు దృష్టి కేంద్రీకరించటం అవసరం. యోగ్యత ద్వారా విద్యార్థులకు కళాశాల సీట్లను కేటాయించినప్పుడు వాటిపై రుసుము నియంత్రణ చేయవలసిన పని లేదన్న సూచన పరిణతితో కూడినది" అని జేపీ అన్నారు. అయితే వైద్య కళాశాలలు, యాజమాన్యాలు రెండో అప్పీలు ప్రభుత్వానికి చేసుకునే అవకాశం, వైద్య సీట్ల భర్తీ, వైద్యుల గుర్తింపు పరీక్ష, కమిషన్ జవాబుదారీతనం వంటి అంశాలలో ఎన్ఎంసీ ముసాయిదా బిల్లులో కొన్ని లోపాలున్నాయన్నారు. ఈ లోపాలను పరిష్కారాలతో లిఖితపూర్వకంగా వివరిస్తూ నీతి ఆయోగ్‌ద్వారా కేంద్రప్రభుత్వానికి పత్రాన్ని సమర్పించామన్నారు.

**కేంద్ర ప్రభుత్వ జాతీయ వైద్య కమిషన్ ముసాయిదా బిల్లుపై లోక్‌సత్తా/(ఎఫ్‌డీఆర్ నీతి ఆయోగ్‌కు సమర్పించిన ఈ దిగువ ప్రధాన సవరణ సూచనల్ని జయప్రకాష్ నారాయణ్ మీడియాకు విడుదల చేశారు..**

■ **రెండో అప్పీలు ఏర్పాటు తొలగించాలి:** ముసాయిదా బిల్లులో అండర్ గ్రాడ్యుయేట్ (యుజి), పోస్టు గ్రాడ్యుయేట్ (పిజి) విద్యకి సంబంధించి ఎం.ఎ.ఆర్.బితో విభేదిస్తే ఎన్.ఎం.సికి



మొదటి అప్పీలు, అటుపైన ప్రభుత్వానికి రెండో అప్పీలు చేసుకోవచ్చని ఉన్న ఏర్పాటు (సెక్షన్ 27) అసంబద్ధమైనది. ఎం.ఎ.ఆర్.బి, ఎన్ఎంసీ సభ్యులను ప్రభుత్వమే సెర్చ్ అండ్ సెలక్ట్ కమిటీ ద్వారా చట్టప్రకారం అర్హతలను బట్టి ఎంపిక చేస్తోంది. 20మందిలో 15మందిని కేంద్రప్రభుత్వం ఎన్నిక చేయగా, మిగిలిన ఐదుగురిని వైద్య సలహా మండలి (ఎంఎసి) నుంచి రొటేషన్ పద్ధతిలో ఎన్నుకుంటారు. సలహా మండలి సభ్యులను రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలూ ఎంపిక చేస్తాయి. అందువల్ల ప్రభుత్వానికి చేసే రెండో అప్పీలు అనవసరం. ఇది రాజకీయ లబ్ధికి ఆస్కారం కల్పిస్తుంది. ఎం.ఎ.ఆర్.బి నిర్ణయంపైన ఒక అప్పీలుకు ఎన్ఎంసీ వద్దకు వెళ్లవచ్చుకాబట్టి ఎన్ఎంసీ నిర్ణయాన్నే అంతిమమైనదిగా పరిగణించాలి.

■ **ఏక సభ్య బోర్డులను త్రిసభ్య బోర్డులుగా మార్చాలి:** బిల్లు నాలుగు బోర్డులకూ ఎక్కువ అధికారాలిచ్చే యోచన చేస్తోంది. కానీ ఇందులోని మూడు బోర్డులు–యు.జి.ఎం.ఇ.బి, పి.జి.ఎం.ఇ.బి, ఎం.ఎ.ఆర్.బి–కి ఒకే అధ్యక్షుడిని ప్రతిపాదిస్తోంది. నిజానికి ఇవన్నీ ఏకసభ్య బోర్డులు. దేశ సంక్లిష్టత, బోర్డులకుండే విస్తృతాధికారాలు, అవినీతిమయ వ్యవస్థ, గత వైఫల్యాలను దృష్టిలో పెట్టుకుని ఈ బోర్డులన్నిటినీ త్రిసభ్య బోర్డులుగా మార్చాలి. అయితే బిల్లులో పేర్కొన్నట్టు బోర్డుల అధ్యక్షులు మాత్రమే ఎన్ఎంసీ సభ్యులుగా ఉంటారు. అనేకమంది సభ్యులుండే బోర్డుల వల్ల వైద్య విద్య, వృత్తిలో విశేష అనుభవం, నేపథ్యం ఉన్నవారి సేవలు దేశానికి లభ్యమవుతాయి.

■ **ప్రైవేటు వైద్య కళాశాలల్లో అడ్మిషన్లను హేతుబద్ధీకరించాలి:** యు.జి, పి.జిలో ప్రైవేటు కాలేజీల్లో అడ్మిషన్లన్నిటినీ నీట్, గుర్తింపు పరీక్షల ద్వారానే చేయాలి. 40శాతం సీట్లకు (కచ్చితమైన వాటా ఉంటే మంచిది) ఫీజును నియంత్రించి, మిగిలిన వాటికి

కళాశాలలకు పూర్తి స్వేచ్ఛ ఉండేలా చేయటంతోపాటు ఎక్కువ ఫీజు చెల్లించే వారికి కేటాయించే సీట్లను కూడా మార్కుల ఆధారంగానే ప్రవేశ ప్రాధాన్యత ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఈ ఏర్పాట్లలో కొన్నిటిని నీతి ఆయోగ్ కమిటీ నివేదికలో చెప్పారు. కానీ అది సరిపోదు. ఈ మొత్తం మార్పుల్నీ బిల్లులో చేర్చాలి.

■ **వైద్య విద్య ప్రమాణాలను పెంచేందుకు పరీక్షా పద్ధతుల్లో మార్పులు, స్పెషాలిటీ సంస్థలతో సంధానం:** అండర్ గ్రాడ్యుయేట్ పూర్తిఅయిన వారందరికీ వైద్యుల గుర్తింపు పరీక్ష (అమెరికాలోని యు.ఎస్.ఎం.ఎల్.ఎ తరహాలో) నిర్వహించటం మంచి యోచన. ఇది పట్టా పుచ్చుకున్నవారి కనీస ప్రమాణాలను, వైద్య విద్యనందించటంలో కళాశాలల ప్రమాణాలను పరిరక్షిస్తుంది. పిజి ప్రవేశార్హతకు జాతీయ స్థాయి పరీక్షగా కూడా ఉపయోగపడుతుంది. అయితే యుజి పరీక్షా విధానంపైన మరికొంత శ్రద్ధ అవసరం. ఎక్కువగా రాతపరీక్షల ద్వారానే విద్యార్థులను మూల్యాంకనం చేయటం వల్ల సామర్థ్యాన్ని, నైపుణ్యాల్ని సక్రమంగా అంచనా వేయలేకపోతున్నారు. విద్యార్థులు రోగులతో వ్యవహరించే నేర్పును పరీక్షించాలి. ఆబ్జెక్టివ్ స్ట్రక్చర్డ్ క్లినికల్ ఎగ్జామ్ (ఓ.ఎస్.సి.ఇ) వంటి వాటి ద్వారా నైపుణ్యాల్ని అంచనావేయాలి. ఉదాహరణకు ఒక రాష్ట్రం లేదా జిల్లా స్థాయిలో 10-15మంది నిపుణులతో వైద్య విద్యార్థిని పరీక్షించవచ్చు. వీటిని రాతపరీక్షల్లో కలిపే మార్కులుగా కాకుండా ప్రాథమిక అర్హత ప్రమాణాలుగా భావించాలి. విద్యార్థి ఒకే పరీక్షలో అనేకమంది ఎగ్జామినర్లను ఎదుర్కొంటాడు కాబట్టి సొంత నైపుణ్యమెంతో తేలేందుకు అవకాశం ఉంటుంది. వీటిని యు.జిలోని వివిధ స్థాయుల్లో, సమయాలలో ఏర్పాటు చేయవచ్చు. ప్రస్తుత నైపుణ్య పరీక్షలు వైద్య కళాశాలలు నిర్వహించటం వల్ల ప్రమాణాల కొరతకు, అవినీతికి ఆస్కారం పెరుగుతోంది. భారత వైద్యరంగంలో ఇటీవల స్పెషాలిటీ కోర్సులకి ఎన్నో సంస్థలు ఏర్పడ్డాయి. ఈ సంస్థల సహాయాన్ని పి.జి విద్యను మెరుగుపరచటానికి ఉపయోగించాలి. ఈ వైద్యసంస్థలకి స్పెషాలిటీ కోర్సులు, ఉప కోర్సులు అందించటంలోనూ, పాఠ్యాంశాలను అందించటంలోనూ అధికారం ఇవ్వాలి. సంబంధిత సాధారణ ప్రమాణాలను పి.జి.ఎం.ఇ.బి అందిస్తే, లోతైన విస్తృత ప్రమాణాలను స్పెషాలిటీ సంస్థలు కల్పించుకుంటాయి. సెక్షన్ 22(2)ని ఈ మేరకు సవరించాలి.

■ **ఎన్.బి.ఇ మార్గదర్శకాల ప్రకారం శిక్షణ పొందినవారిని పి.జిలుగా గుర్తించాలి:** నీతి ఆయోగ్ కమిటీ రిపోర్టు పేరా 3.7 (ఇ)(3)లో ఎన్.బి.ఇ (జాతీయ పరీక్షల బోర్డు) ముఖ్య పాత్ర ఎప్పటిలాగే కొనసాగుతుందని పేర్కొన్నప్పటికీ, ముసాయిదా బిల్లులోని సెక్షన్ 42లో ఎన్.బి.ఇని వెంటనే పి.జి.ఎం.ఇ.బిలో కలపాలని సూచిస్తున్నట్టు పేర్కొన్నారు. మనదేశంలో పి.జి విద్యను ప్రోత్సహించటంలో ఎం.సి.ఐ దారుణంగా విఫలమైంది. దేశంలో సుమారు 49శాతం (25577)మంది గ్రాడ్యుయేట్లకి పి.జి వైద్య సీట్ల కొరత ఉంటోంది. సమాజ చట్టబద్ధ అవసరాలు తీర్చటానికి, నాణ్యమైన శిక్షణ అందించటానికి ఎన్.బి.ఐని స్థాపించారు. వైద్య కళాశాలల్ని స్థాపించే ఉద్దేశం లేకపోయినా వైద్యరంగంలో అద్భుతరీతిలో విశ్వసనీయ సేవలందించే ఉన్నత ప్రమాణాల ప్రైవేటు ఆసుపత్రులు పి.జి చదువుకు ఎంతో అనువైనవి. ఈ ఆసుపత్రులను ఎన్.బి.ఇ ద్వారా పి.జి విద్యను విస్తరించటానికి వినియోగించుకోవాలి. ఎన్.బి.ఇ మార్గదర్శకాల ప్రకారం శిక్షణ పొందిన జాతీయ బోర్డు డిప్లొమాట్లందరినీ (డి.ఎన్.బి) ఎం.సి.ఐ/ ఎన్.ఎం.సి పి.జి డిగ్రీ పట్టభద్రులతో సమానంగా పరిగణించాలి. ఈ అంశాన్ని ముసాయిదా బిల్లు సెక్షన్ 32(1)లో చేర్చాలి. ఎన్.ఎం.సితో ఎన్.బి.ఇని అనుసంధానం చేసి పి.జి విద్యను అభివృద్ధి చేయటానికి వినియోగించాలి. కాబట్టి 42(3)ని తొలగించి ఎన్.బి.ఇని కొంతకాలం కొనసాగించాలి. అయిదేళ్ల తర్వాతో, ఇంకొంతకాలం తర్వాతో సమీక్ష చేసి అప్పుడు కొత్తగా ఏర్పడిన ఎన్.ఎం.సితో ఎన్.బి.ఇని కలపటంపై నిర్ణయం తీసుకోవాలి.

■ **రాష్ట్ర వైద్య మండళ్లను నిర్వచించాలి:** ముసాయిదా బిల్లు రాష్ట్ర వైద్య మండళ్ల (ఎస్.ఎం.సిల) కూర్పు గురించి ప్రస్తావించటం లేదు. వైద్య వృత్తికి సంబంధించి దేశంలో ఎన్.ఎం.సి, బి.ఎం.ఆర్ ప్రధానమైన రెగ్యులేటరీ సంస్థలయినప్పటికీ.. నిబంధనలు ఉల్లంఘించిన వైద్యులపై చర్యలు, జరిమానాలు విధించటం, జాబితా నుంచి తొలగించటం వంటి చర్యలను వాస్తవంగా అమలు చేయాల్సింది రాష్ట్రాల మండళ్లే. ప్రస్తుత ఎం.సి.ఐ చట్టం (1956)ఎన్.ఎం.సిల ఏర్పాటుపై రాష్ట్రాలకు అధికారం కల్పిస్తున్నది. కానీ చాలా రాష్ట్రాల కౌన్సిళ్లు ట్రేడ్‌యూనియన్లలాగా వ్యవహరిస్తూ డాక్టర్లకు అండగా వుంటున్నాయి తప్ప నియంత్రణా బాధ్యతల్ని నెరవేర్చటం లేదు, వైద్యుల అవినీతి బారి నుంచి సమాజాన్ని కాపాడే ప్రయత్నం చేయటం లేదు. కాబట్టి రాష్ట్రాల వైద్య మండళ్ల నియామకాల విధివిధానాల్ని బిల్లులో నిర్వచించాలి. జాతీయ వైద్య కమిషన్ నామినేట్ చేసినవారు రాష్ట్ర మండలిలలో ఉండేలా ఏర్పాటు చేయాలి. రాజ్యాంగంలోని 13, 19(6) అధికరణలు, ఏడో షెడ్యూల్ మొదటి జాబితాలోని 65,66 అంశాల ప్రకారం పార్లమెంటుకు ఈ అధికారం ఉంది.

■ **జాతీయ వైద్య కమిషన్‌ని పార్లమెంటుకు జవాబుదారీ చేయాలి:** వైద్య విద్యలో, వైద్య వృత్తి నైతిక విలువలు, వైద్య సదుపాయాలలో ప్రమాణాలను కాపాడటంలో జాతీయ వైద్య కమిషన్‌కు ఉన్న విస్తృత ప్రాధాన్యత దృష్ట్యా జవాబుదారీతనం ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఎన్.ఎం.సి వార్షిక నివేదికల్ని పార్లమెంటుకు సమర్పించటం తప్పనిసరి చేయాలి. పార్లమెంటులో చర్చ, కమిటీల విచారణ ద్వారా జాతీయ వైద్య కమిషన్‌ను జవాబుదారీ చేయాలి.

జాతీయ వైద్య కమిషన్ ముసాయిదా బిల్లుపై నీతి ఆయోగ్ (కేంద్ర ప్రభుత్వం)కు ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా సమర్పించిన సూచనల పూర్తి వివరాలను www.fdrindia.org వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

# ఎజెండాలో సరైన విద్యలేని వింత రాజకీయంలో మగ్గుతున్నాం

- పి. రాజీవ్



అమాయకపు పాలబుగ్గల, పసి పువ్వుల నవ్వులు చిందించే చిన్నారులు అమ్మ ఒడిలో పాఠాలు నేర్చుకోవాల్సిన సమయంలో 'ఆయమ్మ' ఒడిలో, తాత–నాయనమ్మ ఒడిలో కూర్చుని నేర్చుకునే సమయంలో స్పెషల్ ట్యూషన్ క్లాసెస్‌లో గడిపే సంస్కృతి పెరిగిపోతోంది. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఆ పసిమొగ్గలు శారీరక, మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటూ బాల్యాన్ని భారంగా గడుపుతున్నారు. దీనివెనక పెద్దలకున్న ఆర్థిక, సామాజిక పరిస్థితులను మదింపు చేసి ప్రతి బిడ్డలో సామర్థ్యాన్ని వికసింప చేసే, ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాల్ని కల్పించే విద్యావ్యవస్థను రూపొందించాల్సిన బాధ్యత నుంచి ప్రభుత్వం పారిపోతుండటమే ఇక్కడ పెద్ద సమస్య. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను ధ్వంసం చేస్తూ ప్రభుత్వం విద్యావ్యవస్థను ఈ స్థితికి తీసుకొచ్చింది. 70 సంవత్సరాల స్వతంత్ర భారతంలో విద్యాప్రమాణాలు ఎందుకు దిగజారుతున్నాయో ఆలోచించి దిశానిర్దేశం చేసుకోగల శక్తి లేకపోతే ఎర్రకోట ప్రసంగాలకు, జెండా పండగలకు విలువేముంది? బాల్యానికి ఆటపాటలు, విలువలతో కూడిన విద్యను అందించాల్సింది పోయి వారికి బాల్యమే శాపమయ్యేట్టు చేస్తున్న నేటి విద్యావ్యవస్థ వైఫల్యాన్ని సరిదిద్దే ప్రయత్నం చేయకుండా, ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా తల్లిదండ్రులు కూడా పిల్లల బాల్యాన్ని నరకపు అంచుల్లోకి నెట్టి వేస్తున్నారు.

విద్య అనగా 'నాలుగు గోడల మధ్య బంధించి బోధించేది కాదు, పిల్లలు స్వతహాగా నేర్చుకునే పరిస్థితులను కల్పించడమే' అంటారు విశ్వమేధావి ఆల్బర్ట్ ఐన్‌స్టీన్. కానీ నేడు మనదేశంలోగానీ, రాష్ట్రంలోగానీ ఇలాంటి పరిస్థితులు లేవు. విద్యావ్యవస్థకు భారతదేశం ప్రాచీన కాలం నుండి ప్రపంచంలోనే ప్రాచీన కాలం నుంచి ప్రముఖస్థానం కలిగివుంది అని గొప్పలు చెప్పుకునే పాలకులు, పాలసీదారులు ఈరోజు విదేశీ విద్యాసంస్థల వైపు ఎందుకు చూడాల్సి వస్తోంది? కొన్ని దశాబ్దాలుగా ఈ దేశంలో మారుతున్న విద్యావ్యవస్థ తీరుని పరిశీలిస్తే, పాలకుల దోపిడీ మనస్తత్వాన్ని గమనించవచ్చు. మనిషి రాజ్యాంగబద్ధంగా సాధించుకున్న విద్య, వైద్య, ఉపాధి భరోసాలను కాలరాస్తున్న పాలకవర్గాల కుట్రలను అర్థం చేసుకోవచ్చు. ఒకనాడు సంపన్నవర్గాలకు దగ్గరగా ఉన్న విద్యను ఈదేశంలో మనుషులందరికీ కులం, పుట్టుకతో సంబంధం లేకుండా విముక్తి సాధనంగా అందించేందుకు కొన్ని దశాబ్దాలు పోరాటం సలిపి జోతిబాపూలే, సావిత్రిబాయి పూలే, నారాయణ గురు, అంబేద్కర్ వంటివారు కృషి చేశారు. భారతదేశ కమ్యూనిస్టులు తప్పించుకున్నా.. నాణ్యమైన విద్యను, ఆరోగ్యాన్ని రాజకీయానికి కేంద్రబిందువు చేసేందుకు లోక్‌సత్తా తొలినుంచీ పోరాటం చేస్తోంది. వివక్ష లేకుండా అందరికీ విద్యనందించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయటం వల్ల జరిగిన అపారనష్టం నుంచి ఈదేశాన్ని, భవిష్యత్తు తరాలను కాపాడుకోవటానికి చాలా పోరాటం చేయాల్సి వుంది.

పాఠశాల అంటే.. ఏమీ రాయని కాగితం (విద్యార్థి)పై జ్ఞానం, విలువలు, ఆత్మస్థయిర్యం, అంతకంటే సమాజంలో ఒక మంచి పౌరుడిగా బతకడానికి కావాల్సిన వాటిని అందంగా రాసే కలం లాంటిది. కానీ నేటి ఈ పాఠశాలలు పిల్లల మెదళ్లపై ఒత్తిడి, సంఘర్షణ, చిరాకు, కోపం, అంతకంటే ఎక్కువ స్వార్థం అందిస్తున్నాయి. దానికి గల కారణాలు ఉపాధ్యాయులలో అంకితభావం లేకపోవడమా? లేక బోధించేవారికి పిల్లల మానసిక స్థితిని అర్థం చేసుకుని బోధించే అర్హతలు

లేకపోవడమా? లాభార్జన కోసం నడుపుతున్న కార్పొరేట్ వ్యవస్థనా? ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణా? ప్రభుత్వ నేతల కనుసన్నల్లో చేస్తున్న వ్యాపారమా? అన్నీ ఈరోజు సమాజంలో ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన తరుణం ఇది. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఎలాంటి విద్య కావాలో ఆలోచించుకోవాలి. సూర్యోదయంతో మొదలై సూర్యాస్తమయం వరకు చదివే విద్య కావాలా, లేక పిల్లలకు వారివారి వయసు ప్రకారం (మనోవిజ్ఞాన వేత్తల ప్రమాణాలకు అనుగుణంగా) వారి ఎదుగుదలకు తోడ్పడే విద్య కావాలా అనేది ముందుగా నిర్ణయించుకోవాలి. తల్లిదండ్రులు ఈ కార్పొరేట్ విద్యావ్యవస్థ మాయలో పడి తమ పిల్లలను ఆ హింసా కేంద్రాలలో చేర్చటం సిగ్గుచేటు. మా అబ్బాయి/అమ్మాయి ప్రభుత్వ పాఠశాలలో కంటే ప్రైవేటు స్కూలులో బాగా చదువుతున్నాడు, బాగా మార్కులు వస్తున్నాయి అని తల్లిదండ్రులు సంతృప్తి చెందుతున్నారుగానీ, చాలామేర వాస్తవాలు అందుకు విరుద్ధంగా వున్నాయి. బాగా డబ్బున్నవారు మాత్రమే భరించగలిగిన ప్రపంచస్థాయి ప్రమాణాల కొన్ని స్కూళ్లను మినహాయిస్తే, మిగిలిన చోట్ల బోధన చాలా యాంత్రికంగా ఉంటోంది. విద్యను బోధించకుండా మార్కులు రావటానికి ప్రైవేటు స్కూలు టీచర్లు పిల్లలపై ఎంతో ఒత్తిడి తెస్తున్నారు. పిల్లలు ఎంత ఒత్తిడి లోనవుతున్నారో తల్లిదండ్రులు కాస్త ఆగి నింపాదిగా ఆలోచిస్తే అర్థమవుతుంది. ప్రముఖ డాక్టర్ పద్మశ్రీ పి. నల్పెరుమల్ స్వామి (తమిళనాడు) ప్రకారం, తల్లిదండ్రులు, పాఠశాలలు ఇద్దరూ కేవలం పరీక్షలను దృష్టిలో పెట్టుకునే చిన్న పిల్లలకు విద్యను అందిస్తున్నారుగానీ, నిజజీవితంలో కావలసిన విలువలు, ఆత్మస్థైర్యంతో కూడిన విద్యను అందించటం లేదు. సరైన విద్యను అందించకపోగా, పిల్లలకు చిన్నతనంలోనే రకరకాల జబ్బులకు (కంటిచూపు, మానసిక ఒత్తిడి వంటి వాటికి) కారణం అవుతున్నారు.

ప్రభుత్వ నిబంధనలు పక్కాగానే ఉన్నాయి. కానీ విధానాలు సరిగా లేకపోవటం, చిత్తశుద్ధి, సంకల్పం లోపించటం వల్ల నిబంధనలు పనిచేయటం లేదు. కొన్ని నిబంధనలైతే అనుకున్న లక్ష్యానికి వ్యతిరేక ఫలితాలనిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధన ప్రకారం పాఠశాలలకు నిర్ణీత విస్తీర్ణం ఉండాలి. సరైన వసతులతో కూడిన భవనాలు, వాటికి సరైన వెలుతురు వచ్చే విధంగా కిటికీలు ఉండాలి. ఒకవేళ బహుళ అంతస్తుల పాఠశాలలు ఏర్పాటు చేస్తే పిల్లలకు మెట్లు ఎక్కడానికి వీలుగా ర్యాంపు నిర్మాణం ఉండాలి. ఆ భవనంలో అగ్నిప్రమాదాలు నివారించే ఏర్పాట్లు ఉండాలి. విద్యార్థుల రవాణా సౌకర్యానికి ఉపయోగించే వాహనాలకు అనుమతితోపాటు ఏటా తనిఖీలు ఉండాలి. ప్రాథమిక పాఠశాలలకు జిల్లా విద్యాధికారి (డీఈవో), ఉన్నత పాఠశాలలకు ప్రాంతీయ ఉమ్మడి డైరెక్టర్ అనుమతులివ్వాలి. కొత్త పాఠశాలల అనుమతులకైనా, పాత పాఠశాలల పునరుద్ధరణకైనా అనుమతులిచ్చే విషయంలో కొంతమంది అధికార దుర్వినియోగం వల్ల ఎన్నో పాఠశాలలు అనుమతులు లేకుండా కొనసాగుతున్నాయి. కనీసం సంవత్సరానికి 2 లేదా 3 మూడుసార్లు అయినా పాఠశాలను తనిఖీ చేయాలి. కానీ ఆ చట్టాలు/నిబంధనలు కాగితాలకు మాత్రమే పరిమితమయ్యాయి. నియంత్రణ లేని ప్రైవేటు, కార్పొరేట్ విద్యావ్యవస్థ అటు ఆర్థికంగా, ఇటు పిల్లల ఎదుగులపరంగా కూడా అత్యధికశాతం తల్లిదండ్రులకు, దేశానికి నష్టదాయకంగా తయారవుతున్నాయి. కార్పొరేట్ పాఠశాలలు ఒక్క పాఠశాలకు అనుమతులు తీసుకొన్ని పేర్లు మార్చి (దిల్‌షుక్‌నగర్, నారాయణగూడ, సికింద్రాబాద్) ఎన్నో పాఠశాలల్ని ఏర్పాటు చేస్తున్నాయి. నిబంధనల ప్రకారం పిల్లల శారీరక ఎదుగుదల కోసం క్రీడా మైదానం 1000 నుంచి 2200 చదరపు మీటర్ల మేర ఏర్పాటు చేయాలి. కానీ ఇప్పటికీ ఒక్క హైదరాబాద్‌లోనే 480 గుర్తింపు పొందిన పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలు లేవు, 1661 పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులే లేరు. అంటే పిల్లల ఎదుగుదల పట్ల ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థమవుతుంది. ఒక భద్రతకు సంబంధించి ఏదైనా అగ్నిప్రమాదాలు సంభవిస్తే ఆర్పడానికి తగిన ఏర్పాట్లు 99శాతం పాఠశాలల్లో లేవు. కార్పొరేట్ పాఠశాలల రవాణా బస్సులకు ప్రతీ సంవత్సరం పోలీసుల నుండి అనుమతి తెచ్చుకోవాల్సి ఉన్నా నిబంధనలు ఇంకా పక్కాగా అమలవకుండా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం అనుమతి పొందిన ప్రైవేటు/కార్పొరేట్ పాఠశాలలు 14,042 కాగా, ప్రభుత్వ పాఠశాలలు 29,251. కానీ అడ్మిషన్లు మాత్రం ప్రైవేటులో పెరిగిపోతుంటే ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గుతున్నాయి. విపరీత ప్రచారం కల్పించి ఎంతో కష్టపడితే కొన్నిచోట్ల ప్రభుత్వ స్కూళ్లలో నూరుశాతం సీట్లు భర్తీ అయ్యాయట. ఇవన్నీ జబ్బు లక్షణాలే తప్ప అసలు జబ్బు కాదు. అసలు జబ్బు మన విద్యావ్యవస్థలో ఉంది. దానికి సరైన మందు పడి చికిత్స జరగాలి.

రోజురోజుకీ ముంచుకొస్తున్న ప్రైవేటు/కార్పొరేట్ విద్య దోపిడీని, యాంత్రిక విద్యను అదుపుచేయాలి. విద్యాప్రమాణాల్లో నాణ్యతను పెంచే ఏర్పాట్లను చేసి ఆహ్లాదకరంగా విద్యార్థులు చదువుకునే వ్యవస్థను తయారుచేయాలి. ఇందుకు పూర్తి బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలి. తల్లిదండ్రులు, విద్యార్థులు, సమాజం, మీడియా ఇలా అందరూ మంచి విద్య కోసం తహతహలాడుతున్నారు. కానీ పోటీ ప్రపంచంలో పిచ్చి భ్రమల్లో కొట్టుకుపోతూ చేతులారా సంక్షోభంలో కూరుకుపోతున్నారు. సమాజంలో అన్నిరకాలుగా డబ్బు, అవకాశాలున్న 15-

20శాతం గురించి మనం ఆలోచించనక్కర్లేదు. కానీ విద్యతో బాగుపడతామని తెలిసినా, ఆ విద్యను ఎలా అందుకోవాలో, ప్రభుత్వాన్ని ఎలా నిలదీయాలో తెలియక తాము నలిగిపోతూ పిల్లల మీద భారం వేస్తున్న మిగిలిన 80-90శాతం గురించి మనమంతా ఆలోచించాలి. పేదరికం వల్ల రోజువారీ సంపాదనకు బాల్యాన్ని, భవిష్యత్తుని ఫణంగా పెడుతున్న స్కూలు డ్రాపవుట్ల గురించి ఆలోచించాలి. ప్రతి బిడ్డకూ విధిగా నాణ్యమైన విద్యను అందించే ఏర్పాటును ప్రభుత్వం చేత చేయించగలగాలి. అది జరిగితేనే ఈ దేశం బాగుపడుతుంది, లేకుంటే మెరుపులకన్నా మరకలే ఎక్కువవుతాయి. మన రాష్ట్రంలో చూస్తే టెక్నో, టెక్నో ఏసీ, నానో, నానో టెక్నో ఏసీ, ఒలంపియాడ్, గ్లోబల్, అకాడమీ స్కూల్స్ వంటి పేర్లతో చాలా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. స్కూళ్ల పేర్లు చూసి కూడా తల్లిదండ్రులు మోసపోతున్నారు. తమ పిల్లలను ఇబ్బంది పెడుతున్నారు. ప్రపంచంలో వివిధ రంగాలకు చాలామంది గొప్ప వ్యక్తులు ఇలాంటి స్కూళ్ల నుంచి రాలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే క్వాలిఫైడ్ టీచర్ల కంటే అనేక రెట్లు తక్కువ అర్హతలున్నవారు చాలా ప్రైవేటు స్కూళ్లలో బోధన చేస్తున్నారని తల్లిదండ్రులు గుర్తించటం లేదు. ఆ స్కూళ్లలో చేస్తున్నదల్లా అగ్గిపెట్టెల్లాంటి అపార్ట్‌మెంటుల్లో పిల్లల్ని రుద్దుతున్నారు. ఇక్కడ మార్కులు తప్ప చదువు రాదు. దీన్ని మార్చాలనే సంకల్పం, మార్చేలా పాలకుల మెడలు వంచాలనే లక్ష్యం ముందు తల్లిదండ్రులలో ఏర్పడాలి. విలువలతో పనిలేదు, రేపేం జరిగినా పర్లేదు అనుకుంటే కొన్ని తరాలు నష్టపోయే ప్రమాదముంది.

కాబట్టి వాళ్లు వెంటనే మేలుకొని విద్యావ్యవస్థ సంస్కరణల్లో తమ వంతు కీలక బాధ్యతల్ని నెరవేర్చాలి. నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందించే అవకాశాన్ని ఈదేశ పాలకులు, వాళ్లకు ఓట్లేసిన మనమంతా జారవిడిచాం కాబట్టి, ప్రభుత్వ పాఠశాలలతోపాటు ప్రభుత్వ గుర్తింపు ఉన్న ప్రైవేటు పాఠశాలల్ని కూడా కొంతకాలం మనం వినియోగించుకోక తప్పదు. అలా ప్రభుత్వ పరిధిలో ఉన్న ఈ ప్రభుత్వ/ప్రభుత్వేతర పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన జరిగేలా వ్యవస్థీకృత ఏర్పాట్లను చేయించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో సరిగా చెప్పకపోతే, విద్యార్థుల సంఖ్యను బట్టి అంచనా వేసి ఆ మేరకు ఉపాధ్యాయుల జీతాలకు కోత విధించి ఆ డబ్బును విద్యార్థుల ట్యూషన్‌కి వెచ్చించాలి. విద్యాబోధన ఎలా జరుగుతుందో విద్యాప్రమాణాలను బట్టి ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు బోర్డుల్ని ఏర్పాటు చేయాలి. పరీక్షల పద్ధతుల్ని సవరించి విద్యార్థులు ఆహ్లాదకరంగా తమ పరిజ్ఞానాన్ని వ్యక్తం చేసేలా మూల్యాంకన పద్ధతుల్ని రూపొందించాలి. స్థానిక ప్రభుత్వాలకు, తల్లిదండ్రుల కమిటీలకు విద్యాసంస్థల్లో పాత్ర కల్పించేలా చేయాలి. తల్లిదండ్రులు ప్రభుత్వం గుర్తించిన ఏ స్కూలును ఎంచుకున్నా ప్రభుత్వమే ఫీజు చెల్లించాలి. 12వ తరగతి వరకూ స్కూలు విద్యలో నాణ్యతా ప్రమాణాలను మెరుగుపరుస్తూ అందరికీ అలాంటి చదువును అందుబాటులోకి తేవాలి. ప్రాథమిక స్థాయిలో మాతృభాషలో బోధనను అమలుచేయటంతోపాటు తరగతులు పెరుగుతున్నకొద్దీ ఆంగ్లం, ఇతర భాషలను పరిచయం చేస్తుండాలి. ప్రాంతీయ రాజకీయాలు చేయకుండా ప్రపంచస్థాయి ప్రమాణాల కనుగుణంగా ఉన్నత విద్యనూ ప్రక్షాళన చేయాలి. చరిత్ర సహా అన్ని సబ్జెక్టులకూ ఉన్నత విద్యలో స్థానం కల్పించాలి. పైచదువులు వెళ్లాలను కుంటున్నవారెవరికైనా డబ్బు లేకపోతే ప్రభుత్వమే అందుకు ఏర్పాట్లు చేయాలి. ఈ మార్పులన్నిటితో లోక్‌సత్తా ఇటీవల కేంద్ర మానవ వనరుల శాఖకు తన నివేదికను అందించింది. నూతన జాతీయ విద్యావిధానంలో భాగం చేయాలని కోరింది. అందరికీ నాణ్యమైన విద్య కోసం కేంద్రానికి ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా అందించిన సవరణలు, సూచనల పూర్తివివరాలను www.fdrindia.org వెబ్‌సైట్‌లో చూడవచ్చు. ప్రభుత్వ విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసి బతికించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.

# లోక్‌సత్తా కన్వీనర్ల నియామకం

లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర విభాగాలకు కొత్తగా నియామకాలు చేపట్టారు. సాంస్కృతిక, కార్మిక విభాగాలకి కన్వీనర్లుగా రామ్ దేశ్‌పాండే, సామ కొండల్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు నియామకపత్రాలను అందచేశారు. కార్యక్రమంలో లోక్‌సత్తా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు దుర్గారావు, పార్టీ నేతలు



సరోజాదేవి, గంగాభవాని, సుబ్రమణ్యం, పద్మావతి, శివరామకృష్ణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# కమిషన్ ద్వారానే న్యాయ నియామకాలు

- సీహెచ్ రమణ కుమార్ రెడ్డి,
న్యాయవాది

దేశంలో ముఖ్యంగా 1993 నుంచి సుప్రీంకోర్టు కొలీజియం పద్ధతి ద్వారా ఉన్నత న్యాయమూర్తుల నియామకం జరుగుతున్నది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పద్ధతులను పరిశీలిస్తే అగ్రరాజ్యం అమెరికాలో రెండంచెల న్యాయవ్యవస్థ పనిచేస్తున్నది. ఫెడరల్ కోర్టులు, రాష్ట్ర కోర్టులు. ప్రజాస్వామ్యానికి మాతృకగా భావించే ఇంగ్లండ్‌లో న్యాయమూర్తుల నియామక ప్రక్రియ జ్యుడీషియల్ అపాయింట్ మెంట్స్ కమిషన్ ఆధ్వర్యంలో జరుగుతుంది. జర్మనీ దేశంలోనూ రెండంచెల న్యాయవ్యవస్థ ఉన్నది. దక్షిణా ఫ్రికాలో 23మందితో కూడిన జ్యుడీషియల్ సర్వీసెస్ కమిషన్ ను సంప్రదించి, దేశాధ్యక్షుడు న్యాయమూర్తులను నియమిస్తాడు. అర్జెంటీనా, బ్రెజిల్ లాంటి లాటిన్ అమెరికా దేశాల్లో న్యాయమూర్తులను ఆయా దేశాల అధ్యక్షుడు చట్టసభల ఆమోదంతో నియ మిస్తారు.



ఫ్రాన్స్‌లో ప్రభుత్వం న్యాయమూర్తుల జాబితాను తయారుచేసి, న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ సంస్థ అయిన హై కౌన్సిల్ ఆఫ్ ద జ్యుడీషియరీకి సిఫార్సు చేస్తుంది. ఈ కౌన్సిల్‌లో ఆ దేశ మాజీ అధ్యక్షులతోపాటు 9మంది సభ్యులు ఉంటారు. వారిలో ముగ్గురిని ఆ దేశ అధ్యక్షుడు నియమిస్తారు. ముగ్గురిని జాతీయ అసెంబ్లీ అధ్యక్షుడు నియమిస్తారు. మిగతా ముగ్గురిని సెనేట్ అధ్యక్షుడు/అధ్యక్షురాలు నియమిస్తారు. రష్యన్ ఫెడరేషన్‌లోనూ న్యాయవ్యవస్థ రెండంచెల్లో ఏర్పాటు చేయబడింది. ఫెడరల్ కోర్టులు, రష్యా సమాఖ్య ప్రజల కోర్టులు. వీటిలో న్యాయమూర్తులను ప్రత్యేకంగా నియమించబడ్డ బాడీ ఆఫ్ జ్యుడీషియల్ కమిటీ ద్వారా నియమిస్తారు. ప్రస్తుతం న్యాయమూర్తులతో కూడిన ప్రత్యేక కొలీజియం న్యాయమూర్తుల ఎంపికను నిర్దేశిస్తుందని చెప్పవచ్చు.

భారతదేశ న్యాయమూర్తుల నియామక ప్రక్రియను పరిశీలిస్తే, 1993 పూర్వం వరకు దేశాధ్యక్షుడు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సీనియర్ న్యాయమూర్తులను సంప్రదించి హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులను నియమించేవారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కొలీజియం సిఫార్సు ఆధారంగా న్యాయమూర్తుల ఎంపిక జరుగుతున్నది. కొలీజియం పద్ధతి న్యాయవ్యవస్థకు కార్యనిర్వహణ, శాసన నిర్మాణ వ్యవస్థకు మధ్య ఏర్పడిన అపోహల వల్ల ఏర్పడింది. ముఖ్యంగా త్రీ జడ్జెస్ కేసెస్ (మూడు న్యాయమూర్తుల కేసులు) కొలీజియానికి మాతృక అని చెప్పవచ్చు.

న్యాయవ్యవస్థ, కార్యనిర్వహణ వ్యవస్థలకు మధ్య అంతరానికి బీజం 1981లో పడింది. నాటి కేంద్ర న్యాయశాఖా మంత్రి పంజాబ్ గవర్నర్, దేశంలోని వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు రాస్తూ ఆయా రాష్ట్రాలలోని హైకోర్టుల్లో మూడో వంతు న్యాయమూర్తులు ఇతర రాష్ట్రాలకు చెందినవారై ఉండేట్లు చూడాలని, సంబంధిత రాష్ట్రాల హైకోర్టు అదనపు న్యాయమూర్తుల నుంచి ఇతర రాష్ట్రాలకు బదిలీపై వెళ్లటానికి సంబంధించి సమ్మతి పత్రాలను తీసుకోవాలని కోరడంతో వివాదం మొదలైంది. ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం (మొదటి కేసు: ఎస్.పి గుప్తా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా) న్యాయశాఖ వ్యవహారాల్లో కార్యనిర్వహణ శాఖ ప్రమేయాన్ని రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం అని అభిప్రాయపడింది. ఈ సందర్భంలో కార్యనిర్వహణ శాఖ ప్రమేయం లేని స్వతంత్ర న్యాయవ్యవస్థే రాజ్యాంగ ఉవాచ అని తేల్చడానికి అనేక ఉదాహరణలను చూపింది. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు రాష్ట్రపతి దయ మీద ఆధారపడి పనిచేయటం లేదు. రిటైర్మెంట్ వయసు వచ్చేవరకు వారిని ఎవరూ తొలగించలేరు. ఒక్క ఇంపీచ్‌మెంట్ సందర్భంలో మినహాయించి, వారి జీతభత్యాలను ప్రభుత్వాలు చెల్లించడం లేదు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి చెల్లిస్తారు. ఒక్క ఇంపీచ్‌మెంట్ మోషన్ ఉన్న సందర్భంలో మినహా మరే సందర్భంలో కూడా, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయస్థానాల్లో పనితీరు మీద, తీర్పుల మీద చర్చించే అధికారం పార్లమెంటుకు గాని, అసెంబ్లీలకు గాని లేదు. తన తీర్పులకు కట్టుబడని వారిని కంటెంప్ట్ ఆఫ్ కోర్టు కింద శిక్షించే అధికారం

ఒక్క న్యాయవ్యవస్థకే ఉన్నది. రాజ్యాంగం ప్రసాదించిన ఈ ప్రత్యేకతల ముఖ్య ఉద్దేశం కార్యనిర్వహణ పరిధి నుంచి న్యాయవ్యవస్థకు పూర్తి స్వేచ్ఛను ఇవ్వడమే అని ధర్మాసనం అభిప్రాయపడింది. అదేవిధంగా న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడాల్సిన బాధ్యత కూడా న్యాయవ్యవస్థదే అని తేల్చిచెప్పింది. ఈ కేసులో ధర్మాసనం తీర్పు కొలీజియం ఆలోచనకు బీజాలు వేసింది. అయితే రెండో న్యాయమూర్తుల కేసు (సెకండ్ జడ్జెస్ కేసు: సుప్రీంకోర్టు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా)లో 9మంది న్యాయమూర్తులతో కూడిన సుప్రీం ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో కొలీజియం పద్ధతి స్థిరపడిపోయింది. నాటి చీఫ్ జస్టిస్ జేఎస్ వర్మ నేతృత్వంలో 7-2 మెజారిటీతో ధర్మాసనం ఇచ్చిన తీర్పు నేటి వరకు వివిధ వేదికల మీద చర్చించబడుతూనే ఉన్నది. తదనంతర కాలంలో 1998లో నాటి రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ ఆర్టికల్ 143 కింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుని సుప్రీంకోర్టును కొలీజియానికి దారితీసిన పరిస్థితులను ప్రశ్నించగా, 9మందితో కూడిన సుప్రీం ధర్మాసనం (మూడవ న్యాయమూర్తుల కేసు: ఇన్ రే స్పెషల్ రిఫరెన్స్ 1 ఆఫ్ 1998) కొలీజియం పద్ధతిని సమర్థించు కుంటూ జవాబు ఇచ్చింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మరి నలుగురు సీనియర్ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, సంబంధిత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇద్దరు సంబంధిత హైకోర్టు సీనియర్ న్యాయమూర్తులు సభ్యులుగా ఏర్పడిన కొలీజియం 1993 నుంచి నేటి వరకు వివిధ హైకోర్టులు, సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల నియామకాలకు రాష్ట్రపతికి సిఫార్సు చేస్తూ వస్తున్నది.

కొలీజియం పద్ధతిలో జవాబుదారీతనం, పారదర్శకత లోపించిందనే భావనతో, జాతీయ న్యాయమూర్తుల నియామక కమిషన్ (ఎన్‌జేఏసీ) చట్టాన్ని 99వ రాజ్యాంగ సవరణ ద్వారా 2014లో పార్లమెంటు ఆమోదించింది. ఎన్‌జేఏసీ రాజ్యాంగ విరుద్ధమంటూ 2015లో సుప్రీంకోర్టు కొట్టివేసింది. (లోక్‌సత్తా 14 ఏళ్ల కృషితో ఈ చట్టం వచ్చింది. సుప్రసిద్ధ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ జేఎస్ వర్మ, జస్టిస్ వెంకటాచలయ్య, న్యాయమూర్తి జస్టిస్ కృష్ణయ్యర్‌లతో కలిసి ఈ చట్టాన్ని రూపొందించటం, అన్ని పార్టీలనూ ఒప్పించి పార్లమెంటులో ఆమోదించేలా చేయటం, సగానికిపైగా రాష్ట్రాల ఆమోదముద్ర పొందటం కోసం లోక్‌సత్తా చేసిన అలుపెరగని ప్రయత్నం చేసి ఎన్‌జేఏసీని సాకారం చేసింది. ప్రజలలో రాజకీయ వ్యవస్థ పట్ల ఉన్న చులకన భావాన్ని ఆసరాగా తీసుకుని ఎన్‌జేఏసీని సుప్రీంకోర్టు ఈరోజు కొట్టివేసినా కొన్నేళ్ల తర్వాతైనా తన తీర్పు తప్పు అని అంగీకరించి తిరిగి కమిషన్ ఏర్పాటు చేసేందుకు సహకరిస్తుందని లోక్‌సత్తా విశ్వాసంతో ఉంది. ఎన్‌జేఏసీతోపాటు న్యాయవ్యవస్థలో సమర్థులు రావటానికి ఐఏఎస్ తరహాలో ఇండియన్ జ్యుడీషియల్ సర్వీసు (ఐజేఎస్), న్యాయమూర్తుల జవాబుదారీతనం కోసం ఏర్పాట్లు తదితర సంస్కరణల కోసం కూడా లోక్‌సత్తా కృషి చేస్తోంది– లోక్‌సత్తా టైమ్స్)ఎన్‌జేఏసీని కొట్టివేయటంతో కార్యనిర్వహణ, న్యాయవ్యవస్థల మధ్య అంతరం మరింత పెరిగింది. నిజానికి ఎన్‌జేఏసీ కూర్పులో న్యాయవ్యవస్థ పాత్రను పరిమితం చేయడం లేదనే చెప్పవచ్చు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షతన ఏర్పడే ఈ కమిషన్‌లో ఇద్దరు సీనియర్ సుప్రీంకోర్టు న్యాయమూర్తులతోపాటు కేంద్ర న్యాయశాఖా మంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు సభ్యులుగా ఉన్న కమిటీచే ఎన్నుకోబడిన ఇద్దరు సుప్రసిద్ధులు సభ్యులుగా ఉంటారు. అయినప్పటికీ ఇవేవీ సుప్రీంకోర్టును సంతృప్తిపరచలేకపోయాయి.

వీఆర్ కృష్ణయ్యర్ లాంటి న్యాయకోవిదులు స్టోరీ ఆఫ్ ఎ చీఫ్ జస్టిస్ పుస్తకానికి ముందుమాట రాస్తూ, కొలీజియం పద్ధతి అందుబాటులో ఉన్న అత్యున్నత న్యాయమూర్తులను ఎంపిక చేయటంలో విఫలమైందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రుమాల్‌పాల్, ఎస్ఎస్ సోఢి లాంటి న్యాయమూర్తులు, నారీమన్ లాంటి నిష్ణాతులు కొలీజియం అనుకున్నది సాధించలేక పోయిందనే బాధను వ్యక్తం చేశారు. రెండవ న్యాయమూర్తుల కేసుకు నాయకత్వం వహించిన నాటి చీఫ్ జస్టిస్ వర్మ కూడా తదనంతర కాలంలో కొలీజియం పద్ధతి మీద పునరాలోచన చేయాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేయటం గమనార్హం.

ప్రధానమైన రెండు విభాగాలు– న్యాయశాఖ, శాసన నిర్మాణ శాఖల మధ్య ఏర్పడిన ప్రతిష్టంభన చాప కింద నీరులా విస్తరిస్తున్నది. వివిధ హైకోర్టులు, సుప్రీంకోర్టుల్లో ఏర్పడ్డ 450కి పైగా జడ్జీ పదవుల ఖాళీలు సమస్య తీవ్రతకు అద్దం పడుతున్నాయి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కంట తడిపెట్టిన సందర్భం, సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులను రాష్ట్రపతి తిరస్కరించిన సందర్భాలను పరిశీలిస్తే వీటి మధ్య దూరం ఎంతగా పెరిగిపోయిందో ఆలోచించవచ్చు. న్యాయమూర్తుల నియామకాల్లో కార్యనిర్వాహక వ్యవస్థకు, చట్టసభలకు సంపూర్ణ అధికారాలు ఇవ్వడం ఎంత అసంబద్ధమో, న్యాయశాఖే స్వయంగా సహచర న్యాయమూర్తులను నియమించుకోవడం కూడా అంతే అసంబద్ధం. ఏ రకంగా చూసినా జాతీయ న్యాయమూర్తుల నియామకానికి కమిషన్‌లాంటి ప్రత్యేక సంస్థల ఏర్పాటు సహేతుకంగానే అనిపిస్తుంది.

(నమస్తే తెలంగాణ సౌజన్యంతో)

# జాతి ఐక్యతా దినోత్సవంగా జరుపుకుందాం

- కూసంపూడి శ్రీనివాస్,
లోక్‌సత్తా పార్టీ ఏపీ అధికార ప్రతినిధి

ఒక నాగరికత, సంస్కృతి గల భారత జాతి తొలిసారిగా ఒకే ప్రభుత్వం, ఒకే పతాకం కిందకు వచ్చిన రోజైన సెప్టెంబర్ 17ను భారతజాతి మొత్తం ఐక్యతా దినంగా జరుపుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. యావత్ భారతదేశం ఒకే గొడుగు కిందకు వచ్చిన చరిత్రాత్మక క్షణం హైదరాబాద్ విమోచన దినం. అనేక వైవిధ్యాలు ఉన్న భారతదేశంలోని 545కి పైగా సంస్థానాలను కేవలం ఏడాది కాలంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పెద్ద రక్తపాతం లేకుండా ఏకం చేయటం ప్రపంచ చరిత్రలోనే ఓ అద్భుతం. అటువంటి మహత్తర సందర్భాన్ని హిందూ-ముస్లిం మతసమస్యగా చిత్రీకరించడం మూర్ఖత్వమే అవుతుంది. సెప్టెంబర్ 17పై ఎడతెగని వివాదాలు ఈ ఏడాది కూడా కొనసాగిన నేపథ్యంలో, ఆ చారిత్రక దినోత్సవం రోజున ఏం జరిగిందో మనందరం మననం చేసుకుని సరైన కార్యాచరణను నిర్ణయించుకోవటం అవసరం.




1947 ఆగస్టు 15న కోట్లాదిమంది భారతీయులు బానిస సంకెళ్ల నుంచి విముక్తి పొందిన పర్వదినం. దేశమంతా స్వాతంత్ర్య సంబరాలు జరుపుకొంటున్నా, హైదరాబాద్ సంస్థానంలోని కోటీ 20లక్షలమంది ప్రజలలో అత్యధికులు కన్నీటి వేదనను దిగమింగాల్సిన పరిస్థితి. భారత యూనియన్‌లో తన రాజ్యాన్ని విలీనం చేసేదిలేదని ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ చేసిన రేడియో ప్రకటన వారిని ఖిన్నులను చేసింది. స్వతంత్రం కోసం నినదించిన వారిని ఎక్కడికక్కడ అరెస్టులు చేస్తూ నిజాం పోలీసులు, సైన్యం రాజ్యమంతా దిగ్బంధం చేశారు. అయినా ప్రజలను కట్టడి చేయలేకపోయారు. అప్పటికే రజాకార్ల పేరుతో నిజాం ప్రయివేటు సైన్యం ఖాసిం రజ్వీ ఆధ్వర్యంలో చేస్తున్న అకృత్యాలు సంస్థానం ప్రజలలో తీవ్రమైన ఏహ్యభావాన్ని కలుగచేశాయి. భారత స్వాతంత్ర్యానికి ముందే నిజాం సంస్థాన ప్రజలు సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాటాలు ప్రారంభించారు. స్వామి రామానంద తీర్థ నాయకత్వంలో స్టేట్ కాంగ్రెస్, రావి నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో కమ్యూనిస్టులు, పండిట్ రామచంద్రరావు నాయకత్వంలో ఆర్యసమాజం నిజాం విముక్తి పోరాటాలు సాగిస్తున్నాయి. 1946 వరకూ ఆ ఉద్యమాలన్నీ గాంధేయ పద్ధతిలోనే జరిగాయి. దొడ్డి కొమరయ్య మరణంతో ఉద్యమం సాయుధ పంథా వైపు నడిచింది. మల్లు స్వరాజ్యంలాంటి వీర నారీమణులు రజాకార్లను గడగడలాడించారు. దసరా రోజున భువనగిరి తాలూకాలోని ఓ గ్రామంలో మహిళలను వివస్త్రలను చేసి నగ్నంగా బతుకమ్మ ఆడించిన నరరూప రాక్షసులు రజాకార్లు. నారాయణరావు పవార్, గంగారాం, జగదీష్‌లాంటి యోధులు ఆఖరి నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ కారుపై బాంబు విసిరి హత్యాయత్నం చేశారు. కానీ నిజాం ఆ బాంబు దాడిలో బతికి బయటపడ్డాడు. పవార్‌ను ఆయనకు సహకరించిన వారిని అరెస్టు చేశారు. వీరికి ఉరిశిక్ష విధించినా, శిక్ష అమలు చేసే సమయానికి భారత సైన్యం నిజాంను లంగదీసుకోవటంతో బతికి బయటపడ్డారు. షోయబుల్లా ఖాన్, చాకలి ఐలమ్మ లాంటి ఎందరో యోధులు తమ ప్రాణాలకు లెక్కచేయకుండా రజాకార్ల దౌర్జన్యాలను ఎండగట్టారు. ఇంకా ఇలా ఎందరో వీరులు నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా గొప్ప పోరాటాలు చేశారు.

మీర్ ఉస్మాన్ అలీఖాన్ 21లక్షల చదరపు కిలోమీటర్ల వైశాల్యం ఉన్న హైదరాబాద్ సంస్థానంలో 10శాతం, అంటే 2.1 లక్షల చదరపు కిలోమీటర్ల స్థలం కేవలం తన సొంత అడ్డాగా ఉపయోగించుకున్నాడు. అప్పటికే 2.5కోట్ల వార్షిక ఆదాయంతో దేశంలోని సంస్థానాలన్నింటిలోకీ అత్యంత ధనిక సంస్థానంగా హైదరాబాద్ ఉంది. 1946 జూన్ 12న ఏడవ నిజాం రేడియోలో ప్రసంగిస్తూ బ్రిటీష్ రాజ్యం ఇండియాలో అంతమయినా తన రాజ్యాన్ని మాత్రం భారత యూనియన్‌లో కలిపే ప్రసక్తే లేదని ప్రకటించుకొన్నాడు. కానీ నిజాం ఆటలు ఇక ఎంతో కాలం సాగలేదు. భారత సైన్యం హైదరాబాద్ సంస్థానాన్ని ఇండియా భూభాగంలో కలిపేందుకు ప్రత్యేక ఆపరేషన్ మొదలుపెట్టింది. ఆ ఆపరేషన్ పేరు 'క్యాటర్ పిల్లర్'.

నిజానికి అంతకుముందు దీనికి 'ఆపరేషన్ పోలో' అని పేరు పెట్టారు. అప్పటికే 'కబడ్డీ' పేరుతో రజాకార్లను సంస్థానం సరిహద్దుల నుంచి కొంత లోపలికి తరిమే కార్యక్రమం నడిచింది. పోలో వ్యవహారం బైటికి పొక్కిందేమోనన్న అనుమానంతో 1948 జులై 13న కొత్తగా 'గొంగళి పురుగు' పేరుతో నిజాం పని పట్టడం ప్రారంభించారు. మేజర్ జనరల్ జె.ఎన్ చౌదరి సారథ్యంలో దాడుల ప్రణాళిక సిద్ధమైంది. పూనేలో సిబ్బందిని సమాయత్తం చేసే కార్యక్రమంలో ఆయన తలమునకలుగా ఉన్నారు. హైదరాబాద్ సంస్థానాన్ని ముందు రెండు వైపుల నుంచి ముట్టడించాలన్నది పథకం. పశ్చిమాన 289 కిలోమీటర్ల దూరంలో ఉన్న షోలాపూర్ నుంచీ, అలాగే తూర్పున 287 కిలోమీటర్ల దూరంలో ఉన్న విజయవాడ నుంచి ముట్టడి మొదలుపెట్టాలని నిర్ణయించారు. మలిదాడుల కోసం ఉత్తర, దక్షిణాల్లోని మూడు ప్రాంతాలను ఎంపిక చేశారు. సైన్యానికి వైమానిక దళం దన్నుగా నిలబడింది. అవసరమైతే ప్రతిఘటనను అణచివేసేందుకు విమానాశ్రయాలను బాంబులతో ధ్వంసం చేయాలని రంగం సిద్ధం చేశారు. నాడు హకీంపేట్ ప్రధాన విమానాశ్రయం. ఆ తర్వాత వరంగల్, బీదర్ విమానాశ్రయాలున్నాయి.


అంతకుముందు హైదరాబాద్ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేయడానికి చేసిన రాజకీయ ప్రయత్నాలన్నీ వృథా అయ్యాయి. మౌంట్ బాటన్ ఒత్తిళ్లకు అప్పటివరకూ లొంగుతూ వచ్చిన ఉక్కుమనిషి వల్లభాయ్ పటేల్ కూడా బాటన్ నిష్క్రమణ తర్వాత దృఢంగా వ్యవహరించారు. సయ్యోధతో విలీనం సాధ్యమవుతుందన్న ఆశలు ఢిల్లీలో పూర్తిగా అడుగంటాయి. 1948 ఆగస్టు 17న నిజాం ప్రభుత్వం కొత్త ఎత్తు వేసింది. హైదరాబాద్ సంస్థానానికీ, భారత ప్రభుత్వానికీ మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించాల్సిందిగా కోరుతూ తమ ప్రభుత్వం ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిని ఆశ్రయిస్తోందంటూ నైజాం సంస్థాన ప్రధాని లాయాక్ అలీ భారత ప్రధాని నెహ్రూకు వర్తమానం పంపారు. కానీ దీనికి భారత ప్రభుత్వం అంగీకరించలేదు. హైదరాబాద్ ప్రతినిధుల విమాన ప్రయాణానికి అనుమతి కూడా నిరాకరించింది. అయినా నిజాం విదేశాంగ మంత్రి నవాబ్ మొయిన్ నవాబ్ జంగ్ సారథ్యంలో ఒక బృందం పాకిస్తాన్ వెళ్లి, అక్కడి నుంచి విమానంలో ప్యారిస్ చేరుకుంది. ఇక దాడి తప్ప వేరే మార్గంలేదని ఇరువర్గాలు గుర్తించాయి. ఇక్కడ నిజాం సైన్యం ఎంతకాలం భారత సైన్యాన్ని ఎదుర్కోగలదన్నదే ప్రశ్న. ఎందుకంటే, నిజాం సైన్యానికి గెలిచే అవకాశమే లేదు. కానీ హైదరాబాద్ సర్వసైన్యాధ్యక్షుడు ఎల్ ఎడ్రూస్ మాత్రం భారత సైన్యం ఒట్టి 'బనియా' సైన్యమని, ధైర్యవంతులైన హైదరాబాద్ సైనికులు వారిని కనీసం ఆర్నెల్లయినా ఎదుర్కొంటారని గొప్పలు చెప్పుకున్నాడు. ఇవన్నీ జనాన్ని నమ్మించడం కోసమే. ఎందుకంటే నిజాంకు చెప్పేటప్పుడు మాత్రం ఆయన అందులో సగమే చెప్పాడు. ఇక ప్రధాని మీర్ లాయక్ అలీ మాత్రం నాలుగు లేదా ఆరు దాటదని అంచనా వేసుకున్నాడు. అప్పటికే లాయక్ అలీ పాకిస్తాన్ వెళ్లడం, సహాయం అడిగి భంగపడి రావడం జరిగిపోయింది. హైదరాబాద్‌లో రోడ్ల మీద ఒకటే హంగామా. రజాకార్లు నిజాంకు, ఖాసిం రజ్వీకి అనుకూలంగా నినాదాలు చేస్తూ బస్సుల్లో, రోడ్ల మీద తిరిగారు. పవిత్ర యుద్ధంలో సాయుధ పోరాటమే ధ్యేయమన్నారు. అవసరమైతే వీరమరణానికీ సిద్ధమన్నారు. భారత ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు ఆరంభించింది. హైదరాబాద్ సంస్థానంలో తమ ప్రతినిధి అయిన కె.ఎం మున్షీని కంటోన్మెంట్ నుంచి ప్రధాని నివాసం షామంజిల్ (ఇప్పటి రాజ్‌భవన్) పక్కనే ఉన్న లేక్ వ్యూ అతిథి గృహానికి తరలించి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. మున్షీ అప్పటికే కీలకమైన రికార్డులన్నింటినీ రక్షణ శాఖకు తరలించేశారు. తన వ్యక్తిగత పత్రాలనూ పంపిస్తూ తనకేమన్నా అయితే తన భార్య లీలావతికి అందచేయాలని వర్తమానమూ పంపారు. కళ్యాణి-బీదర్ రోడ్డు మీద భారత సైన్యం, ట్యాంకుల కదలికలు ఆరంభమైనట్టు ప్రధాని లియాక్ అలీకి వర్తమానం అందింది. కానీ సంస్థానం దగ్గరున్న మ్యాపులలో ఆ రోడ్డే లేదు. అంత గొప్పగా వున్నాయి వారి దగ్గర మ్యాపులు. అదేసమయంలో ఖాసిం రజ్వీ ప్రధాని లియాక్ అలీని సంప్రదించి భారత సైన్యంపై తిరుగుబాటుకు తమ వాళ్లకు ఆయుధాలు కావాలని కోరాడు. నిజాం సైన్యం బస్సులలో బయలుదేరింది. అప్పటికే సూర్యాపేట వరకూ మేజర్ ధనరాజులు నాయుడు సారథ్యంలో వచ్చేసిన భారత సైన్యం ఎటువంటి ప్రతిఘటన లేకపోవడంతో ముందుకు కదిలింది. ఒక్క నిజాం సైన్యం దిక్కులేని స్థితిలో ఉంటే, ఉర్దూ పత్రికలు, దక్కన్ రేడియో మాత్రం యుద్ధంలో వారు అద్భుతంగా ఎదిరిస్తున్నారంటూ ప్రగల్భాలు పలుకుతున్నాయి. ఖాసిం రజ్వీ జిల్లాలన్నీ తిరుగుతూ ఆలిండియా రేడియో 'పటేల్ రేడియో' అనీ, భారత ప్రభుత్వాన్ని హిందూ ప్రభుత్వమనీ ప్రచారం చేస్తూ మతతత్వాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేశాడు. హైదరాబాద్ సైన్యం వెనక్కి మళ్లుతుంటే.. అది వ్యూహంలో భాగమేనని ప్రచారం చేసుకొన్నారు. ఇంతలో ఔరంగాబాద్ భారత వశమైందంటూ 'ఆకాశవాణి ఔరంగాబాద్' చేసిన ప్రకటన దక్కన్ రేడియోలోనూ కలకలం రేపింది. ఇక ఆరోజు రానే వచ్చింది. సెప్టెంబర్ 17, 1948. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో నిజాం

వ్యక్తిగతంగా మున్షీకి వర్తమానం పంపారు. 4గంటలకు రమ్మని ఆహ్వానం. ఆ సాయంత్రం మున్షీ కింగ్ కోఠికి వెళ్లేసరికి 'దొంగలంతా రాజీనామా చేశారు. ఇప్పుడేం చేయాలో పాలుపోవడం లేదు' అని నిజాం తలపట్టుకున్నారు. అప్పటికే ఆయన చేతులు వణుకుతున్నాయి. ప్రధాని లియాక్ అలీ రాజీనామా లేఖను మున్షీ చేతికి ఇచ్చారు. మున్షీ నిజాంతో రేడియోలో పోలీసు చర్యను స్వాగతిస్తున్నామని ప్రకటించవలసిందిగా కోరారు. ఎటువంటి హంగూ ఆర్భాటం లేకుండా మొదటిసారిగా నిజాం రేడియో స్టేషన్లో అడుగుపెట్టారు. 'నా వల్ల జరిగిన తప్పులను క్షమించండి' అని నిజాం రేడియోలో చేసిన ప్రకటనతో ఒక శకం ముగిసింది. నిరంకుశత్వం సంకెళ్లు తెగిపోయి ప్రజాస్వామ్య స్వాతంత్ర్య వాయువులు వీచాయి.

ఇది నిజాం పీడన నుంచి విముక్తి కోసం హైదరాబాద్ సంస్థానం ప్రజలు సాగించిన వీరోచిత పోరాటం. నియంతలాంటి నిజాం మెడలు వంచి హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో కలపడానికి వల్లభాయ్ పటేల్ చూపిన తెగువ మరపురానిది. ఇది ఒక ఉద్యమ చరిత్ర. ప్రజాస్వామ్యం- రాచరికానికి మధ్య జరిగిన పోరాటంలో ప్రజాస్వామ్యం విజయం సాధించిన రోజు ఇది. ఈ పోలీసు చర్య సమయంలో కొంతమంది ముస్లిం మీద ఊచకోత జరిగిందని, అత్యాచారాలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. వీటిని నిగ్గుతేల్చాల్సిందే. అయితే ఈరోజు మనం ఆలోచించాల్సింది- ఉత్సవాలు చేయాలా వద్దా అన్నది కాదు. ఆనాటి జనజీవనానికి, ఈనాటి జనజీవనానికి మధ్య తేడాని అర్థం చేసుకొని అందరికీ ఎదిగే అవకాశాలున్న ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించటం ఎలా అన్నదే మనముందున్న సవాలు. అప్పటి నేతల తీరును, ఇప్పటి నేతల తీరును పరిశీలించుకుని రాజకీయాల్లో ఆధునిక రాచరికాన్ని అంతంచేసేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాల్సిన సందర్భమిది. ఆనాడు ఎన్నో పోరాటాలు చేసిన వల్లభాయ్ పటేల్, వెల్లోడీ, బూర్గుల రామకృష్ణారావు లాంటి స్వాతంత్ర్య యోధుల పిల్లలు ఏం చేస్తున్నారో పెద్దగా ఎవరికీ తెలియదు. వీరి వారసులెవరూ రాజకీయ పదవుల కోసం వెంపర్లాడలేదు. కానీ ఇవాళ అలా ఉందా? తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా ప్రజాస్వామ్యం నెలకొందా? రాజకీయం అంటే కేవలం సొంత సంపాదనకు, కుటుంబం ఎదుగుదలకు మార్గం అనుకునే దుస్థితి ఇంకా ఇంకా పెరుగుతోంది. ఇటువంటి నేతల నుంచి జాతిని రక్షించాలి. లోక్‌సత్తా పార్టీ ఆశయం, యువతకు ఇచ్చే పిలుపు అదే. నాటి విమోచన సమరయోధుల స్ఫూర్తితో సమాజంలోని అన్ని వర్గాల నుంచి ప్రజలు ముందుకు రావాలని, రాజ్యాంగ విలువలు ఆచరణలో చూపుతూ, కులం, మతం, డబ్బు వివక్షలు లేకుండా అందరికీ ఎదిగే అవకాశాలు ఉండే విధంగా రాజకీయాల్ని మలిచేందుకు కొంత సమయం, వనరులు కేటాయించాలని లోక్‌సత్తా పిలుపునిస్తోంది. హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని కేవలం తెలంగాణలోనే కాకుండా యావత్ భారతదేశంలోనూ జరపాలని లోక్‌సత్తా ఎప్పటినుంచో కోరుతోంది. ఆంధ్రప్రాంతంలోని లోక్‌సత్తా కార్యాలయాల్లో కూడా ఈ పండుగను జాతి ఐక్యతా దినోత్సవంగా నిర్వహించారు. ప్రతిపక్షాలు, పౌరసమాజం నుంచి విజ్ఞతతో కూడిన డిమాండ్లను చూశాకయినా.. దీన్ని హిందూ-ముస్లిం వివాదంగా చూసే ధోరణికి స్వస్తిచెబుతూ భారత జాతి ఐక్యతా దినంగా ఏటా అధికారికంగా జరిపేందుకు తెలంగాణ ప్రభుత్వం చొరవ చూపాలి.

# లోక్‌సత్తా కార్యాలయంలో జాతి ఐక్యతా దినోత్సవం

**తా**జా సెప్టెంబర్ 17ను భారత జాతి ఐక్యతా దినోత్సవంగా లోక్‌సత్తా నిర్వహించింది. హిమాయత్‌నగర్ లోక్‌సత్తా కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో పార్టీ తెలంగాణ అధ్యక్షుడు డా॥ పాండురంగారావు మాట్లాడుతూ, దేశ చరిత్రలో ఈ ఉద్యమానికి చారిత్రక ప్రాధాన్యత ఉన్నదన్నారు. వెట్టిచాకిరి, పెత్తందారీ వ్యవస్థలకు ఇది తెరదించిందన్నారు. ప్రజాస్వామిక వ్యవస్థకు ఊపిరిలూదిందన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గారావు, జీహెచ్ఎంసీ అధ్యక్షుడు దోసపాటి రాము, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, సరోజాదేవి,



నాయకులు శివరామకృష్ణ, నిఖిల్, రాజు, గోపాల్, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైల్వేజోన్ ఉత్తరాంధ్రుల హక్కు విశాఖపట్టణానికే కేటాయించాలి








రైల్వే జోన్ ఉత్తరాంధ్రుల హక్కు అని, విశాఖపట్టణానికే కేటాయించాలని లోక్‌సత్తా పార్టీ డిమాండ్ చేసింది. రైల్వేజోన్‌పై రోజుకోమాట చెప్పటాన్ని పార్టీ నేతలు తీవ్రంగా ఖండించారు. వైజాగ్ రైల్వేజోన్ కోసం విఖపట్నంలో లోక్‌సత్తా, వామపక్షాలు, వైసీపీ ఆందోళనలు నిర్వహించాయి. రాష్ట్ర విభజన జరిగి రెండున్నరేళ్లు గడిచిపోయినా ఇప్పటికీ హామీలు నెరవేర్చకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాత్సారం చేస్తున్నాయని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ప్రభుత్వాల మధ్య సయోధ్య ఉంటే ప్రజలకు ఎంతో మేలుజరుగుతుందన్న అభిప్రాయానికి భిన్నంగా, రెండు ప్రభుత్వాలూ కుమ్మక్కయినట్టు ప్రజలను మభ్యపెడుతున్నాయన్నారు. ప్రజలు వాస్తవాలను ఇప్పటికైనా గుర్తించి ఎన్నికలలో ఇచ్చిన హామీల్ని నెరవేర్చేలా పాలకుల మీద ఒత్తిడి తేవాలన్నారు. విశాఖలో రెండురోజుల ఆందోళనల అనంతరం రైల్వేజోన్‌ను విశాఖపట్టణానికే కేటాయించాలనే డిమాండ్‌పై లోక్‌సత్తా విజయనగరంలోని గురజాడ పబ్లిక్‌స్కూల్‌లో అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించింది. ఉత్తరాంధ్ర రక్షణ వేదిక కన్వీనర్, సీనియర్ పాత్రికేయుడు ఎస్. శివశంకర్ రౌండ్‌టేబుల్‌లో మాట్లాడుతూ, రైల్వేజోన్‌పై మాటతప్పితే ఉత్తరాంధ్ర సహించదన్నారు. విశాఖ కేంద్రంగా రావాల్సిన రైల్వేజోన్‌పై బీజేపీ, టీడీపీ దొంగాటలాడుతున్నాయన్నారు. యువతకు ఉపాధి దొరకాలన్నా, ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలన్నా విశాఖకు రైల్వేజోన్ కూడా కీలకమన్నారు. మన నాయకులు పోరాటాలు చేయకుండా గాలిలో కత్తులు తిప్పుతున్నారని బాబ్జీ ధ్వజమెత్తారు. ఈ అంశంపై ప్రజల్లో చైతన్యం పెంచాలని వివిధ పార్టీల, సంఘాల నేతలు అన్నారు. విశాఖకు రైల్వేజోన్ వచ్చేవరకూ పార్టీలకతీతంగా పోరాడాలని రౌండ్‌టేబుల్ తీర్మానించింది. సమావేశంలో వైసీపీ నాయకులు రాజేష్, గాడు అప్పారావు, డీసీసీ అధ్యక్షుడు యడ్ల ఆదిరాజు, సీపీఐ నేత బుగత సూరిబాబు, బీఎస్పీ నాయకుడు సోము, ప్రజాసంఘాల ప్రతినిధులు మామిడి అప్పలనాయుడు, అల్లూరి శివవర్మ, ఎంఎస్ కామేశ్వరరావు, మన్యాల శ్రీనివాసరావు, అదాడ మోహనరావు, భానుమూర్తి, ఉపేంద్ర, రమేష్, తెరుపల్లి శ్రీనివాసరావు, చిన్నారావు, గోవిందు, రమణ తదితరులు పాల్గొన్నారు.










100 మంది సమర్థులను గుర్తించి సామాజిక రంగంలో సీనియర్ నాయకులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో డా॥ రెడ్డీస్ ఫౌండేషన్, ఫికస్ సోషల్ సొల్యూషన్స్, ఐఐఎం బెంగళూరు ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన 'అరిత్ర' నాయకత్వ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని దిశానిర్దేశం చేస్తున్న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్



Posting Date 07-10-2016
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on October 1st, 2016




Book-Post

PRINTED MATTER

To

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad